57358

ప్రజాశక్తి ఆదివారం అనుబంధం

డిసెంబర్ 28, 2008

శ్రీకాకుళం



బ్రతుకు దారం హృదయ ద్వారం

APPY NEW YEAR

హ్యాపీబర్త్‌డే

(2008 డిసెంబర్-28 నుంచి
2009 జనవరి-3 వరకు)

ఎ. అనీష్
3సం॥, జనవరి-1
సదాలక్ష్మి-మధురాం
అంబర్‌పేట్-హైదరాబాద్

ఎ. అఖిల్
1సం॥, డిసెంబర్-28
సులోచన-గోపీకృష్ణ
అంబర్‌పేట్-హైదరాబాద్



ఉమర్‌రాజా
1సం॥, జనవరి-3
షబానారాజా-అయుబ్‌రాజా
డోర్నకల్-వరంగల్

పి. శ్రావణ్‌కుమార్
జనవరి-4
సావిత్రి-వెంకటేష్
ఆర్మూర్

ఉజ్మాబేగం
5సం॥, జనవరి-1
మొహ్సిన్‌బేగం-మహ్మద్
కిషన్‌బాగ్-హైదరాబాద్

పి.ఆర్తి
4సం॥, జనవరి-1
సృజన-వెంకటేశ్వర్లు
సీతానగర్-గుంటూరు

సిహెచ్. రాణాప్రతాప్
1సం॥, జనవరి-3
సుజాత-రాజశేఖర్
బాల్టిమోర్-అమెరికా

ఎం. షబానా
జనవరి
షాకిరున్నిసా-రహమత్‌బేగ్
చిత్తూరు

కె. కీర్తన
7సం॥, డిసెంబర్-30
కాత్యాయని-ఫణిరాజరావు
సోమనాథ్‌నగర్-అనంతపురం

ఆహ్వానం

మీ చిన్నారులకు కూడా ఇలా పుట్టిన రోజు శుభాకాంక్షలు చెప్పాలని ఆశ పడుతున్నారా! అయితే ఆలస్యం ఎందుకండి! వెంటనే పోస్ట్ కార్డు తీసుకోండి. దాని మీద మీ బాబు- పాప పేరు , పుట్టిన తేదీ, నెల, సంవత్సరం, ఊరు , తల్లిదండ్రుల వివరాలు రాసి పోస్ట్ చేయండి. అన్నట్టు కార్డు పై కలర్ ఫొటో అతికించడం మరువకండి. అయితే మీ చిన్నారి వివరాలను 15 రోజుల ముందుగానే మాకు అందేవిధంగా పంపగలరు.

మా చిరునామా
హ్యాపీబర్త్‌డే, ప్రజాశక్తి
స్ట్రీట్ నెం. 1, అశోక్‌నగర్,
హైదరాబాద్.

మనలో మాట

టెన్షన్... టెన్షన్

'ఎలక్షన్లంట గద సారూ...!' పాన్‌డబ్బావాలా ప్రశ్న.

'అవును వస్తున్నాయి'

'అది కూడా ఇంగో నాలుగు నెలల తర్వాతంట గద సారూ...' టెన్షన్ పడిపోయాడు పాన్‌డబ్బావాలా

'అవును గానీ... నీకెందుకు పరేషానీ?!'

'అప్పటి దాకా ఈ మాటలు భరించాలి గద సారూ... పిచ్చికుక్క... బురదపంది... టీవీ ఆన్‌చేస్తే గలీజ్ గలీజ్ మాటలు.... పేపర్ విప్పినా అవే

పీత కష్టాలు పీతవి...అంటే ఇదేనేమో

ఎదుటివారు ఏమని తిడ్తారో... ఎత్తుకు పై ఎత్తుగా నేనేమి తిట్టాలి...మీడియావాళ్లు రాయాలన్నా చూపెట్టాలన్నా రిపిటీషన్ లేకుండా తిట్టాలి... క్రియేటివిటీ చూపెట్టాలి. తిట్లేమో అయిపోతున్నాయి... ఏం చేసేది.. నాయకుల టెన్షన్...

నాయకుల సదరు సుభాషణాలు అలాగే ఇవ్వాలా...? స్పేస్ ఖరాబు చేసుకోవాలా...? కాని ఇతరులిస్తారే..ఇవ్వకపోతే మనం మిస్సయినట్లే కదా.... ఏం చేద్దాం.. జర్నలిస్టుల టెన్షన్ .

రేపొద్దునకల్లా ఎవరు ఏమి తవ్వితీస్తారో ఏవేవో స్కూప్‌లు...ఏవేవో ఎక్సక్లూజివ్‌లు,.. మనమేం మిస్సవుతామో.... కొన్ని పత్రికలకు టెన్షన్.

వాటమైన వార్తలను ఎదుటివారి మీదికి ఎలా మళ్లిద్దాం...గుడ్డ కాల్చి నెత్తినేసినట్లు ఉండాలి. ఎలా... మరి కొన్ని పత్రికల టెన్షన్.

ఈ ఎన్నికల్లో రాష్ట్రంలో అధికారం.. వచ్చే ఎన్నికల్లో కేంద్రంలో అధికారం...హః... .హః...హః... చెప్పడానికి బాగానే చెప్పాం...కాని అసెంబ్లీలోకి అడుగైనా పెడ్తామా... ఒక్క సీటైనా వస్తుందా... ఓ పార్టీ అధినేత టెన్షన్.

మూడోవంతు మెంబర్లకు గోల్డెన్ హ్యాండ్‌షేకట...అందులో నేనుంటానేమో... ఖర్మకాలితే రెబల్‌గా వేయాలా... వేరే పార్టీ చూసుకోవాలా.. త్వరగా తేలితే బావుండేది... టికెట్ వచ్చినా ఈసారి కొంపమునుగుతుందేమో... అధికార పార్టీ ఎమ్మెల్యే టెన్షన్.

పొత్తుంటే నా సీటు ఉంటుందో... టికెట్ వస్తే చాలా.. ప్రచారానికి పైసలు కావద్దూ... ధరలు కొండెక్కాయి.. ఎంత కావాలో ఏమో... కష్టాల్లో ఉన్నమంటూ దాతలు ఈసారి ఎగనామం పెడ్తారేమో... అమెరికా కష్టాలు మన మీద ఇప్పుడే పడాలా.... టికెట్ గ్యారెంటీ అభ్యర్థుల టెన్షన్.

కటౌట్లు పెట్టించడం....కొండంత అట్టబొమ్మనెక్కి దండలు వేయడం...హడావిడి చేయడం...ఎమ్మెల్యే టికెట్ వస్తుందా... లేక సినిమా టికెట్లేనా మా బతుకు...ఫ్యాన్‌ల టెన్షన్.

ఇంతకీ బొమ్మ సరిగ్గా పడిందా... గూడు మారిన పక్షుల్లో టెన్షన్.

అసలే సంక్షోభం... ఎక్కడ నుండి ఫోన్ వస్తుందో.. ఎంత పంపమంటారో.. వ్యాపారుల టెన్షన్.

ఎవరుంటారో...? ఎవరు పోతారో...? ఎవరి మీద పెట్టుబడి పెట్టేది... అంతా గందరగోళం... బడా కంపెనీల టెన్షన్.

టెన్షన్...టెన్షన్....

ఎన్నికల టెన్షన్.

✠

ఈ సంచికలో....

టపా	...	2
క్రైమ్ కథ	...	3
విజ్ఞాన వీచిక	...	4
కవిత్వమ్	...	11
బాలనేస్తాలు	...	12
రుచి	...	16
అట్టమీది కథ	...	18
మననా తెలుసా	...	21
చూద్దామా	...	22
కథ	...	26
కొత్త పుస్తకాలు	...	28

ఇంకా...

సినిమా ...6

సాహసంలోనే సంతోషం

2008రౌండప్ ... 8

అగ్రహీరోలెందుకు నటించడంలేదు

ఆరోగ్యం ... 17

రేబిస్ రాకుండా

మంచి పుస్తకం ... 24

మహాకవి మలిముద్ర ఖడ్గసృష్టి

సూపర్ కథ

ప్రజాశక్తి దిన పత్రిక గత 28 సంవత్సరాలుగా, ప్రజలకు సేవ చేయాలనే ఉద్దేశ్యంతో ప్రతి అక్షరం ప్రజల కోసం సాయపడాలంటూ నడుం కట్టుకుని, సమాచారాన్ని సకాలంలో తెలియజేస్తూ... మంచి అభివృద్ధిపథంలో పయనిస్తున్న నా... ప్రియమైన ప్రజాశక్తి దిన పత్రిక ఈ 2009 సంవత్సరంలో మంచి పేరు ప్రఖ్యాతులతో వెలుగొందాలని కోరుకుంటున్నాను. సేవా దృక్పధంతో పని చేస్తున్న ప్రధాన సంపాదకులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు. ఈవారం మనలో మాట శీర్షికలో 'తాడు తెగుతుంది జాగ్రత్త' అంటూ విచిత్రమైన సంఘటనను విశ్లేషించిన తీరు బాగుంది. ఈ శీర్షికను అందించిన స్నేహకు కృతజ్ఞతలు. విజ్ఞాన వీచికలో 'కాలుష్యంతో కాసులు' అంటూ కార్బన్ క్రెడిట్ల గురించి మాకు తెలియని అనేక విషయాలను తెలుసుకున్నాం. దేశ విభజన - రాజకీయ విశ్లేషణ అనే పుస్తకంలో దేశ విభజనకు సంబంధించిన వివిధ రాజకీయ వర్గాలను వాస్తవంగా గుర్తించి మంచి పుస్తక రూపంలో ముద్రించినందుకు ధన్యవాదాలు. పుస్తక సమీక్షను తెలకపల్లి రవిగారు విశ్లేషణాత్మకంగా కొనసాగించిన తీరు బాగుంది. 'రక్తస్రావం-రకాలు' అని దాని లక్షణాలను, కారణాలను తెలియజేస్తూ డాక్టర్ జయన్ చాలా చక్కగా వివరించారు. ఈవారం అట్టమీది కథ సూపర్‌గా ఉంది. పండగల్లాగే చానళ్లకు కూడా ఓ సీజనుంది అంటూ మాకు తెలియని అనేక విషయాలను ప్రస్తావిస్తూ, నూటిగా తెలియజేసినందుకు ధన్యవాదాలు. ఇంకా కథలు, కవిత్వము, వంటకాలు, న్యాయసలహాలు, బాలనేస్తాలు... ఇలా చిన్న పిల్లల దగ్గరనుండి పెద్దల వరకు కుటుంబ సమేతంగా చదువుకునే రీతిలో చక్కగా తీర్చిదిద్దుతూ వారం వారం మాతో ముచ్చటిస్తున్న స్నేహకు నా కృతజ్ఞతలు. ముందుగా 2009 నూతన సంవత్సర శుభాకాంక్షలు.

కర్రా వరప్రసాద్,
యలమర్రు,కంద్రిక.

మరో రాజ్ పుట్టాలి

నా అభిమాన నటుడు, కళాతపస్వి, జిస్‌దేశ్‌మే గంగా బహతీహై, మేరా నామ్ జోకర్, బాబి, ప్రేమ్‌రోగ్, సత్యం శివం సుందరం వంటి అద్భుత చలన చిత్ర కళాఖండాల సృష్టికర్త, మహానటుడు, దర్శకుడు, స్వాప్నికుడు, భారతదేశం గర్వించతగ్గ గొప్ప ఎవర్‌గ్రీన్ హీరో స్వర్గీయ రాజ్‌కపూర్ గురించి ఈ వారం స్నేహలో చదివి ఎంతో పరవశించాను. అలనాటి ఆవారా, శ్రీ420, రాజ్‌కపూర్ నటన న భూతోనభవిష్యత్‌గా సినిమా చరిత్రకారులు ఈ నాటికి చెపుతూ ఉంటారు. రాజ్‌కపూర్ నటన, సాటి కళాకారులకు ఎంతో స్ఫూర్తి దాయకం అయ్యింది. రాజ్‌కపూర్ అద్భుత ప్రేమ కథా చలన చిత్ర దృశ్య కావ్యం 'బాబీ' చిత్రం! కొన్ని వందలసార్లు చూసిన ప్రేమికులు ఈ నాటికి ఉన్నారు ఈ చిత్రంలో. ప్రేమికుల మధ్య సహజప్రేమ ఎలా వుంటుంది అనేది అనేక దృశ్యాలలో, డైలాగ్స్‌లో, పాటలలో చూపబడింది. మళ్ళీ మరో రాజ్‌కపూర్ పుట్టాలని కోరుకుందాం!

జె. సుధాకర్ పట్నాయక్,
శ్రీయువరంజని కళావేదిక,
కాకినాడ.

విజ్ఞానదాయకం

'దేశ విభజన రాజకీయ విశ్లేషణ' పుస్తక పరిచయం వలన అనేక విషయాలు తెలుసుకున్నాం. ప్రపంచ చరిత్రలో అత్యంత విధ్వంసకర సంఘటనలతో మొదలై లక్షలమంది చనిపోయారు. గ్లోబల్ వార్మింగ్ ప్రమాదాన్ని తెలియజేసే కాలుష్యంతో కాసులు వ్యాసం విజ్ఞాన దాయకంగా ఉంది.

టి. శ్రీరామమూర్తి, గాజువాక.

కవర్ విశేషాలు సవివరంగా వున్నాయి

స్నేహలో అట్టమీదికథ 'నాగసూరి వేణుగోపాల్' గారి "చానళ్ల పరవళ్లు "... చదివాం. అనేకనేక చానళ్ల స్వరూప స్వభావాలను క్లుప్తంగానయినా సవివరంగా అందించారు. "సినిమా కబుర్లు"లో కృష్ణుడు కబుర్లు... చక్కగా ఉన్నాయి. వారి న్యూలుక్ కోసం ప్రేక్షకులూ ఎదురు చూస్తున్నారు. వంకరటింకర కొమ్మల ఆకారాలతో వస్తువులు వింత సోయగాలతో హోయలొలికించాయి. పుప్పాల కృష్ణమూర్తి గారి 'అమ్మ మాట' కథ బావుంది. 'ఓ మంచి పుస్తకం' అంటూ అందిస్తున్న శీర్షికలో ఏదో ఒక మంచి పుస్తకం గురించి సమగ్ర విశ్లేషణతో, మాకు పరిచయమవ్వటం ఎంతో బావుంది. "బాలనేస్తాలు" శీర్షికలో మాకు "చిత్రంలో విచిత్రం" అంశం అంటే భలే ఇష్టం. మంత్రులయినాగాని 'తిక్క' వేషాలేస్తే తాడు తెగుతుందన్న... "మనలోమాట"తో మేమూ సంపూర్ణంగా ఏకీభవిస్తున్నాము.

నేమాన సుభాష్ చంద్రబోస్,
ఇలిసిపురం, శ్రీకాకుళంటౌన్.

చక్కటి కవర్

14వ తేది ఆదివారం స్నేహలో అట్టమీది కథగా (చానళ్ల పరవళ్లు)లో సీరియల్స్, సినిమాలు, ఆటలు, పాటలు మొదలైన కార్యక్రమాల్తో ప్రేక్షకుల్ని ఆకర్షిస్తూ ఎప్పటికప్పుడు న్యూస్, కొత్త ఛానల్‌తో కార్యక్రమాల్ని చేపడుతూ విజయపథాన పయనిస్తున్న టీవీ చానళ్ల గురించి ఈ వారం స్నేహ



చాలా చక్కగా, తెలియజేసింది. చూద్దామాలో మాక్‌నాక్ ద్వీపం గురించి వివరించారు. అక్కడ ఉన్న అందాల ప్రదేశాల గురించి తెలియజేశారు. సినిమాకబుర్లులో వినాయకుడు సినిమాల్లో నటించి అభిమానులను నవ్విస్తూ, కేరింతలుపెట్టిన చిన్ని కృష్ణుడు నటన అద్భుతం. అలాగే ఈ కృష్ణుడు ఇంక మంచి సినిమాలు చేసి అభిమానుల మనస్సులో వినాయకుడిగానే స్థిరపడాలని ఆశిస్తున్నాము. వంకరటింకర కొమ్మలను చాలా అందమైన వస్తువులుగా తీర్చిదిద్దారు. ఇంటి హాల్లోగాని, బెడ్‌రూమ్‌లోగాని ఇలాంటి వస్తువులు ఉంటే చూడచక్కగా ఉంటాయి. ఈవారం 'అమె దారి' కథ బాగుంది. ఒక మనిషిని బతికించడానికి ఎంతపెద్ద ఆసుపత్రి అయినా, ఎంత ఖర్చైనా వెనకాడకుండా అత్యవసర సమయంలో చికిత్స జరిగిందా లేదా అని చూడాలి. అంతేకాని, చూస్తూ మనకెందుకులే అని ఊరుకోవడం పొరబాటు. ఈ కథ అందించిన తీరు బాగుంది. వై.కుసుమకుమారిగార్కి కృతజ్ఞతలు.

అనుపోజు. సంతోషినాగరాజు,
రాజీవ్‌నగర్ కాలనీ, విజయనగరం.

తీరి తీరి దుమ్మాడి పండు

ఈ ఫోటో
ఓ ప్రముఖ రాజకీయ
నాయకుడిది.
ఎవరో తెలియాలంటే
23 వ పేజీ చూడండి.

క్రైమ్ కథ

క్లూ

- యర్నాగుల సుధాకరరావు

"నేను ఇన్‌స్పెక్టర్ రాజేష్‌వర్మ. నేను మీఇంటి గుమ్మంలో ఉన్నాను. మీరు తలుపులు తీస్తే లోపలికి వస్తాను. చాలా సాదాసీదాగా వచ్చాను. ఈమధ్య తప్పిపోయిన ప్రదీప కేసు గురించి మీఅమ్మాయి లతను కొన్ని విషయాలు అడగాలి" సెల్‌లో చిన్నగొంతుతో చెప్పాడు. ఆమాటలు వింటూనే ఆఇంటి యజమాని తడబడుతూ వెళ్ళి తలుపులు తెరిచాడు. తెల్లని షర్టు ప్యాంటు వేసుకుని సాదాసీదాగా వచ్చానన్నట్టే వచ్చాడు.

"మీరు గౌరవమైన కుటుంబీకులు అని తెలిసి జీపు వేరే చోటపెట్టి ఇలా నడిచి వచ్చాను. ఒకసారి మీఅమ్మాయిని పిలవండి. నాలుగే ప్రశ్నలు వేసి వెళ్లిపోతాను" సన్నగా నవ్వుతూ చెప్పి కూర్చున్నాడు.

క్షణాల్లో లత వచ్చి ఎదురుగా నిలబడింది. "ఏమ్మా నీఫ్రెండు ప్రదీప వారం క్రితం కాలేజికి బయల్దేరి అటు కాలేజికి ఇటు ఇంటికి చేరలేదు. నీకు ఏమైనా చెప్పిందా?"

"లేదుసార్ ఆమె నాకు ఏమీ చెప్పలేదు. కానీ, ఆముందురోజు నాయనమ్మ తద్దినం రోజు కూడా మనకు పరీక్ష ఉంది. లేకుంటే ఎంత బావుణ్ణు అని మాత్రం నాతో చెప్పింది. నాయనమ్మ అంటే చాలా ఇష్టపడేది"

"ఆమెకు ఎవరైనా బోయ్‌ఫ్రెండున్నాడా? ఉంటే అతడెవరు?"

"ఉన్నాడు. ఆవిషయం తెలిసినదంతా నాకే. అయితే అతనెవరో కాదు. మాఅన్నయ్యే. ప్రదీప ఇలా మిస్ అయ్యిందో లేదో వీడు అన్నపానీయాలు మానుకుని తల బాదుకుంటున్నాడు. ఈవిషయం మాఅమ్మానాన్నకు కూడా తెలియదు. ఆగదిలో ఉన్నాడు"

ఇన్‌స్పెక్టర్, అక్కడే ఉన్న లత తల్లితండ్రీ అయోమయంగా చూశారు. "సార్ మాఅమ్మాయి మీరు ఒకటి అడిగితే ఏదోదో చెప్పేస్తోంది. దీని తీరు చూస్తుంటే ఒకరికి తెద్దామా అందరికి తెద్దామా అన్నట్టుంది. మాఅబ్బాయికి ఫ్లూజ్వరం వచ్చిపడుకున్నాడు" తండ్రి సర్దిచెప్పబోయాడు.

అప్పటికే దుప్పటి కప్పుకుని వచ్చాడు ఆకుర్రాడు. "సార్ మీమాటలు విన్నాను. మాచెల్లెలు చెప్పింది నిజమే. కానీ, ఆమె గురించి ఊళ్లో అనుకున్నది మాత్రం తప్పు. ఎవరితోనో వెళ్లిపోయిందని చెప్పడం మరీ తప్పు. ఆమెకు పోలియో కారణంగా ఒక పాదం మడతపడి ఉంటుంది. ఆమెకు పెళ్లి తలంపే లేదు. ఆమె జీవితం వేరుగా ఆలోచించుకునేది. ఆమె మంచితనాన్ని నేను అభిమానించాను. ఆమెకు ధైర్యం చెప్పాను. అప్పుడు నామాటలతో పెళ్లికి సిద్ధమైంది. తీరా అర్ధాంతరంగా ఇలా అయ్యింది. నాకు చాలా బాధగా ఉంది సార్" చెప్పి తల విసరడంతో తల పట్టుకుని కుర్చీలో కూలబడ్డాడు.

"నీపొజిషన్ బాలేదు. నేను తర్వాత వచ్చి మాట్లాడతాను. నీఆరోగ్యం జాగ్రత్త" చెప్పి లేచాడు ఇన్‌స్పెక్టర్.

"సార్ వెళ్లిపోవద్దు. నన్ను మీరు చాలా అడగండి. నామాటల వలన నా ప్రదీపకు మంచి జరగాలనుకుంటున్నాను. లేనిశక్తి తెచ్చుకుని మరీ మీకు చెబుతాను. ప్లీజ్ వెళ్లిపోవద్దు. ఒకవేళ నేను చచ్చిపోతే మీకు ఎలాంటి క్లూ అందదేమో!" విజారంగా చెప్పాడు. ఆమాటలకు అయోమయంగా చూశారు తల్లితండ్రులు.

వెనుదిరిగివచ్చాడు ఇన్‌స్పెక్టర్. తోడుపట్టి బెడ్‌రూమ్‌లోకి నడిపించాడు. మంచంమీద పండుకున్నాక నీరసంగా కళ్లుతెరిచి "సార్ అడగండి. నేను బాగానే ఉన్నాను. నాకు ఫ్లూజ్వరం తగ్గింది కానీ, నీరసం తగ్గలేదు. పైగా ప్రదీపకు ఏమైందో తెలియని పరిస్థితిలో నేను మరింత బాధపడడమే నానీరసానికి కారణం" అని లేని నవ్వును పులుముకుని చెప్పాడు.

"భార్గవ్ ప్రదీప మిస్సింగ్‌కేసులో ఆమె తల్లితండ్రులు కూడా ఏమీ చెప్పలేకపోతున్నారు. ఎవరూ శత్రువులు లేరని చెబుతున్నారు. పైగా ప్రదీప అంటే వారి బంధువులకు చాలా ఇష్టమని చెప్పారు. పెద్దనాన్న ఇంట్లోకూడా కొన్నాళ్లు పెరిగిందంట. అతడు చాలా విచారించాడు. వెతికిపెట్టమని కోరాడు. ఏవిధంగా చూసుకున్నా ఏచిన్నక్లూ నాకు అందలేదు" నొసలు నొక్కుకుని ఇన్‌స్పెక్టర్ బెడ్‌కు ఎదురుగా కూర్చున్నాడు.

"సార్ ఆమెను ఎవరు ఎత్తుకెళ్లడానికి లేదు. ఇంటినుంచి వెళ్లేది కాలేజ బస్సులో, ఆతర్వాత దిగేది కాలేజిలోనే. ఇతరత్రా ఎక్కడికి వెళ్లదు" తల పీక్కుని మరీ గుర్తుచేసుకుని చెప్పినట్టు చెప్పసాగాడు.

"ఆమెను ఆకతాయిలు ఎత్తుకెళ్లారు అనేదానికి మావద్ద ఎలాంటి ఆధారాలు లేవు. ఎవరో కావాలనే ఎత్తుకెళ్లారు. అదే ఎవరు? నీకు ఎవరైనా తనను ఫోన్ చేసి ఇబ్బందులు పెడతున్నట్టు ఎప్పుడైనా చెప్పిందా?"

"లేదుసార్ మామధ్య ఎప్పుడు అలాంటి మాటలుండేవి కావు. అయినా ఇద్దరం ప్రేమలో మునిగితేలిపోలేదు. ఇద్దరం చదువుమీద దృష్టినిలిపే ఉన్నాం. అన్నట్టు ఆమె నాయనమ్మ చనిపోయినరోజున ఆఇంటిలో తద్దినం వంటివి చేస్తుంటారు. ప్రదీప పరీక్ష ఉన్నందున కాలేజికి వెళ్లింది. ఆతద్దినం రోజే కన్పించకుండా పోయింది. నాయనమ్మ చనిపోతూ కుంటితనం వలన ప్రదీపను ఎవరూ చేసుకోరని నాలుగురోడ్ల కూడలిలో ఉన్న భవంతిని వేరేగా ప్రదీపకు మాత్రమే రాసింది. ఈవిషయం నాతో చాలాసార్లు చెప్పింది. ఆభవనం ఖరీదు నలభై లక్షలపైమాటే"

ఇన్‌స్పెక్టర్ నిట్టూర్చి లేచాడు. "సరే నీవు ఆరోగ్యం సరిచూసుకో! ప్రదీపను వెతికితెస్తాం. అయినా నీవేం పీకల్లోతు ప్రేమలో లేవని చెబుతున్నావు. నీ లవ్వులో పట్టుదల, గౌరవం ఉన్నాయి. నిన్ను ఎవరూ వేలెత్తి చూపరు" చెప్పి బయటికి నడిచాడు. వెనుకనే వెళ్లాడు భార్గవ్ తండ్రి.

ఇన్‌స్పెక్టర్ సెల్‌ఫోన్‌లో ఆదేశాలు జారీచేశాడు. "సబ్‌ఇన్‌స్పెక్టర్ నువ్వు వాన్‌తో వెళ్లి ప్రదీప పెద్దనాన్నను మూసేసి ఠాణాకు తీసుకు వచ్చేయ్. అతడికి నేరం ఒప్పుకోమని చెప్పు. ఈలోగా నేను వచ్చేస్తాను"

"సార్ నేరమంటున్నారు ప్రదీప పెద్దనాన్నను అరెస్టు అంటున్నారు" భార్గవ తండ్రి అడిగాడు. అతడితో ఇన్‌స్పెక్టర్ వరండాలో గొంతు తగ్గించి చెప్పాడు. "మీఅబ్బాయిని ఆసుపత్రిలో ఎడ్మిట్‌చేసి అతడిని ఆరోగ్యవంతుడయ్యేలా చూడండి. ఈరోజు ఊరవతల పాడుపడ్డబావిలో ప్రదీప శవం దొరికింది. దిక్కుమాలిన శవం అనుకున్నాం. పోస్టుమార్టమ్‌లో ఆమెను కేవలం కావాలనే చంపారు ఎలాంటి గాయాలులేవు. అత్యాచారం జరగలేదు. కనుక ఆకతాయిలపని కాదు. ఈలోగా శవం దుస్తులు, మడతపడ్డ కుడిపాదం చూశాక ఆమె ప్రదీప అని తెలిసింది. ఆమెను ఎవరు చంపారో ఇంతవరకు తెలియలేదు. తీరా మీ అబ్బాయి మాటలలోనే తెలిసింది. ఆమె పెద్దతండ్రి కేవలం ఆస్థికోసం చంపేశాడు. నాయనమ్మ ప్రదీప పెళ్లికోసమని ఆమె పేర ఒకిల్లు రాసింది. ఆమెను చంపితే ఆఇంటిలో తనవాట తనకు వస్తుందని పెద్దనాన్నే చంపేశాడు అని చిన్నపిల్లాడైనా అనుమానిస్తాడు. నేను చెప్పిన ఈవిషయాలేవి నీకొడుకుకు తెలియకుండా జాగ్రత్తపడండి. అతడు కుదుటపడ్డాక చెప్పవచ్చు. ఇక్కడికి వచ్చాకే ప్రదీప హత్యకేసు ముడివీడిపోయింది."

అప్పుడే లత వచ్చింది. ఆమె తండ్రి "పదమ్మా ఇన్‌స్పెక్టర్‌గారు వెళ్లిపోతున్నారు. ఎలాగైనా ప్రదీపను వెతికిపట్టుకుంటామని చెప్పారు. మనకది చాలు పదా!" అని చెప్పాడు. ఇన్‌స్పెక్టర్ సన్నగా నవ్వుతూ రోడ్డు ఎక్కాడు.

ప్రదీప అంటే వారి బంధువులకు చాలా ఇష్టమని చెప్పారు. పెద్దనాన్న ఇంట్లోకూడా కొన్నాళ్లు పెరిగిందంట. అతడు చాలా విచారించాడు. వెతికిపెట్టమని కోరాడు. ఏవిధంగా చూసుకున్నా ఏచిన్నక్లూ నాకు అందలేదు" నొసలు నొక్కుకుని ఇన్‌స్పెక్టర్ బెడ్‌కు ఎదురుగా కూర్చున్నాడు.

ముఖమే మారిపోయె

డా॥ కాకర్లమూడి విజయ్

వాస్తవానికి వైద్య ప్రక్రియల్లో ఈ 'మార్పిడి' చికిత్సలు కొత్తవేం కాదు. ఇంతకు ముందు, ఇప్పటికీ అనేక అవయవాలు మార్పిడి చేయబడుతూనే ఉన్నాయి. కొన్నిసార్లు దాతల నుండి కావలసిన అవయవాలనీ, భాగాలనీ సేకరిస్తే, కొన్నిసార్లు పేషెంటువే సేకరించటం పరిపాటి. మార్పిడి ప్రక్రియ సంక్లిష్టమైనదే. అందులో మరింత కీలకమైనది రోగనిరోధక వ్యవస్థ. ఇతరుల అవయవాలను ఒక శరీర వ్యవస్థ అంత సులభంగా అంగీకరించదు. ఎన్ని జాగ్రత్తలు తీసుకుని చికిత్స జరిపినా ఈ అంతర్గత నిరోధక వ్యవస్థ కొత్త భాగాలను వ్యతిరేకించిన సందర్భాలు ఎన్నో ఉన్నాయి. కొన్నిసార్లు అటువంటి పరిస్థితులను మందులతో సరిదిద్దవచ్చు. కొన్నిసార్లు వీలుపడదు.

వైద్యరంగం నిత్యం కొత్త పుంతలు తొక్కుతూ సరికొత్త విజయాలను నమోదు చేసుకొంటోంది. ఇప్పటికీ కొన్ని అనూహ్యమైన విషయాలను నిజం చేస్తూ ఎన్నో అద్భుతాలను వైద్య నిపుణులు చేసి చూపించారు. కృత్రిమ గర్భధారణ నుండి మూల కణాలతో కావలసిన అవయవం నిర్మించే వీలు వరకూ ఈ విజయాలున్నాయి. తాజాగా 'ముఖ మార్పిడి' వీటికి తోడైంది.

గత కొన్ని రోజుల క్రితం అమెరికాలోని క్లీవ్‌లాండ్ క్లినిక్‌లో ఒక మహిళకు ముఖమార్పిడి చికిత్స చేశారు. చాలా ఘోరంగా దెబ్బతిన్న ముఖాన్ని ఆ మహిళ కోరిక మేరకు మార్చడానికి వైద్యనిపుణులు నిశ్చయించారు. ముఖం మార్చడానికి అవసరమైన చర్మాన్ని మరొక మహిళ మృత దేహం నుండి తీసుకోవడం విశేషం. దాదాపు 80శాతం కొత్త కణజాలం అవసరమైనదని వార్త. ఆ శస్త్ర చికిత్స జరిపించుకున్న మహిళ వివరాలు గోప్యంగా ఉంచబడ్డాయి.

ఈ శస్త్ర చికిత్సకి సుమారు 500 చదరపు సెంటీమీటర్ల కణజాలం (చర్మం, కండరాలు, ఎముకలు, నాడులు, రక్తనాళాలు) అవసరమైంది. ముక్కు దానికింది సైనస్‌లు, పైదవడ, కొన్ని పళ్లు కూడా ఈ చికిత్సలో మార్చబడ్డాయి. ఎనిమిది మంది సర్జన్లు 22 గంటలపాటు శ్రమించి ఈ మార్పిడి కార్యక్రమాన్ని పూర్తి చేశారు. చివరకు పైకనురెప్పలు, నుదురు, చుబుకం, కిందిపెదవి మినహా మొహం అంతా 'కొత్తదే'. శస్త్ర చికిత్స పూర్తవగానే కొత్త చర్మం గులాబి రంగులోకి మారిందని, అదే విజయానికి సంకేతమని వైద్యులు అన్నారు.

ప్రస్తుతం ఆ అపరిచిత మహిళ మాట్లాడగలుగుతోంది, తినగలుగుతోంది, మామూలుగానే శ్వాస తీసుకోగలుగుతోంది.

ఈ చర్మమార్పిడి ఆపరేషన్ అమెరికాలో మొదటిది. ప్రపంచంలో నాల్గవది.

ప్రపంచంలో తొలి ముఖమార్పిడి శస్త్ర చికిత్స ఫ్రాన్స్‌లో 2005 నవంబర్‌లో జరిగింది. అది కూడా మహిళదే - ఆమె పేరు ఇసాబెల్ డైనాయిర్. ముప్పై ఎనిమిదేళ్ల ఇసాబెల్ మత్తు మందు ప్రభావంలో ఉన్నప్పుడు ఒక కుక్క ఆమె ముఖాన్ని దారుణంగా కొరికేసింది. దాంతో ఆమె తన ముక్కు, పెదాలు బుగ్గల్ని కోల్పోయింది. ఆమె చికిత్సకు 15 గంటలు పట్టాయి. ఆమెకు కూడా కావలసిన చర్మాన్ని, అవయవాల్ని ఒక 46 ఏళ్ల మృత దేహంనుండే తీసుకున్నారు. ముఖ మార్పిడి చేసుకున్న రెండవ వ్యక్తి చైనీయుడు. 2003లో అతని ముఖాన్ని ఎలుగుబంటి కొరికివేసింది. కుడివైపు ముఖం దాదాపు మొత్తం పోయింది.

మూడవ ముఖమార్పిడి పారిస్‌లో జరిగింది. 29 ఏళ్ల యువకుడికి అరుదైన జన్యు వ్యాధి వల్ల ముఖం అంతా కణుతులతో నిండిపోయింది. అతను ఈ చికిత్స ద్వారా కొత్త రూపాన్ని పొందగలిగాడు.

ఇటీవలే లండన్‌లోనూ ఇటువంటి అరుదైన చికిత్స జరిగింది. ఐర్లాండ్‌కు చెందిన ఒక పిల్లవాడు కింది దవడ లేకుండానే జన్మించాడు. అలన్ డోహెర్టీ అనే అతను దాదాపు పంతొమ్మిదేళ్లు అలాగే - దవడ లేకుండానే కాలం వెళ్లదీశాడు. బ్రిటీష్ వైద్యులు చివరికి అతనికి ఒక దవడను ఏర్పాటు చేయగలిగారు. కాకపోతే వైద్యులు అతని చర్మాన్ని, ఎముకలనే వాడారు. ఈ చికిత్స ఇంకా పూర్తి కాలేదని, మరిన్ని సంవత్సరాలు ఇందుకు అవసరమని, అనేక విడతల్లో శస్త్ర చికిత్స చేస్తున్న వైద్యులు అంటున్నారు.


ఇసాబెల్ డైనాయిర్

వాస్తవానికి వైద్య ప్రక్రియల్లో ఈ 'మార్పిడి' చికిత్సలు కొత్తవేం కాదు. ఇంతకు ముందు, ఇప్పటికీ అనేక అవయవాలు మార్పిడి చేయబడుతూనే ఉన్నాయి. కొన్నిసార్లు దాతల నుండి కావలసిన అవయవాలనీ, భాగాలనీ సేకరిస్తే, కొన్నిసార్లు పేషెంటువే సేకరించటం పరిపాటి. మార్పిడి ప్రక్రియ సంక్లిష్టమైనదే. అందులో మరింత కీలకమైనది రోగనిరోధక వ్యవస్థ. ఇతరుల అవయవాలను ఒక శరీర వ్యవస్థ అంత సులభంగా అంగీకరించదు. ఎన్ని జాగ్రత్తలు తీసుకుని చికిత్స జరిపినా ఈ అంతర్గత నిరోధక వ్యవస్థ కొత్త భాగాలను వ్యతిరేకించిన సందర్భాలు ఎన్నో ఉన్నాయి. కొన్నిసార్లు అటువంటి పరిస్థితులను మందులతో సరిదిద్దవచ్చు. కొన్నిసార్లు వీలుపడదు.

చైనాలో ముఖమార్పిడి చేయించుకున్న వ్యక్తి ఇటువంటి కారణాలవల్లే మరణించాడు. ఇటువంటి వైద్య ప్రక్రియలవల్ల తాత్కాలికంగా జీవితం పొందగలమే కానీ సంపూర్ణ జీవితం పొందలేమన్నది అటు వైద్యులు కూడా అంటున్న మాటే. అత్యంత సంక్లిష్టమైన శరీర వ్యవస్థకి 'పరాయి' పదార్థాన్ని సహించే లక్షణం తక్కువ. వెంటనే కాకపోతే కొంతకాలం తర్వాతైనా గానీ ఆ 'కొత్త'వాటిని వెళ్లగొట్టే ప్రయత్నం జరుగుతూనే వుంటుంది. అటువంటి మార్పుడులలో నేత్ర సంబంధమైనవీ (కార్నియా), రక్త సంబంధమైనవీ మాత్రమే కొద్దిగా దీర్ఘకాలం మనగలుగుతున్నాయి.

ఇటువంటి అరుదైన 'మార్పిడులు' వైద్యరంగానికి ఘన విజయాలే కానీ, సామాజికంగా చాలా సమస్యలు తెస్తాయని విమర్శకులంటున్నారు. ఇప్పటికే సౌందర్యం పేరుతో ప్లాస్టిక్ సర్జరీలు, బొటాక్స్ ఇంజక్షన్లూ, లైపోసక్షన్లూ, బ్రెస్ట్ ఇంప్లాంట్లూ వంటివి సాధారణమైపోయాయి. కానీ వాటి దుష్ప్రభావాలు కూడా రావడం మొదలయ్యాయి. ఈ తరహాలో చికిత్సల కోసం ఇతరుల అవయవాలు అవసరం అరుదు. కానీ ముఖ మార్పిడి వంటివాటికి ఇతరులవి అవసరం. వాటి అవసరాన్ని సజీవులు తీర్చలేరు కాబట్టి మృతులపై ఆధారపడాలి. ఇదొక సమస్యాత్మక అంశం. అతేకాక అనేక నైతిక అంశాలు కూడా రాబోయే కాలంలో తలెత్తవచ్చు.

చూద్దాం. ఇలాంటి చికిత్సలు ప్రాణాలు నిలబెడతాయో, ప్రాణాలకు ముప్పు తెస్తాయో. ఏదేమైనా, ఒక మానవ నైపుణ్యం విజయం సాధించింది.

ఇంతకు ముందు ఎప్పుడూ లేని స్పెషల్ ఆఫర్

ఈ అద్భుత అవకాశం 2500 మందికి మాత్రమే.

రూ.510/- ల ఇంగ్లీష్ కోర్సు రూ.200/- లకే

మొత్తం మూడు డివిజన్ల ప్రత్యేక ఇంగ్లీష్ కోర్స్

డివిజన్-1		డివిజన్-2		డివిజన్-3		ఇవన్నీ
రూ.130/-	+	రూ.170/-	+	రూ.210/-	=	రూ.200/-

డివిజన్-1 ABCD ల నుంచి ఇంగ్లీష్ చదవటం, రాయటం, నేర్పుతూ, ప్రతి ఒక్కరికీ కావలసిన స్థాయిలో స్టాండర్డ్ ఇంగ్లీష్ నేర్పబడుతుంది. ఈ కోర్స్ ఫీజు రూ. 130/-

డివిజన్-2 తప్పులు లేకుండా ఇంగ్లీషు రాయుటకు కావలసిన ఆంగ్ల వ్యాకరణం పరిపూర్ణంగా సులభ సూత్రాలతో చాలా ఈజీగా నేర్పబడుతుంది. ఈ కోర్సు ఫీజు రూ. 170/-

డివిజన్-3 ఎంతో సులభంగా, ఏ సందర్భంలోనైనా తడబడకుండా, తప్పులు లేకుండా, మంచి నీళ్ళు తాగుతున్నట్లుగా మంచి ఇంగ్లీషు మాట్లాడటం నేర్పబడుతుంది. ఈ కోర్సు ఫీజు రూ. 210/-

4 కోర్స్ గిఫ్ట్ పుస్తకాలు ఫ్రీ
(4 ఇన్ 1 పాకెట్ సైజులో)

1. వర్డ్ పవర్ (ఆంగ్ల పదాల అద్భుత శక్తి)
2. లెటర్ రైటింగ్ ప్రాక్టీస్ (ఇంగ్లీష్‌లో ఉత్తరాలు వ్రాసే పద్ధతి)
3. వెర్బ్స్ డిక్షనరీ (క్రియలు - వాటి రూపాలు)
4. సినానిమ్ & యాంటోనిమ్స్ డిక్షనరీ (ఆంగ్ల సమాన పదాలు & వ్యతిరేక పదాలు)

గిఫ్ట్ పుస్తకాల సైజు 9 cm X 11 cm లోనూ, కోర్స్ మెటీరియల్ సైజు 18cm x 24cm లోనూ, డైరీ సైజు 12 cm X 17.5 cm లోనూ (ఆఫ్‌సెట్ మల్టీకలర్ కవర్‌తో) ఉంటాయి. విద్యార్థుల సౌకర్యాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రతీ సంవత్సరానికి క్రొత్త డైరీగా ఉపయోగించుకునే విధంగా ప్రత్యేకంగా రూపొందించబడిన డైరీ. ఈ కోర్స్ తరువాత కూడా కొన్ని కోర్స్‌లు కలవు. వాటిని మీకు నియమిత నామ మాత్రపు ఫీజుతో పంపడం జరుగుతుంది.

కొత్త సంవత్సర కానుక



STUDENTS' ENGLISH INSTITUTE

Post Bag No. 8569,
New No. 203,(D) Habibullah Road, T.Nagar, Chennai - 17.

నాకు ప్రస్తుతం రూ.510/-లు విలువగలిగిన ఇంగ్లీష్ కోర్సు, ఒక డైరీ మరియు 4 ఉచిత పుస్తకాలు ఇవన్నీ కలిపి కేవలం రూ. 200/- లకే వి.పి.పి. ద్వారా పంపించండి. పోస్ట్‌మేన్‌కి పైకం చెల్లించి ప్యాకెట్‌ని తీసుకుంటానని హామీ ఇస్తున్నాను.
(మీ చిరునామా స్పష్టంగా అర్థమయ్యేలా ఇంగ్లీష్‌లో వ్రాయండి. లేనిచో కోర్సును పంపుటకు వీలుపడదు)

4734-122

స్పెషల్ ఆఫర్ కూపన్.

Name: ....

Address: ....

....

.... Pincode: ☐☐☐☐☐☐

సినిమా కబుర్లు

సాహసంలోనే సంతోషం

దర్శకుని మనో చిత్రాన్ని దృశ్య రూపంలో అందంగా చూపించి కనువిందు చేయాల్సిన బాధ్యత సినిమాటోగ్రాఫర్‌ది. సృజనాత్మకతతోపాటు శారీరక కష్టం కూడా అవసరమయ్యే శాఖ ఇది. 'యాక్షన్, ఛేజింగ్ సన్నివేశాల్లో శారీరకంగా శ్రమించాల్సి ఉంటుంది. వేసవికాలంలో షూట్ చేస్తూ... కథపరంగా శీతాకాలం చూపించాల్సి వస్తే... అందుకు తగ్గ ఎఫెక్ట్స్ తీసుకురావాలి. దీని కోసం మానసికంగా కష్టపడాల్సి వుంటుంది. అలాగే రెయిన్ ఎఫెక్ట్ తీసుకురావడంలోనూ. సన్నివేశాన్ని సహజంగా తీర్చిదిద్దడానికి టెక్నికల్ నాలెడ్జ్ సద్వినియోగం చేసుకుంటూ, క్రియేటివిటీ ప్రదర్శించాలి. ప్రతి సినిమాటోగ్రాఫర్ ఇలాంటి రిస్క్ ఫేస్ చేయాలనుకుంటాడు కాబట్టి... ఇందులో ఎంజాయ్‌మెంట్ ఆస్వాదిస్తాం' అని 'అష్టా-చమ్మా', 'వినాయకుడు' వంటి వరుస హిట్ చిత్రాలకు కెమెరా బాధ్యతలు నిర్వర్తించిన పి.జి. విందాతో ముఖాముఖి....

- చందు

మీ గురించి చెప్పండి?

నా అసలు పేరు పర్వతాలు గోవింద్. 'పర్వతాలు' ఇంటి పేరు. ఫ్రెండ్స్ 'గోవింద్'లోని 'విందా'ను సపరేట్ చేసి పిలిచేవాళ్ళు. దీంతో ఆ పేరునే సినిమా పేరుగా కూడా పెట్టుకున్నాను. మాది మహబూబ్‌నగర్ జిల్లాలోని నాగర్ కర్నూల్ తాలూకాలో పాలెం అనే కుగ్రామం. వ్యవసాయ నేపథ్య కుటుంబంలో పుట్టాను. నాన్నగారు రామాయణ, మహాభారతాలను విశ్లేషించగల విజ్ఞానవంతులు. వీధి నాటకాలు కూడా ఆడేవారు. ఆయనిచ్చిన స్ఫూర్తి అనుకుంటా! చిన్నప్పటి నుంచి సాంస్కృతిక కార్యక్రమాల పట్ల ఇష్టం ఏర్పడింది. అలాగే పెయింటింగ్ కూడా. మంచి పెయింటర్‌గా సెటిలవ్వాలన్న ఆలోచనతో టెన్త్ పూర్తయ్యాక ఫైన్ ఆర్ట్స్ చేయాలని కోల్‌కతాలోని శాంతినికేతన్, ముంబాయిలోని జె.జె ఫైన్ ఆర్ట్స్ కాలేజీ నుంచి అప్లికేషన్లు తెప్పించాను. 'టెన్త్‌'లో మంచి మార్కులు రావడంతో 'డాక్టరైతే పది మందికి ఉపయోగపడతావు. ఊళ్లో ఒక డాక్టర్ ఉంటే బాగుంటుంది' అని ఇంట్లోవాళ్ళు నన్ను కదిలించేసరికి.. ఇంటర్‌లో బై.పి.సి తీసుకున్నాను. ఎం.సెట్ రాస్తే అగ్రికల్చర్‌లో సీటొచ్చింది. అందులో చేరడం ఇష్టంలేక బియస్సీ (బోటనీ, జువాలజీ, కెమిస్ట్రీ) చదివాను. పీజీ చదవడం ఇష్టంలేక ఇంట్లో తెలీకుండా... జె.యన్.టి.యు. బి.ఏ (ఫైన్ ఆర్ట్స్) ఎంట్రన్స్ రాశాను. సీటొచ్చింది. చిన్నప్పటి నుంచీ పెయింటింగ్ అంటే ఇష్టమే అయినా... ఇందులో డబ్బులు సంపాదించుకోవడం వెంటనే కుదరదు కాబట్టి... ఫొటోగ్రఫీలో చేరాను. ఎంట్రన్స్ రాయడానికి ఆర్నెల్ల ముందు హైదరాబాద్‌లో ఉంటూ... సీనియర్స్‌ని, మా ఫ్రెండ్స్‌ని కలిసిన ప్రాసెస్‌లో ఫొటోగ్రఫీ ప్రాధాన్యత తెలుసుకున్నాను. అప్పటి వరకూ ఫొటోగ్రఫీ అంటే పాస్‌పోర్ట్ సైజ్ తీసుకోవడానికి... పాత జ్ఞాపకాలుగా దాచుకోవడానికే అనుకున్నాను. దీని ఇంపార్టెన్స్ తెలుసుకుని ఫైన్ ఆర్ట్స్‌లో ఫొటోగ్రఫీ ఎంచుకున్నాను. సీటొచ్చిన సంగతి ఇంట్లో చెప్పి కన్విన్స్ చేశాను. 2001లో కోర్సు పూర్తికాగానే సినిమాటోగ్రాఫర్ మధు అంబట్ గారి దగ్గర అసిస్టెంట్‌గా చేరాను.

ఆ అవకాశం ఎలా వచ్చింది?

ఫైన్ ఆర్ట్స్‌లో 'పోర్ట్ ఫోలియో' అని చెప్పేసి ఒక దాని మీద వర్క్ చేయాల్సి వుంటుంది. 'ఫ్యాషన్ ఇన్ ఉమెన్ స్టైల్' మీద వర్క్ చేశాను. అలాగే ఫైనల్ ఇయర్‌లో ఒకరి దగ్గర సంవత్సరంపాటు అప్రెంటిస్ చేసి ఆ వర్క్ ప్రొడ్యూస్ చేస్తే డిగ్రీ సర్టిఫికెట్ ఇస్తారు. ఇందులో భాగంగా పలువురిని కలిశాను. ప్రముఖ ఫొటోగ్రాఫర్ రాజీవ్ మీనన్‌గారిని కలిస్తే... 'ప్రస్తుతం నేను సినిమా చేయడం లేదు. అడ్వర్‌టైజ్‌మెంట్స్ చేస్తున్నాను. మధు అంబట్‌గారి దగ్గర చేరితే అన్ని రకాలుగా బాగుంటుంది' అని సలహా ఇచ్చారు. లక్ష్మణ్ ఏలే అనే పబ్లిసిటీ డిజైనర్ సాయంతో మధు అంబట్‌గారిని కలిసి నా 'పోర్ట్ ఫోలియో' వర్క్ చూపించాను. బాగా చేశావంటూ అభినందించి 'లజ్జ' అనే హిందీ సినిమాకు అసిస్టెంట్ కెమెరామేన్‌గా తీసుకున్నారు. మనీషా కోయిరాలా, మాధురీ దీక్షిత్, మహిమా చౌదరి నటించిన ఈ చిత్రానికి రాజ్‌కుమార్ సంతోషి దర్శకుడు. ఆ తర్వాత 'స్వయంవరం' చిత్రాన్ని 'క్యా దిల్‌నే కహ' పేరుతో హిందీలో రీమేక్ చేశారు. తుషార్ కపూర్, ఈషా డియోల్ హీరోహీరోయిన్లు. 'బద్రి' చిత్రాన్ని హిందీలోనూ పూరీ జగన్నాథ్ దర్శకత్వంలో త్రివిక్రమరావుగారే రీమేక్ చేశారు. ఈ మూడు చిత్రాలకు ఆయన దగ్గర పని చేశాను. స్నేహితుల ద్వారా మోహన్‌కృష్ణ ఇంద్రగంటి పరిచయమయ్యారు. చలం నవల 'దోషగుణం'



ఆధారంగా ఆయన దర్శకత్వం వహించిన 'గ్రహణం' అనే సినిమా ద్వారా కెమెరామేన్‌గా పరిచయమయ్యాను. ఇది కెమెరామేన్‌గా నాకొక గుర్తింపు తీసుకొచ్చింది.

ఫొటోగ్రఫీ కోర్సు మీ కెరీర్‌కు ఏవిధంగా ఉపయోగపడింది?

కోర్సు ఒక యాభై శాతం అక్కరకు వస్తే... మరో యాభై శాతం ప్రాక్టికల్ నాలెడ్జ్ ఉపయోగపడుతుంది. కోర్సు చేయకుండా డైరెక్ట్‌గా వస్తే... వర్కింగ్ ప్రాసెస్ అర్థం చేసుకోవడానికి నాలుగైదు సంవత్సరాలు పడుతుంది. అదే కోర్సు చేయడం కారణంగా నాలుగైదు వారాల్లో విషయం అర్థమైంది. పని చేయడం సులభమైంది. తెలిని విషయం గురించి కెమెరామేన్ వివరిస్తుంటే... అర్థం చేసుకోవడం సులువవుతుంది.

'గ్రహణం' తర్వాత ఏ సినిమా చేశారు?

నీలకంఠ దర్శకత్వంలో 'నందనవనం 120 కి.మీ', వంశీ డైరెక్షన్‌లో 'అనుమానాస్పదం' చేశాను. వీరిద్దరితో పని చేయడం గొప్ప ఎక్స్‌పీరియన్స్. చాలా విషయాల్లో అవగాహన కలిగింది. మళ్లీ మోహన్ కృష్ణ ఇంద్రగంటి దర్శకత్వంలో 'అష్టా-చమ్మా', సాయి కిరణ్ అడివి నిర్దేశకత్వంలో 'వినాయకుడు' చేశాను. 'అష్టా-చమ్మా', 'వినాయకుడు' హిట్ కావడంతో 'గ్రహణం'తో వచ్చిన గుర్తింపు రెట్టింపయింది.

'గ్రహణం' చిత్రాన్ని డిజిటల్ ఫార్మెట్‌లో తీశారు కదా. ఎమల్షన్ (సాధారణంగా ఉపయోగించే రీళ్ళ) కు, డిజిటల్‌కు తేడా ఏంటి?

ఎమల్షన్‌లో నెగిటివ్ రీల్స్ ఉపయోగిస్తాం. డిజిటల్లో మాగ్నటిక్ టేప్ ఉంటుంది. డిజిటల్ లేటెస్ట్ టెక్నాలజీ అయినా... ఇంకా పరిపూర్ణంగా అభివృద్ధి చెందలేదు. ఇంకా డెవలప్ స్టేజ్‌లోనే ఉంది. డిజిటల్ ఫార్మెట్‌ను బేసిక్ లెవెల్లో (హోమ్ వీడియో, న్యూస్ రికార్డింగ్...) ఉపయోగిస్తుంటారు. దీంట్లో షూట్ చేయాలంటే కొంత సాంకేతిక సమర్థత అవసరమవుతుంది. అలాగే కొన్ని పరిమితులు కూడా ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఎక్సలెన్సీగా తీయడం కొంత కష్టమే.

ఈ రెండింటిలో ఏది బెస్ట్ క్వాలిటీ?

ఫిలిం బెస్ట్ క్వాలిటీ. డిజిటల్ అనేది ప్రత్యామ్నాయం మాత్రమే. ఫిలిం కన్నా డిజిటల్ తక్కువ ఖర్చవుతుంది. దానికీ దీనికీ 40 శాతం తేడా వస్తుంది. డిజిటల్లో నాలుగైదు రకాల టేపులుంటాయి. క్వాలిటీ తగ్గే కొద్దీ బడ్జెట్ తగ్గుతుంటుంది. డిజిటల్ కెమెరాలు ఎప్పటికప్పుడు అప్‌డేట్ అయి నూతన టెక్నాలజీతో వస్తున్నాయి. ప్రస్తుతం మాగ్నటిక్ టేప్ స్థానంలో చిప్స్ కూడా వచ్చాయి. అదే ఫిలింలో అయితే ఐదో జనరేషన్ కెమెరాలు అందుబాటులో ఉన్నాయి. ఏదో చిన్నపాటి మార్పులతో మారతాయి.

చిత్రాన్ని ప్రదర్శించి 50 రోజులు కాకుండానే కలర్ షేడ్ అవుతోంది. ప్రింట్ కూడా త్వరగా నలిగిపోతోంది ఎందుకు?

గతంలో పోల్చుకుంటే నెగిటివ్ క్వాలిటీ తగ్గడమే ఇందుకు కారణం. డిజిటల్లో ఈ ప్రాబ్లమ్ ఉండదు. ఒక్కసారి హార్డ్ డిస్క్‌లో స్టోర్ చేస్తే కొన్ని వందల సంవత్సరాల తర్వాత కూడా దాని ఒరిజినాలిటీ చెక్కు చెదరదు.

హీరోహీరోయిన్లను అందంగా చూపించడంలో ఫొటోగ్రఫీ బాధ్యత ఎంతవరకు ఉంటుంది?

'వినాయకుడు'లో సోనియా, కృష్ణుడు

ప్రతి ఆర్టిస్టులో అందం ఉంటుంది. పర్టిక్యులర్ మూడ్‌లో అది మరింతగా కనబడుతుంది. ఏ యాంగిల్లో అందంగా కనిపిస్తాడో ఫొటో షూట్‌లో తెలిసిపోతుంది. అందాన్ని ఎలివేట్ చేయడానికి కొన్ని లైటింగ్ పద్ధతులు అనుసరిస్తాం. అందుకు తగిన వాతావరణం తీసుకొస్తాం. దర్శకుని మనో చిత్రాన్ని ఫొటోగ్రాఫర్ ఇంకా బెటర్‌గా విజువలైజ్ చేసి అందంగా తీసుకొస్తాడు.

మరి సన్నటివాళ్ళను లావుగా... లావాటివారిని సన్నగా కూడా చూపించ గలుగుతారా?

కొంతవరకు వీలుంది. కొన్ని లైటింగ్ పద్ధతులు ద్వారా లావుగా ఉన్నవాళ్ళని స్లిమ్‌గా కనిపించేలా చేయొచ్చు. కొన్ని లెన్సెస్ సాయంతో సన్నటి వాళ్లను లావుగా చూపించొచ్చు.

'వినాయకుడు'గా నటించిన కృష్ణుడు సినిమాల్లో చూపించినంత లావుగా బయట లేకపోవడానికి ఇదే కారణమన్న మాట!

ఇప్పుడే చెప్పినట్లు... కొన్ని సన్నివేశాల్లో ఎక్కువ చేసి చూపించాం. అదీ కొంతవరకు మాత్రమే ఫొటోగ్రాఫర్ చేయగలడు. ఇంకా ఎక్కువ ఎఫెక్ట్‌గా చూపించాలనుకుంటే... స్పెషల్ టెక్నిక్స్ ఉపయోగించాల్సి వుంటుంది. సి.జి ఎఫెక్ట్, పోస్థటిక్ మేకప్ సాయంతో ఇంకా లావుగా చూపించవచ్చు.

హీరోహీరోయిన్లలో ఎవరిని ఎక్కువ అందంగా చూపిస్తుంటారు?

అది కథ చేసే డిమాండ్ అనుసరించి ఉంటుంది. . 'అష్టా-చమ్మా'లో తనకు కాబోయేవాడు మహేష్‌బాబులా ఉంటాడని స్వాతి ఊహించుకుంటుంది. ఈక్రమంలో ఆమెకు హీరో కనిపించే తొలి సన్నివేశంలో... అతను ఎక్కువ హ్యాండ్సమ్‌గా కనిపించడానికి ట్రై చేశాం. వినాయకుడులో సోనియాను చూసిన వెంటనే హీరో మనసు పారేసుకుంటాడు. ఆమె కనిపించే సన్నివేశాన్ని గ్లామరస్‌గా చూపించాం.

ఏయే సన్నివేశాల్లో ఫొటోగ్రాఫర్ ఎక్కువ కష్టపడాల్సి వస్తుంది?

యాక్షన్, ఛేజింగ్ సన్నివేశాల్లో శారీరకంగా శ్రమించాల్సి ఉంటుంది. వేసవికాలంలో షూట్ చేస్తూ... కథపరంగా శీతాకాలం చూపించాల్సి వస్తే... అందుకు తగ్గ ఎఫెక్స్ తీసుకురావాలి. దీని కోసం మానసికంగా కష్టపడాల్సి వుంటుంది. అలాగే రెయిన్ ఎఫెక్ట్ తీసుకురావడంలోనూ. సన్నివేశాన్ని సహజంగా తీర్చిదిద్దడానికి టెక్నికల్ నాలెడ్జ్ సద్వినియోగం చేసుకుంటూ క్రియేటివిటీ ప్రదర్శించాలి. ప్రతి సినిమాటోగ్రాఫర్ ఇలాంటి రిస్క్ ఫేస్ చేయాలనుకుంటాడు కాబట్టి... ఇందులో ఎంజాయ్‌మెంట్ ఆస్వాదిస్తాం.

ఫలానా దర్శకుడితో కలిసి పని చేయాలన్న కోరిక ఉందా?

మొదట్లో ఉండేది. ఇప్పుడలాంటిదేమీ లేదు. విజువల్‌కు అవకాశమున్న మంచి కథా చిత్రాలకు కెమెరామేన్‌గా పనిచేయాలనుంది. కొత్త, పాత అనే తేడా లేకుండా ఏ డైరెక్టరైనా కథ బాగుంటే చాలు.

కెరీర్‌పరంగా ఇంకేమైనా లక్ష్యాలు నిర్దేశించుకున్నారా?

దర్శకుడు కావాలనుంది. ప్రస్తుతం సినిమాటోగ్రాఫర్‌గానే కొనసాగుతాను. భవిష్యత్తులో సినిమాలు డైరెక్ట్ చేస్తాను.



'వినాయకుడు'తో పి.జి.విందా

అగ్రహీరోలెందుకు నటించడంలేదు?

- పెండ్యాల మురళీకృష్ణ

అందమైన కళకు నిలయమైన సినీపరిశ్రమకు ఈ ఏడాది విచిత్రమైన అనుభూతి ఎదురయింది. గత కొన్నాళ్ళుగా అగ్రహీరోల విజయశాతం తక్కువగా వస్తున్న తరుణంలో ఈ ఏడాది మరింత పడిపోయింది. టాప్‌లో ఉన్న హీరోల విజయాలను ప్రస్తావించాల్సివస్తే శూన్యంవైపు చూడాల్సిందే. విడుదలకు ముందే దర్శక నిర్మాతలతోపాటు హీరోలకు తమ సినిమాలపై భారీ అంచనాలు ఆకాశానికి ఎత్తేయడంతో విజయావకాశాలుకూడా నింగినిచేరి క్రిందకు దిగనంటున్నాయి. అనేక మంది అగ్రహీరోలు అతి జాగ్రత్తవల్ల పెద్ద చిత్రాల నిర్మాతలు ఓపక్క కుదేలవుతున్నారు. అధిక పారితోషికాల వల్ల కేవలం ఓపెనింగ్స్‌కు మాత్రం పరిమితమయి రన్నింగ్‌లో వెనుకడుగు వేస్తున్నారు. దీంతోచాలామంది దర్శక నిర్మాతలు చిన్న చిత్రాలవైపు మొగ్గు చూపుతున్నారు. చిన్న హీరోల చిత్రాలు బడ్జెట్‌పరంగా సేఫ్ అనే దృష్టితోనూ, ఆర్టిస్టులు గొంతెమ్మ కోర్కెలు కోరకపోవడంతోనూపాటు .. హిట్ తగిలిందా.. కరెన్సీకట్టలు పడడంతో ఆ దిశగా చిత్ర పరిశ్రమ అడుగులువేయడం మొదలుపెట్టింది. ఈ కారణంగా ఈ ఏడాది అగ్రహీరోల చిత్రాల్ని చిన్న చిత్రాలు ఈజీగా నిరోధిస్తున్నాయి. అగ్రతారలు నటించిన ఒక్కమగాడు, కృష్ణార్జున, బలాదూర్, కంత్రి చిత్రాలు నిర్మాతల్ని బెంబేలెత్తిస్తే.. గమ్యం, బొమ్మనబ్రదర్స్ చంద్రన సిస్టర్స్, బతుకమ్మ, రెడీ, వినాయకుడు, సిద్ధుఫ్రం సీకాకుళం, అష్టాచమ్మా, కొత్త బంగారులోకం, బ్లేడ్‌బాబ్జీ, వంటివి చిన్న నిర్మాతల్ని ఉత్సాహపర్చాయి.

గత ఏడాది 138 చిత్రాలు నిర్మాణం జరుపుకుంటే అందులో 10 చిత్రాలు పెద్దహీరోలవే. 10 చిత్రాలకుగాను 350 కోట్ల నిర్మాణం జరిగితే.. అందులో సక్సెస్ సాధించినవి ఏడు చిత్రాలే. ఈ ఏడాది మాత్రం ఆ సంఖ్య మరీ పడిపోయింది. చిన్నా చితక చిత్రాలతో కలిసి 150 చిత్రాల నిర్మాణం జరిగితే అందులో ఏడు చిత్రాలే పెద్దతారల చిత్రాలు కావడం విశేషం. ఒక్కో చిత్రానికి దాదాపు 30-40 కోట్లవరకు నిర్మాణం జరిగింది. మిగిలిన చిత్రాలన్నీ 2-5 కోట్ల పెట్టుబడి జరిగింది. అందులో సక్సెస్ అయినవి 14 చిత్రాలు మాత్రమే. అందులో 30 చిత్రాలు శాటిలైట్ వ్యాపారంకోసమే తీసినట్లు సినీవర్గాలు విశ్లేషించాయి. అగ్రహీరో చిత్రానికి 2,3 కోట్లవరకే శాటిలైట్ వ్యాపారం జరుగుతుంది. ఇక ఓవర్‌సీస్ బిజినెస్ అంతా గాంబ్లింగ్ తరహాలో సాగుతుంది. సినిమా ల్యాబ్‌లో ఉండగానే రిపోర్ట్స్ లీక్‌కావడంతో ఓవర్‌సీస్‌లో అగ్రహీరోల చిత్రాల్ని తీసుకోవడానికి డిస్ట్రిబ్యూటర్లు వెనుకాడిన సందర్భాలున్నాయి. ఓ మాదిరి ఆర్టిస్టులున్న చిత్రానికి ఒక్కో చిత్రం 40 లక్షల వరకు శాటిలైట్‌వ్యాపారం సాగడంతో ఆదిశగా చిన్న చిత్రాల నిర్మాణం జరిగింది. అమెరికా ఆర్థికమాంద్యం ప్రభావం వల్ల శాటిలైట్‌వ్యాపారం 10లక్షలకుమించి చిన్న చిత్రాలకు రాకపోవడంతో చిన్న నిర్మాతలు కాస్త వెనకడుగు వేస్తున్నారని శాటిలైట్ మీడియేటర్ సత్యనారాయణ పేర్కొంటున్నారు.

ఇక పెద్ద హీరోల చిత్రాలు తగ్గడానికి ప్రధాన కారణం సరైన కథ లేకపోవడం ఒకటైతే, అగ్రహీరోలంతా బాగా సంపాదనాపరులు కావడంకూడా మరో కారణమని సినీ పండితులు పునరుద్ఘాటిస్తున్నారు. తెలుగు చిత్రసీమకు మొదటిది సంక్రాంతి సీజన్. ఈ రేసులో వచ్చిన మొట్టమొదటి చిత్రం బాలకృష్ణ వై.వి.ఎస్. చౌదరి కాంబినేషన్‌లో రూపొందిన 'ఒక్కమగాడు'. ఎన్నో అంచనాలతో బరిలోకి దిగి ఓపెనింగ్ బ్యాట్స్‌మెన్‌గా వెళ్ళి క్లీన్‌బౌల్డ్ అయింది. తీసిన కథనే మళ్ళీ తీస్తే ప్రేక్షకులు ఎటువంటి తీర్పు



కథల్లేవంటున్నారు: రామానాయుడు

కథల్లేవని హీరోలు చేయడంలేదు. దానికి మేం ఏం చేయగలం. నాకంటే నా కొడుకు తీస్తున్న చిత్రాలే హిట్ అవుతున్నాయి. నేను సినిమా తీసిన ప్రతిసారీ "ఎందుకు నాన్నగారు ప్రతిసారీ డబ్బులు పోగొట్టుకుంటారు?" అని అడుగుతుంటాడు. మరి నాకు తెలిసింది సినిమా వ్యాపారమే. అందుకే తీస్తున్నా. ఒక్కోసారి వాడి లెక్కే కరెక్టేమో అనిపిస్తుంది. ఎందుకంటే కథకోసం సురేష్‌బాబు చాలాకాలం వేచిచూస్తాడు. నాకేమో అంత ఓపికలేదు. సినిమాతీస్తే నలుగురికి పని దొరుకుతుందనేది నా పాలసీ.



పెద్దరికం నిలబెట్టుకోవాలంటే మేం మాట్లాడకూడదు: అక్కినేని

సరైన కథల్లేవని హీరోలంటున్నారు. మేం మంచి కథల్లోనే హీరోలం అయ్యాం. కథలు ఎక్కడినుంచో పుట్టవు. చిన్న సంఘటనను అల్లి కథగా తయారుచేయడమే. మా పెద్దరికాన్ని నిలబెట్టుకోవాలంటే మేం హీరోలకు సలహాలు ఇవ్వకపోవడమే బెటర్. మా అబ్బాయి నాగార్జున తొలి దశలో సలహాలిచ్చాను. నీ చిత్రాల్లో ఏదో వల్గారిటీ ఉంది. దాన్ని తగ్గించు అన్నా. 'మీ రోజుల్లో ఎన్.టి.ఆర్. మీరే పోటీ. ఇప్పుడు జనరేషన్ ఎంతో కాంపిటేషన్ పెరిగింది. దానికి తగినట్లుగా చేసుకుంటూ పోవాలని' నాకు ఎదురు సలహా ఇచ్చాడు. మరి అదీ నిజమే.. విక్రమ్ తర్వాత 2,3 చిత్రాలకు కథలు ఎంపికచేశా. అంచనాలు తప్పింది. ఆడలేదు. దాంతో దూరంగా ఉన్నాను. అంతెందుకు.. మా మనవడు.. తాతయ్య ఓ కేసెట్ పెట్టు అంటే.. పాత సినిమా చూపించాను. అబ్బ వద్దు బోర్.. అంటూ.. మామయ్యలాంటి సినిమా చూద్దామంటూ.. పేచీపెట్టాడు. మరి ఇలాగుంది. అందుకే వారికి మనమేం సలహాలివ్వలేం.

సంపాదన ఎక్కువయింది: తమ్మారెడ్డి భరద్వాజ

అగ్రహీరోలకు డబ్బులు ఎక్కువయ్యాయి. అందుకే రిలాక్స్ అయ్యారు. ఒకప్పుడు 10 సినిమాలు చేస్తే వస్తే రాబడి ప్రస్తుతం ఒక్కసినిమాకే రావడంతో అంతా రిలాక్స్‌అయ్యారు. రాశికంటే వాసి గొప్పదికదా. 'తక్కువ కష్టం ఎక్కువ సంపాదన' ఈ పాలసీలో పయనిస్తున్నారు. పోగాపోగా సినిమాలు తగ్గిపోతాయి. దీనికి ఆర్థికమాంద్యంకూడా తోడయింది. ఆ ప్రభావం సినిమాపై పడింది. కానీ ఇంకా తీవ్రస్థాయికి రాలేదు. మల్టీప్లెక్స్ కల్చర్ పెరిగిపోయింది. చిన్న కథతో కొత్తదనంతో కూడిన చిత్రాలు ఆడుతున్నాయి. ఒకరిద్దరు కలిసి నటించిన చిత్రాలు బాలీవుడ్‌లో బాగా పే చేస్తున్నాయి. ఆ ఒరవడి భవిష్యత్‌లో మన ఇండస్ట్రీలో రావచ్చు. ఎంత చేసినా అగ్రహీరోలకు చివరికి కాపీ కథల్తో రాకుండా ఉంటే అదే పదివేలు. కొత్తదనంతో వచ్చిన కొత్తబంగారులోకం, వినాయకుడు, వచ్చావులే వంటివి వైవిధ్యంగా ఉండబట్టి ప్రేక్షకులు ఆదరిస్తున్నారు. ముఖ్యంగా మరో విషయం చెప్పాలి. ఆవేశపడి అగ్రహీరోలు ఏడాదికి 2 చిత్రాలు చేస్తే, అవి పోతే.. మరో సినిమాను వారితో తీయడానికి నిర్మాతలే రావడంలేదు. ఇన్ని మాటలు చెప్పే కె.ఎస్.రామారావుగానీ, దాసరిగానీ ఒక్కసారి ఫ్లాప్ అయిన హీరోతో చేయగలరా? లేదే? అందుకే వారి జాగ్రత్తలో వారుంటున్నారు.

చెబుతారో దర్శకునికి అవగతమయింది. కమల్‌నటించిన 'భారతీయుడు'చిత్ర ఛాయలు అడుగడుగునా ఇందులోకన్పించడం చిత్రానికి మైనస్‌గా నిలిచాయి. ఇక అదేపోరులో నిలిచిన రవితేజ, వినాయక్ కాంబినేషన్‌లో వచ్చిన 'కృష్ణ' ఈ ఏడాది తొలి సక్సెస్. దాంతో ఈ ఏడాది ఇండస్ట్రీకి మంచి రోజులు వచ్చాయనే భావించింది. ఆ తర్వాత వచ్చిన మల్టీస్టారర్ సినిమా 'కృష్ణార్జున' నాగార్జునకు, విష్ణువర్ధన్‌కు ఊహించని దెబ్బ కొట్టింది. కృష్ణుడు, అర్జునుడు బోధనల నేపథ్యంలో సోషియోఫాంటసీగా తీసినా ఈ చిత్రంలో సరైన కథలేకపోవడంతో కాళ్లీడ్చింది. దాంతో నాగార్జునకు అభిమానులు ఇటువంటి పాత్రలు చేయవద్దని ఘాటుగానే సూచించారు. ఒక మోస్తరు హీరోగా పేరుపొందిన గోపీచంద్ ఒంటరి పర్వాలేదనిపించింది. పూరీజగన్నాథ్ కాంబినేషన్‌లో మోహన్‌బాబు, ప్రభాస్ నటించిన 'బుజ్జిగాడు మేడిన్ చెన్నై' కలగూరగంపగా తయారయి నిరుత్సాహపర్చింది. ఈసారి మలి ప్రయత్నంగా బాలకృష్ణ పాండురంగడుగా మారినా దానితోపాటే విడుదలైన లోబట్జెట్ 'బతుకమ్మ'నే బాగా ఆదరించారు. తన తండ్రి 'పాండురంగమహాత్యా'న్ని మరిపించలేకపోయాడు. గత ఏడాది 'చంద్రముఖి'తో సెన్సేషనల్ హిట్ కొట్టిన పి.వాసు, రజనీకాంత్ కాంబినేషన్ ఈసారి 'కథానాయకుడు'లో లోపించింది. మళ్ళీ రవితేజ 'బలాదూర్'గా చేసినప్రయత్నం బెడిసికొట్టింది.

ఈ ఏడాది నరేష్ సంవత్సరంగా పేర్కొనవచ్చు. నరేష్‌తో చేస్తే గ్యారంటీ అనే స్థితికి నిర్మాతలు వచ్చారు. 'కథలు ఎక్కడినుంచోపుట్టవు. సమాజంలోంచే పుడతాయి. ఏడు చేపలు కథ రాజు కొడుకులు వేటకెళ్లడం, చేపల్ని పట్టడం గురించే కావచ్చు. ఏర్పాటువిద్య తెలిస్తే అది అంతర్జాతీయస్థాయిలోపేలుతుందనేది ఇండస్ట్రీ నానుడి'. ఆ పట్టు తెలిసిన రాధాకృష్ణ 'గమ్యం'అనేచిత్రాన్ని తీసి నిరూపించాడు. కోటీశ్వరుడైన కుర్రాడు తను ప్రేమించిన సామాన్య యువతిని వెతుకుతూ సాగే జర్నీ గమ్యం. ఈ పాయింట్‌తో ఆద్యంతం ఆసక్తికరంగా సాగేలా రాధాకృష్ణ నిరూపించాడు. కథల విషయంలో ఈమధ్యనే పూరీజగన్నాథ్ ఏమంటున్నారంటే.. కథలు ఎక్కడున్నాయి చేయడానికి? ఓపెనింగ్‌లో 40మందిని నరకడం, క్లైమాక్స్‌లో 200 మందిని కొట్టడం. ఇలా ఎన్ని కథలువస్తాయి. అవే కావాలని డిస్ట్రిబ్యూటర్లు అడుగుతున్నారు. వారేమో బి,సి, సెంటర్లలో ప్రేక్షకులు కోరుకుంటున్నారని చెబుతుంటారు. వారినే ప్రశ్నిస్తే... తీస్తున్నారు కాబట్టి మేం చూస్తున్నాం. అనే సమాధానం వస్తుంది. అందుకే కొత్తతరహా కథలవైపు దృష్టిసారించాల్సి వస్తుందని అందుకే చిత్రాలు ఆలస్యమవుతున్నాయని దర్శకుడు పూరీ, హీరో వెంకటేష్ ఏకాభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నారు. గమ్యంలో దర్శకుడు టేకింగ్ నచ్చి వెంకటేష్ ఆయనకు ఆఫర్ ఇచ్చారు.

ఇక మహేష్‌బాబు గత ఏడాది అక్టోబర్‌లో 'అతిథి' విడుదలయ్యాక మళ్ళీ కొత్త చిత్రం ప్రయత్నమే చేయలేదు. త్రివిక్రమ్ శ్రీనివాస్ దర్శకత్వంలో ఓ చిత్రం స్క్రిప్ట్ దశలో ఉంది. అతడు, జల్సా చిత్రాల్ని చేసిన త్రివిక్రమ్ మహేష్‌బాబుకు ఎటువంటి కథను వండాలనే ప్రయత్నాల్లో నిమగ్నమయ్యారు. ఈ గ్యాప్‌లో తన కుటుంబంతో గడపడానికి ఇష్టపడుతున్నారు.

అగ్రహీరోగా మెలిగిన చిరంజీవి రాజకీయప్రవేశంతో ఒక్కసారిగా ఇండస్ట్రీ మిగిలిన హీరోలవైపు దృష్టిసారించింది. కానీ అందులో ఎవరివీ సరైన విజయాలు లేకపోవడంతో నిట్టూర్చింది. పవన్ కళ్యాణ్ ఈ ఏడాది

నిర్మాతలే నిరుద్యోగులయ్యారు: కె.ఎస్. రామారావు

అగ్రహీరోలు చిత్రాలు చేయకపోవడం వల్ల మాలాంటి నిర్మాతలు నిరుద్యోగులా మారారు. మేమే ఇలాగుంటే మాపై ఆధారపడ్డ కార్మికులంతా నిరుద్యోగులవుతున్నారు. ఇలా ఎంతోమంది నిర్మాతలు తీయడానికి ముందుకు వస్తున్న అగ్రహీరోలు ఎందుకు చేయడంలేదో అర్థంకావడంలేదు. కనీసం ఏడాదికి 2 చిత్రాలు తీస్తే నిరుద్యోగ సమస్య తగ్గుతుంది. ఇండస్ట్రీ దిగ్గజాలైన అక్కినేని నాగేశ్వరావు, డా. డి.రామానాయుడు వంటివారు హీరోలకు నచ్చజెపితే బాగుంటుంది.



అభద్రతా భావం నెలకొంది: శంకర్

నేడు హీరోల్లో అభద్రతాభావం నెలకొందని డైరెక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు శంకర్ అంటున్నారు. "ఒక్కసారి ఫాప్ ఇస్తే.. మరి నిర్మాతలు ముందుకు రారు. నితిన్, ఉదయ్‌కిరణ్, ఆకాశ్ ఇలా ఎంతోమంది ఎన్నో ఏళ్ళనుంచి తంటాలుపడుతున్నారు. ఇక నరేష్, రాజా, శివాజీలు ఈ ఏడాది ఎక్కువ చిత్రాలు చేశారు. కానీ అందులో సక్సెస్ అయింది నరేష్ ఒక్కడే" అంటున్నారాయన.

అస్సుచిత్రమే చేయలేదు. గత ఏడాది 'జల్సా' తర్వాత మళ్ళీప్రయత్నం చేసి 'కొమురం పులి'పేరుతో చిత్రాన్ని ఆరంభించినా వ్యక్తిగత కారణాలవల్ల కొంతఆలస్యమవుతూ వచ్చింది. మొదటిభార్య విడాకులకేసు, అన్న రాజకీయపార్టీకి గ్రౌండ్ వర్క్ చేయడంపై దృష్టిసారించడంతో సినిమాపై వెనుకడుగు వేయాల్సివచ్చిందని విశ్లేషకులు భావిస్తున్నారు. రవితేజ ఈ ఏడాది రెండు చిత్రాలు విడులైతే అందులో 'కృష్ణ' ఒక్కటే సక్సెస్ అయింది.

ముఖ్యంగా టీవీకి అతుక్కుపోయే మహిళలను థియేటర్ వరకు రప్పించాలంటే చిత్రంలో ప్రత్యేక ఆకర్షణ అనేది ఉండాలి. అందుకే అగ్రహీరోలు టెక్నికల్ వాల్యూస్‌తో బడ్జెట్‌ను పెంచేసి జనాల్నిరాబట్టుకోవడంకోసం మహేష్‌బాబు వంటివారుకూడా మల్లగుల్లాలు పడుతున్నారు. కొత్తదనంచూపించాలని సిక్స్‌ప్యాక్ బాడీని పెంచే దిశగా పయనిస్తున్నారు. ఆల్‌రెడీ నితిన్ 'హీరో'తోనూ, 'నేనుమీకుతెలుసా'తో మనోజ్, కంత్రితో ఎన్.టి.ఆర్, విష్ణువర్ధన్, రవితేజ వంటివారు బాడీపై దృష్టిసారించారు. ఎన్ని చేసినా సరైనకథలుంటే ఫ్యామిలీప్యాక్ చిత్రాలే ఆదరిస్తారని అల్లరి నరేష్ చెప్పింది అక్షర సత్యం. ఎన్ని ట్రిక్కులు చేసినా హిట్ అందని దాక్షగా మారడంతో ఎవరివారు పునరాలోచించుకునే స్థితిలోఉన్నారు. దాంతో తెలీని టెన్షన్‌కు గురయి ఆచితూచి అడుగులేస్తున్నారు. అందుకే ఏడాదికి ఒకటి, రెండుచిత్రాలు మినహా ఎవరూ నటించలేకపోతున్నారు. ఒకప్పుడు ఎన్.టి.ఆర్, ఎ.ఎన్.ఆర్, కృష్ణ, వంటి వారు ఏడాదికి 7,8 చిత్రాలు చేయలేదా? అన్న వారూ లేకపోలేదు. అప్పటి పరిస్థితి వేరు. ఆనాడుటీవీ మీడియా ఇంతగా పుంజుకోలేదు. అందుకే కొత్తదనంకోసం అర్రులు చాస్తున్నారు. 'పోకిరి' తర్వాత అంతటి హిట్‌ను మహేష్ ఇవ్వలేకపోయాడు. 'అతిథి' సినిమాను అందనంత ఎత్తుకు తీసుకువెళ్తానన్న దర్శకుడు సురేందర్‌రెడ్డి కాంబినేషన్‌ను నమ్మి అప్పట్లో యుటీవీ ఆ చిత్ర రైట్స్ తీసుకుంది. కానీ చిత్రం ఫ్లాప్ కావడంతో ఒక్కసారి వెనకడుగువేసింది. కేశాలంకరణకే లక్ష వెచ్చించిన మహేష్‌బాబు బడ్జెట్ తారాస్థాయికి చేరింది. దాంతో తదుపరి చిత్రం 'వరుడు' పై ఆ ప్రభావం కన్పించింది. ఈ ఏడాదే ఆ సినిమా ప్రారంభంకావాల్సి ఉన్నా అది ఇంతవరకు స్క్రిప్టుపూర్తిగాలేదు. దీంతో చాలామంది అగ్రహీరోలు సొంతకథలకంటే రీమేక్‌వైపు దృష్టి బెటర్ అనే ఆలోచనలోకి వచ్చేశారు. ఒక చోట హిట్ అయితే మరొకడు కాపీ చేసేస్తాడేమోనని లక్షలువెచ్చించి రైట్స్‌ను నిర్మాతలచేత కొనిపించేలా చేస్తున్నారు. బాలకృష్ణ 'లక్ష్మీ నరసింహ', వెంకటేష్ చేసిన సూపర్‌గుడ్‌చిత్రాలు, రాజశేఖర్ 'గోరింటాకు' ఇటువంటివే. రీమేక్ వల్ల హిట్ కాదనే భయాందోళనలు అటు హీరోలనూ, దర్శకుల్లోనూ ఉండవు.

మరోవైపు ఓవర్‌సీస్, శాటిలైట్‌వ్యాపారం ఈ ఏడాది మరింతగా పుంజుకోవడంతో పెద్ద హీరో సినిమా 30,40కోట్ల వ్యాపారానికి చేరింది. దీంతో హీరోలు పారితోషికాలు పెంచేస్తున్నారు. ఇక ఎన్.టి.ఆర్. 'కంత్రి' చిత్రం 'సింహాద్రి'ని మరిపించే సక్సెస్ ఇవ్వలేకపోయింది. దాంతో వినాయక్‌తో చేయాలనుకున్న చిత్రం ఈ ఏడాదికూడా కాలేకపోయింది. 'ఆడవారి మాటలకు అర్థాలే వేరులే' తర్వాత కుటుంకథతో 'చింతకాయలరవి'గా వెంకటేష్ వచ్చినా అదీ అంత ఆశాజనకంగా లేదు. కానీ ఆ చిత్రం తనకు మంచి సంతృప్తినిచ్చిందని వెంకటేష్ అంటున్నారు. నిర్మాత బజ్జీమాత్రం తాను పెట్టిన పెట్టుబడి ఈ చిత్రానికి రాలేదనీ, రెండువారాల టిక్కెట్‌పెంపును రాష్ట్రప్రభుత్వం ఎత్తివేయడం ప్రధాన కారణమని పేర్కొంటున్నారు.

తెలుగులో కథలకంటే హీరోలు ఇమేజ్‌చట్రంలో కూరుకుపోయారనేది అక్షరసత్యం. దాంతో కథలు సరిగ్గాలేక హీరోనే డామినేట్ చేయాల్సివస్తుంది. హాలీవుడ్, బాలీవుడ్‌లలోఅటువంటి ధోరణి లేదు. హాలీవుడ్‌లో జేమ్స్‌బాండ్, సూపర్‌మేన్, స్పైడర్‌మాన్‌చిత్రాలు చేసిన హీరోలు ఆటు కామెడీ చిత్రాల్లో నటిస్తారు. సీన్‌కేనరీ ఇప్పుడు కేరెక్టర్‌నటుడు. అయినా ఆ చిత్రాలు విజయవంతమవుతున్నాయి. అక్కడ కథనుబట్టే హీరో ఉంటాడు. గతంలోచిరంజీవి కొత్త ప్రయత్నంచేసినా అన్నింటిల్లోనూ ఆయనదే పైచేయిగా ఉండేది. దీంతో కథ మరుగునపడిపోయేది. అలాంటిదే శంకర్‌దాదా జిందాబాద్. ఇక హిందీలో హీరోలకు ఇమేజ్ లేదు. సంజయ్‌దత్ హీరోగా, విలన్‌గా, కమెడియన్‌గానూ చేస్తాడు. అమితాబ్‌బచ్చన్ 'ఖాకీ'లోపోలీస్‌గానూ, ధూమ్‌లో విలన్‌గానూ, అక్స్‌లో మరో పాత్రలో నటించి మెప్పించాడు. ఇమేజ్ అనేది తెలుగులో శాపమైంది. మొదటినుంచి అభిమానుల్ని అలా ట్యూన్ చేశారు? అదే హీరోల కెరీర్‌ను మింగేసింది. మల్టీస్టారర్ చిత్రాలు చేస్తే ఎందుకు చూడరు?

ఈ విషయంలో గతంలో చిరంజీవి ఇలా స్పందించారు. మమ్మల్ని ప్రజలు డెమీగాడ్స్‌గా చూస్తున్నారు. దాంతో కొత్తప్రయోగం చేయాలన్నా చేయనీయరు. దాంతో వారి అంచనాలకు తగినట్లు కథ ఉండేలా జాగ్రత్తపడుతున్నాం. ఆ క్రమంలో కొన్ని ఫ్లాప్‌లుకూడా పొందుతున్నాం. ఈ కథ హిట్ అని తెలిస్తే... ఎవరైనా సినిమాలు తీస్తారు. అది పైవాడు డిసైడ్ చేయాలి' అని చెప్పారు. మరి వారిని అలా మార్చింది ఎవరు? ఆస్టార్‌లు, ఈస్టార్‌లంటూ... బిరుదులు చొప్పించుకుని ఆకాశంలో తారల్లా ఉండాలనుకుంటే అభిమానులు అక్కడే కూర్చోమంటారు. కిందకుదిగనివ్వరు. హీరోఅనేవాడు.. సినిమాకథకు హీరోగా ఉండాలి. అప్పుడే తెలుగు సినిమాకు మంచి రోజులు వస్తాయి. నిర్మాత నాలుగుకాలాలపాటు నిలుస్తాడు.

✠



పూర్తి స్క్రిప్ట్ వచ్చాకే చేస్తా: వెంకటేష్

సినిమా కథ బౌండ్ స్క్రిప్ట్ వచ్చాకే నేను సినిమాకు ఓకే అంటాను. అది ఎంతకాలం పట్టింది అనేది లెక్కకాదు. ముందుగా నేను పలానా సినిమా తీస్తున్నానని ప్రకటిస్తే.. అది కార్యరూపం దాల్చకపోతే... స్టోరీలో దమ్ములేదంటరా... హీరోలో స్టఫ్‌లేదురా.. వంటి వార్తలు ఇండస్ట్రీలో వినాల్సివస్తుంది. అంత అవసరమా? మాకు. అందుకే అంతా రెడీ అయ్యాకే... సినిమా చేస్తా. అది ఎంతకాలమైనా పట్టనీ.

కొత్తదనం ఉండాలి: నాగార్జున

ప్రతిరోజూ వివిధ ఛానళ్ళలో 70 సినిమాలవరకు వస్తున్నాయి. 71వ సినిమాకు థియేటర్‌కు రావాలంటే.. ఎంతో మంచి సినిమా అంటేగానీ రారు. ఇదివరకు టెక్నిక్‌తో చేస్తే ఎవరూ గుర్తుపట్టేవారుకాదు. కానీ ఇప్పుడు అన్నీ తెలిసిపోతున్నాయి. ఎన్ని కోట్లు ఖర్చుపెట్టి తీసినా ఇది గ్రాఫిక్స్‌రా! అంటూ ప్రేక్షకుడు తేలిగ్గా తీసిపారేస్తున్నాడు. సినిమా హిట్ అయితే... ఆ ఖర్చు లెక్కలోకి రాదు.

కవిత్వం

ఎంతకని సహిస్తావు...!

- జావెద్

కత్తిపోట్లకు గురవుతున్నావు
ఉన్మాదానికి బలవుతున్నావు
ప్రేమ ముసుగులో... మసైపోతున్నావు
కామాంధుల ఘాతుకానికి
కడతేరుతున్నావు
అయినా ఇంకా ఎందుకని సహిస్తున్నావు

అబలనన్న ఆలోచనా పొరలు
కప్పుకున్నాయా
అతివంటే అణుకువకు మారు పేరన్న
మను ధర్మం నిన్ను బందీని చేసిందా
ఆడదంటే మగాడికి ఆటవస్తువుగా
చిత్రీకరించే
సినీ సునామిలో చిక్కుకున్నావా
ఏమైంది నీకు...ఇంకెంతకాలం సహిస్తావు

సూటిపోటి మాటలతో నిన్ను చిదగ
పొడుస్తుంటే
బరితెగించి నిన్ను నడిరోడ్డులో నరుకుతుంటే
నీ ఇష్టంతో పనిలేకుండా ప్రేమ పిశాచాలు వెంటాడుతుంటే
యాసిడ్లతో, కత్తులతో దాడి చేస్తుంటే
ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని పరుగెడతావెందుకు
ఈ దౌర్జన్యాన్ని అంతం చేయాలన్న ఆలోచన రాదా
ఎందుకమ్మా.... సహిస్తున్నావు

చట్టాలూ కోర్టులూ ఉన్నాయి కదా
రక్షిస్తాయనుకుంటున్నావా
దుర్మార్గులను శిక్షిస్తాయనుకుంటున్నావా
అవన్నీ
నేరాన్ని కప్పిపుచ్చే...
నేరస్తులను రక్షించే
దోపిడీ వర్గపు
భావాజాలానికి
ప్రభావితమవుతున్నవే కదా
అదంతా ఆలోచించవెందుకు
ఇంకా ఎంతకని సహిస్తావు

ఏమిటీ? అది నిజం కాదని కొందరంటున్నారా
మరి శ్రీలక్ష్మిని నరికిన మనోహర్‌కు సంగతేంటి?
గుంటూరులో ప్రసన్న లక్ష్మినీ, నెల్లూరులో తస్లీమా
బానునూ
కడతేర్చిన కామాంధులకూ హంతకులకూ ఏ శిక్ష పడింది?
ఆయేషా కేసు ఎందుకన్ని మలుపులు తిరుగుతోంది?
అసలు నిందితులను ఎవరు రక్షిస్తున్నారు
చట్టం ఏం చేస్తోంది?

ఆ రక్తపు మరకలు మాసిపోకముందే
మరో ముగ్గురు మనోహర్ వారసులు
ప్రేమోన్మోదం తలకెక్కి
స్వప్నికపైనా ప్రణీతపైనా
యాసిడ్ పోశారు.
ప్రేమంటే యాసిడ్ మంటా?
ప్రేమించకపోతే చావాల్సిందేనా?
ఇలాంటివి చూస్తూ కూడా...
ఇంకా ఎందుకు సహిస్తున్నావు

నీవు కోరుకుంటున్న స్వేచ్ఛ కోసం
నీకు ఇబ్బంది లేని సమాజం కోసం
ప్రభవించే చైతన్యమై ప్రజ్వరిల్లు
తిరుగుబాటు బావుటై రెపరెపలాడు

భయ పడేవారిని మరింత భయపెట్టే సమాజం మనది
మెత్తగా ఉన్నవారిని మరింత మొత్తే సంప్రదాయం మనది
అందుకే అంటున్నా భయానికి నీవో భయం కావాలి
మొత్తేవారిని దనుమాడే సుత్తి సమ్మెట కావాలి
తెగబడే వారిని తెగ నరికే కత్తివి కావాలి
తెగువ చూపే సత్తా కావాలి
ప్రేమోన్మాదులనూ, కామాంధులనూ
అంతమొందించే ఆయుధం కావాలి
మహిళాలోకానికి మార్గదర్శివి కావాలి
అందుకోసం నీవు పోరాడాలి.

క్రిస్మస్

- గత్తం వెంకటేశ్వరరావు



తెల్లారి లేచింది మొదలు
పిట్టల్లా పట్టెడు కూటికోసం
ఉరుకులు తప్పని బ్రతుకుల్లో
ఆకలి తీర్చే వాడే దేవుడు
ఆదరించే వాడే ఆప్తుడు
ఆ దేవుడే ఆప్తుడై
అవనిపై మానవుడై
అవతరించిన రోజే క్రిస్మస్
చెమట కార్చకుండా
పరుగు తీయకుండా
కడుపు నిండితేనే పండుగ
కన్నీరు రాల్చకుండా
ఆక్రందన చేయకుండా
ఆనందం అందితే నిండుగ
అదే కదా పండుగ!
ఆరోజు రావాలి ఈ భువికి
క్రిస్మస్సై రావాలి అందరికి!!

ఒకేలా ఉన్నవేవి?

పిల్లలూ... కిందున్న బొమ్మల్లో అచ్చంగా ఒకేలా రెండు బొమ్మలున్నాయి. అవేంటో, ఎక్కడున్నాయో వెతికి పట్టుకుని సున్నా చుట్టండే.

అలవాటు

రమేష్: పొద్దున్నే నాలుగు గంటలకు లేవడం, ఓ గంటపాటు పరిగెత్తడం నాకు అలవాటు

సత్య: ఇలా ఎప్పటినుండి చేస్తున్నావు?

రమేష్: వచ్చే సోమవారం నుంచి చేద్దామనుకుంటున్నాను.

డి. రమేష్, 8వ తరగతి, విజయవాడ.

జోక్స్.... జోక్స్

నోరు మంచిదైతే...

తండ్రి: చింటు! ఈ రోజు పళ్లు తెగ తోమేస్తున్నావేంటి?

చింటు: అదా! మా మాష్టారు నోరు మంచిగా ఉంటే ఊరు మంచిగా ఉంటుందని చెప్పారు నాన్నా అందుకని.

దారి చెప్దామా?



రంగులు పులిమేద్దాం

బాలనేస్తాలు

తేడాలేంటో...

హాయ్ నేస్తాలూ... ఈ రెండు బొమ్మల్లో ఐదు తేడాలున్నాయి. అవేంటో కనిపెడతారు కదూ!

ఎన్నున్నాయో...

హాయ్ పిడుగులూ... కిందున్న బొమ్మను చూశారుగా. కొంచెం తమాషాగా ఉంది కదూ. సరేకానీ ఆ మొహంలో ఎన్ని మొహాలు కనిపిస్తున్నాయో చెప్పండి.

గుర్తించండి

హాయ్... పై బొమ్మను చూశారుగా. ఏం కనిపిస్తోంది? ఒక చిన్న కోడి దాని ఎదురుగా పెద్ద కోడి కనిపిస్తోంది కదూ. అయితే ఆ కోడి శరీరాన్ని బాగా పరిశీలించి చూడండి. చాలా వస్తువులు కనిపిస్తున్నాయి కదూ. మరింకేం.. ఆ వస్తువులు కూడా అక్కడే ఉన్నాయి. వాటన్నింటిని కనిపెట్టి సున్నా చుట్టండి.

అతికించేద్దామా!

హలో చిన్నారులూ... కిందున్న బొమ్మనే చిన్న చిన్న ముక్కలుగా కట్ చేసి పక్కన ఇచ్చారు. వాటి వరుస నెంబర్లుకూడా అక్కడే ఉన్నాయ్. మరి వాటిన్నింటిని జత చేస్తే మీరు అదే బొమ్మను సొంతంగా తయారు చేసుకోవచ్చు. ఏమంటారు?

నిరుద్యోగ యువతకు వరం 'రాజీవ్ ఉద్యోగ శ్రీ' పథకం

"ఏ సమాజ అభివృద్ధికైనా ప్రాతినిధ్యం వహించేది యువతరమే. సామాజిక, ఆర్థిక, వ్యాపార, రాజకీయ రంగాలలో యువతపాత్ర ప్రధానమైనది. ముఖ్యంగా రాష్ట్రం ఐ.టి. రంగానికి ప్రపంచ కేంద్రంగా మారాక, అందివచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకుంటూ యువత విజయపథంలో ముందుకు సాగిపోతోంది. అయితే సరైన వృత్తినైపుణ్యం లేని కారణంగా కొందరు, ముఖ్యంగా గ్రామీణ యువత ఆ విజయావకాశాలను అందుకోలేక పోతున్నారు. అటు సంస్థలకు ఉద్యోగుల అవసరం ఉండి కూడా ఇటు యువతకు ఉద్యోగం దొరకకపోవడం చిత్రమైన పరిస్థితి. ఈ పరిస్థితిని అధిగమించేందుకు, యువతను ఉద్యోగార్హులుగా తీర్చిదిద్దేందుకు ప్రవేశపెట్టిన పథకం 'రాజీవ్ ఉద్యోగ శ్రీ'. దీనికి తోడుగా 'జవహర్ నాలెడ్జ్ పార్కులు', 'రాజీవ్ యువశక్తి పథకం' వంటి పథకాలన్నీ యువతను ఉపాధివైపుకు నడిపించే దివ్యాస్త్రాలు. వీటిని సద్వినియోగం చేసుకోండి. అన్ని రంగాల్లోనూ అవకాశాలను అందిపుచ్చుకోండి. రాష్ట్రఅభివృద్ధిలో మీ భాగస్వామ్యాన్ని అందించండి."

మీ

వై.యస్.రాజశేఖర రెడ్డి

రాజీవ్ ఉద్యోగ శ్రీ

విద్యార్హతలుండీ, వృత్తినైపుణ్యత లోపించిన కారణంగా ఉద్యోగాలు పొందలేకపోతున్న యువతకు ఉచితంగా ఆయా ఉపాధి రంగాలకు అవసరమైన శిక్షణనిచ్చి, వారికి ఉపాధిమార్గాలను కల్పించే ఉద్దేశంతో ప్రవేశపెట్టినదే 'రాజీవ్ ఉద్యోగ శ్రీ' పథకం. ప్రతి గ్రామానికి కనీసం 10 ఉద్యోగాలను కల్పించే విధంగా రానున్న రెండేళ్ళలో 10 లక్షల మందికి ఉద్యోగావకాశాలను అందించడమే ప్రభుత్వ లక్ష్యం.

రాష్ట్ర వ్యాప్తంగా 217 పారిశ్రామికవాడలలో ఉన్న 1,48,000 చిన్న తరహా పరిశ్రమలకు ఒక్కోదానికి ఇద్దరు లేదా ముగ్గురు ఉద్యోగుల కనీస అవసరం ఉండగా, మొత్తం నాలుగు లక్షల ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయి. రాష్ట్ర రాజధాని, దాని చుట్టూ ఉన్న రంగారెడ్డి, నల్గొండ, మెదక్ జిల్లాలలోనే 27 పారిశ్రామికవాడలలో 40 వేల చిన్నతరహా పరిశ్రమలున్నాయి. వీటికి 2,80,000 ఉద్యోగులు అవసరం. ఇవేకాక సాఫ్ట్‌వేర్, బయోటెక్నాలజీ, నిర్మాణరంగం, రిటైలింగ్, టూరిజం వంటి రంగాలకు ఎంతోమంది ఉద్యోగుల అవసరం ఉంది. అదే సమయంలో ఇటు ఉద్యోగార్థులూ ఉన్నారు. అయితే వీరి విద్యార్హతలకు, చేయవలసిన పనికీ సంబంధంలేని కారణంగా, అటు సంస్థలకు ఉద్యోగులు కరువయ్యారు, ఇటు యువత ఉద్యోగాలను అందుకోలేకపోతున్నారు. సరిగ్గా ఈ అంతరాన్ని పూరించి ఇటు యువతకు ఆయా రంగాలకు సంబంధించిన అంశాలలో శిక్షణనిచ్చి, తద్వారా ఉపాధి అవకాశాన్ని కల్పిస్తూ, అటు ఆయా సంస్థలకు అర్హులైన ఉద్యోగులను అందిస్తూ దిగ్విజయంగా అమలవుతోంది 'రాజీవ్ ఉద్యోగ శ్రీ'

పథకం ఉద్దేశాలు :

(1) నిరుద్యోగుల తరపున ప్రభుత్వానికీ, సంస్థలకు ముఖ్యంగా ప్రైవేటు సంస్థలకు మధ్య వారధిగా నిలబడి యువతకు ఉద్యోగాలను కల్పించడం.

(2) రానున్న రెండేళ్ళలో 10 లక్షల మందికి ఉద్యోగావకాశాలను అందించడం. ఇందులో 5 లక్షల మందికి సాఫ్ట్‌వేర్ మరియు దాని అనుబంధ రంగాలలో ఉన్నతస్థాయి ఉద్యోగాలను అందించడం. మరో 5 లక్షల మందికి కనీసం రూ. 5000/-ల నెలజీతం గల ఉద్యోగాల కల్పన.

(3) ఉపాధికల్పనారంగాలలోని అన్ని శాఖలకు ఉపాధి అవకాశాలను సృష్టించడంలో ఆచరించవలసిన ప్రణాళికలను, కార్యక్రమాలను రూపొందించడం.

(4) ఉద్యోగార్థులకు అవసరమైన శిక్షణ విషయాలపై సలహాలివ్వడమే కాకుండా సరైన స్థానాలలో వారిని భర్తీ చేయడం. రాష్ట్రంలోనే కాక ఇతర రాష్ట్రాలు, విదేశాలలో సైతం ఉపాధికి అవసరమైన, మార్కెట్ డిమాండ్‌కు అనుగుణమైన ప్రత్యేక శిక్షణనిచ్చి యువతకు ఉత్తమ అవకాశాలను కలిగించడం.

(5) జాతీయ, అంతర్జాతీయ ఆర్థిక ఎదుగుదలలో మానవ వనరుల భాగస్వామ్యాన్ని పెంచడం.

యువతకు వృత్తి నైపుణ్యంలో శిక్షణ ఇచ్చేందుకు రాష్ట్రవ్యాప్తంగా 55 ప్రత్యేక శిక్షణా సంస్థలు 'రాజీవ్ ఉద్యోగ శ్రీ' పథకంలో భాగంగా పనిచేస్తున్నాయి. అన్ని యూనివర్శిటీలలోను 'జవహర్ నాలెడ్జ్ పార్క్'లను ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు యువతకు అవసరమైన సమాచారాన్ని అందిస్తున్నారు.



www.rajivudyogasri.gov.in

'రాజీవ్ ఉద్యోగ శ్రీ' పథకంపై అవగాహన కల్పించేందుకే కాకుండా ఉద్యోగమేళాలు, శిక్షణాసంస్థలు, ఉద్యోగసంస్థల గురించిన సమాచారాన్ని అందుబాటులో ఉంచేందుకు వీలుగా 'రాజీవ్ ఉద్యోగ శ్రీ' పోర్టల్‌ను 25, జూలై 2008న ముఖ్యమంత్రి డాక్టర్ వై.యస్. రాజశేఖర రెడ్డి ప్రారంభించారు.

ఉద్యోగం కోరుకుంటున్న అభ్యర్థులు ఈ వెబ్‌సైట్‌లో తమ పేర్లను నమోదు చేసుకోవచ్చు. కనీసం 5వ తరగతి చదివినవారంతా వారి పేర్లను రిజిస్టర్ చేసుకోవచ్చు.

అర్హులైన ఉద్యోగులను కావాలనుకున్న సంస్థలు కూడా ఈ వెబ్‌సైట్‌లో తమ సంస్థ పేరును నమోదు చేయడంతో పాటు ఉద్యోగ సమాచారాన్ని కూడా ఉంచవచ్చు.

వివిధ శిక్షణా సంస్థలు, అవి అందజేసే కోర్సుల వివరాలు ఈ వెబ్‌సైట్‌లో పొందుపరిచారు కాబట్టి అభ్యర్థులు వారికి ఇష్టమైన రంగంలో అవసరమైన శిక్షణను పొందడంతో పాటు ఉద్యోగాన్ని కూడా సంపాదించుకోవచ్చు.

మే 2004 నుండి సెప్టెంబరు 31, 2008 వరకు వివిధ విభాగాల ద్వారా రాజీవ్ ఉద్యోగశ్రీ పథకం అమలు తీరు

క్ర. సం.	విభాగం పేరు	05/2004 నుండి 03/08 వరకు నాలుగు ఆర్థిక సంవత్సరాల పనితీరు		2008-09 ఆర్థిక సంవత్సరం సెప్టెంబరు 31, 2008 వరకు				మొత్తం		
		శిక్షణ పొందినవారు	శిక్షణ అనంతరం ఉద్యోగాలు పొందినవారు	లక్ష్యం	శిక్షణ పూర్తి చేసిన వారు	శిక్షణ పొందుతున్న వారు	శిక్షణ అనంతరం ఉద్యోగం పొందినవారు	శిక్షణ పొందుతున్న వారు	శిక్షణ పొందినవారు	శిక్షణతర్వాత ఉద్యోగాలు పొందినవారు + నేరుగా ఉద్యోగాలు పొందినవారు
1.	ఎం.ఎ & యుడి/ఎం.ఇ.పి.ఎం.ఎ	47687	37092	47000	10409	6126	7676	6126	58096	44768
2.	సాంకేతిక విద్య	92625	55021	10000	3304	2694	2541	2694	95929	57562
3.	ఇంటర్మీడియట్ బోర్డు	36780	9233	7000	22656	52212	3490	52212	59436	12723
4.	కళాశాల విద్య	21406	4547	50000	15240	7736	686	7736	36646	5233
5.	యువజన సర్వీసులు	83588	50487	80000	1850	36810	1375	36810	85438	51862
6.	ఎన్.ఎ.సి.	39365	25633	50000	11104	1400	5816	1400	50469	31449
7.	ఐ.ఇ.జి.	65541	13913	57000	591	47426	1266	47426	66132	15179
8.	ఎస్సీ కార్పొరేషన్	28418	11967	5000	4755	14146	2709	14146	33173	14676
9.	మైనార్టీ సంక్షేమం*	4428	1876	5000	0	0	0	0	4428	1876
10.	ఆంధ్రప్రదేశ్ వికలాంగుల కార్పొరేషన్	7996	0	2000	214	68	80	68	8210	80
11.	ఇ.జి.ఎం.ఎం.*	110827	110827	200000	31216	25975	27979	25975	142043	138806
12.	ఎంప్లాయ్‌మెంట్ అండ్ ట్రైనింగ్	25409	15847	200000	7463	5214	2749	5214	32872	18596
13.	ఇతరములు (నేరుగా ఉద్యోగాలు పొందినవి)	0	52907	0	0	0	21508	0	0	74415
	మొత్తం	564070	389350	713000	108802	199807	77875	199807	672872	467225

*ఉద్యోగమేళాల ద్వారా పొందిన ఇ&టి, మెప్మా,టి.ఇ. ఉద్యోగాలు-74415

జారీచేసినవారు: సమాచార, పౌర సంబంధాల శాఖ

ఉగ్గాని

కావలసినవి

బొరుగులు (మరమరాలు) - పావు కిలో
పచ్చిమిర్చి - 50 గ్రాములు
టమేటోలు - రెండు
ఉల్లిపాయలు - ఒకటి
వెల్లుల్లి - ఐదు రేకలు
కరివేపాకు -పసుపు - సరిపడినంత
నూనె - పోపుకు సరిపడా
కొబ్బరి - 50 గ్రాములు
ఉప్పు - తగినంత
పుట్నాల పొడి - 100గ్రాములు
నిమ్మకాయం - 1

చేసే విధానం

బొరుగులు నానబెట్టి కొద్దిగా మెత్తపడగానే నీరు పిండేసి ఒక గిన్నెలోకి తీసుకోవాలి. పచ్చిమిర్చి, కొబ్బరి, వెల్లుల్లి, ఉప్పు వేసుకుని మిక్సీ వేసుకోవాలి. ఉల్లిపాయలను నిలువుగా తరుగుకోవాలి. స్టౌవ్ మీద గిన్నె పెట్టి నూనె వేడి చేయాలి. అందులో ముందుగా తరిగి వుంచుకున్న ఉల్లిపాయలను వేయాలి. కొద్దిగా వేగిన తరువాత అందులోనే మిక్సీ వేసుకున్న పచ్చిమిర్చి మిశ్రమాన్ని వేయాలి. పచ్చివాసన పోయే వరకు మగ్గనివ్వాలి. తరువాత పసుపు, టమేటో ముక్కలు వేసుకోవాలి. అడుగంటకుండా అంతా మగ్గే వరకు ఉండాలి. ఇందులో నీళ్లలో నాన్చుకుని తీసిన బొరుగులు(మరమరాలు) వేసి బాగా కలియతిప్పి దించేసుకోవాలి. బజ్జీలు దీనికి చక్కని కాంబినేషన్. కావాలనుకున్న వారు నిమ్మకాయ కూడా పిండుకోవచ్చు.

బొప్పాయి కూర

కావలసినవి

పచ్చి బొప్పాయి - అరకేజీ (మీడియం సైజు కాయ)
పసుపు - చిటికెడు
ఉప్పు - తగినంత
కారం - సరిపడా
పచ్చిమిర్చి -4
ఉల్లిపాయ - 1
పోపు గింజలు - ఆవాలు, జీలకర్ర, మినప్పప్పు, శనగపప్పు, కొబ్బరి పొడి - 2 టేబుల్ స్పూన్లు
గరం మసాలా - 1 టీ స్పూను

చేసే విధానం

ముందుగా బొప్పాయి చెక్కు తీసేయాలి. లోపల గింజలు కూడా తీసేసుకుని చిన్న ముక్కలుగా కోసుకోవాలి. అడుగు మందంగా వున్న బాండి పెట్టి తాలింపుకు నూనె వేసుకోవాలి. కొద్దిగా కరివేపాకు, పోపు గింజలు వేసుకోవాలి. వేగిన తరువాత ఉల్లిపాయ ముక్కలు వేసుకోవాలి. అవి కూడా వేగిన తరువాత బొప్పాయి ముక్కలు వేసుకోవాలి. కొద్దిగా పసుపు, ఉప్పు వేసుకోవాలి. ముక్కలు మగ్గే వరకు ఆగి తరువాత కారం, కొబ్బరి వేసుకోవాలి. చివర్లో రెండు నిమిషాల ముందు గరం మసాలా పొడి వేసుకోవాలి. ఆలు ఫ్రైలాగే చాలా బాగుంటుంది.

జొన్న అప్పాలు

కావలసినవి

జొన్నపిండి - చిన్న కప్పు
ఉప్పు - సరిపడినంత
కారం - రుచికి తగినంత
నువ్వులు - ఒక స్పూను
పచ్చిశనగ పప్పు - ఒక స్పూను
వాము - చిటికెడు
వంట సోడా - చిటికెడు

చేసే విధానం

ముందుగా జొన్న పిండిలో ఉప్పు, కారం, నువ్వులు, పచ్చిశనగలు, కొద్దిగా వాము, వంట సోడా వేసుకుని చపాతీ పిండిలా కొద్దిగా గట్టిగా కలుపుకోవాలి. ఒక మందపాటి ప్లాస్టిక్ కవరు తీసుకుని దానిపై పిండిని ఒక చిన్న వుండ తీసుకుని చపాతీలా కర్రతో కొంచెం మందంగా వత్తుకోవాలి. దీనిపై చాకు తీసుకుని మనకు కావలసిన ఆకారంలో కత్తిరించుకోవాలి. బాండీ పెట్టి వేయించుకోవడానికి సరిపడా నూనె వేసుకుని వేడిచేసుకోవాలి. వాటిని నూనెలో వేయించుకోవాలి. కరకరలాడుతూ రుచిగా వుంటాయి. ఇవి నూనెను కూడా ఎక్కువ పీల్చుకోవు. వరి పిండితో చేసే అప్పాల కంటే చాలా రుచిగా వుంటాయి.

గుమ్మడికాయ హల్వా

కావలసినవి

బూడిద గుమ్మడి - పెద్దముక్క (పావుకిలో)
చక్కెర - పావుకిలో
పాలు - పావులీటరు
నెయ్యి - ఒక చిన్న కప్పు
బాదం పప్పులు - 100 గ్రాములు
యాలకుల పొడి - చిటికెడు

చేసే విధానం

గుమ్మడి ముక్కను తీసుకుని ముందుగా తొక్క తీసి శుభ్రం చేసుకోవాలి. దీన్ని కొబ్బరి మాదిరి తురుముకోవాలి. అడుగు మందంగా వున్న బాండీలో కొద్దిగా నెయ్యి వేసుకుని తురుమును వేసి కాసేపు మగ్గనివ్వాలి. మాడకుండా సన్నని మంటపై పెట్టి కలువుతూ వుండాలి. తరువాత పాలుపోసి అవి ఇగిరిపోయే వరకు ఉడకనివ్వాలి. హల్వా దగ్గరకు వస్తున్నప్పుడు చక్కెర వేయాలి. నీరు లేకుండా పూర్తిగా మగ్గనివ్వాలి. ఇష్టం వున్న వారు యాలకుల పొడి కొద్దిగా వేసుకోవచ్చు. చివరిలో బాదం పప్పులు వేయాలి. అంతే...గుమ్మడి హల్వా రెడీ.

- ఎస్. హైమ

ఆరోగ్యం

రేబిస్ రాకుండా...

పిచ్చి కుక్క కరవడం వల్ల రేబిస్ అనే వ్యాధి రావచ్చు. ఇది మెదడు నరాలను దెబ్బతీసి, గొంతు కండరాలను పక్షవాతానికి గురిచేసి మనిషి మరణానికి దారి తీసే అవకాశం ఉంది. ఒకసారి ఈ జబ్బు కనుక సోకితే చికిత్సే లేదు. కానీ మంచి నివారణా పద్ధతులున్నాయి. వెంటనే స్పందిస్తే వంద శాతం జబ్బు రాకుండా నిరోధించవచ్చు. చికిత్స లేని జబ్బులకు ఉదాహరణ రేబిస్. అలాగే మంచి నివారణా పద్ధతులున్న జబ్బులకు కూడా ఇది మంచి ఉదాహరణ. అసలు దేనివల్ల ఇది వస్తుంది? అప్పుడు ఏం చేయాలి? ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలి? ఇప్పటికి ప్రచారంలో వున్న మూఢనమ్మకాలేంటి? వంటి వివరాలు ఈ వారం తెలుసుకుందాం.

డా॥ వి. చంద్రశేఖర్
అసిస్టెంట్ ప్రొఫెసర్,
ఎం.జి.యం. హాస్పిటల్,
వరంగల్.

రేబిస్ ఒక వైరస్ వల్ల వస్తుంది. ఈ వైరస్ క్రిమి జంతువుల నుండి మనుషులకు సోకుతుంది. జంతువుల లాలాజలంలో నెలవుండే ఈ వైరస్ జంతువులు కరిచినప్పుడు ఏర్పడే గాట్ల ద్వారా మనిషి శరీరంలోకి ప్రవేశిస్తుంది. పెంపుడు జంతువులైన కుక్కలు, పిల్లుల ద్వారా పట్టణాల్లో రేబిస్ వస్తుంటే, అడవి జంతువులైన తోడేళ్ళు, నక్కలు ఈ వైరస్‌ను తమలో నిలవవుంచుకుని రేబిస్ వ్యాప్తికి దోహదం చేస్తున్నాయి. మనుషులకు మాత్రం దాదాపు తొంభైతొమ్మిది శాతం కుక్కలు కరవడం వల్లే వస్తుంది. ఇహ అమెరికా, లాటిన్ అమెరికా దేశాల్లో వ్యాంపైర్ గబ్బిలాలు రేబిస్ జబ్బును వ్యాపింపచేయటంలో ప్రధాన పాత్ర వహిస్తున్నాయి. రేబిస్ జబ్బు వున్న మనిషి ఇంకో మనిషిని కొరకడం ద్వారా వ్యాప్తి చెందటం చాలా అరుదు.

పిచ్చి కుక్క కరిచినపుడు ఏమౌతుంది?

కరిచిన చోట గాటు ద్వారా రేబిస్ వైరస్ మనిషి శరీరంలోని కండరాల్లోకి మొదట ప్రవేశిస్తుంది. తర్వాత కండరాల్లోని నాడుల ద్వారా మెదడుకు చేరుతుంది. మెదడు నుంచి తిరిగి శరీరంలోని ఇతర కండరాలకు, గుండె కండరాలకు, గొంతు కండరాలకు, లాలాజల గ్రంథులకు వ్యాప్తి చేస్తుంది. గాటు పడినప్పటి నుండి రేబిస్ వచ్చేవరకు సాధారణంగా నాలుగు నుండి ఆరు వారాలు పడుతుంది. ఒక్కోసారి కేవలం ఐదు రోజుల్లోనే రావచ్చు. మరోసారి జబ్బు రావడానికి ఏడు సంవత్సరాల సమయం కూడా పట్టవచ్చు. ముఖ్యంగా మెదడుకు దగ్గరగా ఉండే ముఖం, మెడ, చేతులు వంటి భాగాల్లో గాటు పడినప్పుడు వ్యాధి లక్షణాలు త్వరగా కనిపించే అవకాశం ఉంది.



నీళ్లభయం నిజమేనా?

గాటు పడిన చోట దురదగానూ, తిమ్మిరి తిమ్మిరిగానూ ఉండొచ్చు. కొద్దిగా జ్వరం, తలనొప్పి, నిద్రలేమి, ఆందోళన, దడ ముందస్తు లక్షణాలుగా కనపడవచ్చు. 'హైడ్రో ఫోబియా' (నీళ్లభయం) విలక్షణ లక్షణంగా చెప్పుకోవచ్చు. నోటి, గొంతు మరియు శ్వాసకోశ కండరాలు అకస్మాత్తుగా బిగబట్టడం వలన నీళ్లు మింగలేకపోవచ్చు. ఫిట్స్ వచ్చి కొట్టుకోవడం జరుగుతుంది. మొదట్లో నీళ్లు తాగాలని ప్రయత్నించినపుడు గొంతు బిగబట్టి బాధకు గురిచేస్తే తర్వాతర్వాత నీటి శబ్దం వల్ల నీటి గురించిన ఆలోచన వల్ల ఫిట్స్ రావడం జరగవచ్చు. చిరాకు పరిచే ధ్వనుల వల్ల, చల్లగాలి వల్ల కూడా ఫిట్స్‌లాగా రావచ్చు. అనేక రకమైన భ్రమలు భ్రాంతులతో మనిషి విలవిలాడిపోతాడు. వేటిని పడితే వాటిని కొరకడం, విచక్షణా రహితంగా ఉమ్మివేయడం రేబిస్ జబ్బుల్లోని ఒక భయంకరమైన కోణం. ఒక్కసారి మెదడుకు సోకితే మరణం తథ్యం.

రేబిస్ ఎంతో పురాతనమైన జబ్బే అయినా ఇప్పటికీ పూర్తిగా నిర్మూలించలేకపోయాం. అభివృద్ధి చెందిన అమెరికా లాంటి దేశాల్లో సంవత్సరానికి రెండు రేబిస్ మరణాలు సంభవిస్తుంటే భారతదేశంలో 25000 నుండి 40 వేల మంది దాకా మరణిస్తున్నారు. అండమాన్, నికోబార్, లక్షద్వీపాలలో మాత్రం రేబిస్ వ్యాధి లేదు.

నివారణా మార్గాలు

కుక్క కరిచిన వెంటనే గాయాన్ని మామూలు నీళ్లతో కానీ, సబ్బునీళ్లతో కానీ శుభ్రంగా కడగటం వల్ల జబ్బును సగం నివారించవచ్చు. కడగటానికి టింక్చరు, అయోడిన్ మందును కూడా వాడవచ్చు. గాయం పెద్దదిగా ఉన్నా కుట్లు వెంటనే వేయకూడదు. గాయాన్ని ఓపెన్‌గా ఉంచి ఇతర ఇన్‌ఫెక్షన్లు రాకుండా యాంటీబయాటిక్ మందులు వాడాలి. టీటీ ఇంజెక్షన్ తీసుకోవాలి.

వ్యాక్సీన్లు

ఇంతకు ముందు సీరమ్ వ్యాక్సిన్లు ఉండేవి. దాదాపు పద్నాలుగు ఇంజక్షన్లు బొడ్డు చుట్టూ ఇచ్చేవారు. సీరం సూదులతో దుష్ఫలితాలు ఎక్కువగా ఉండటం వల్ల వాటి స్థానంలో ప్రస్తుతం సెల్ కల్చర్డ్ వ్యాక్సిన్లు ఇస్తున్నారు. ఇవి 5 ఇంజక్షన్లు. 0,3,7,14,30 రోజుల్లో తీసుకుంటే సరిపోతుంది. అవసరాన్ని బట్టి ఆరవ ఇంజక్షన్‌ను తొంభయ్యవరోజున ఇవ్వవచ్చు. అయితే గాటు మరీ పెద్దదైనప్పుడు ఇమ్యునో గ్లోబ్యులిన్ మందును కూడా ఇస్తే ప్రమాదం మరింత తగ్గుతుంది. మరో ముఖ్య విషయం - కరచిన జంతువును పదిరోజులపాటు గమనించాల్సి ఉంటుంది. ఈ పదిరోజుల్లో మొదటి మూడు సూదులు తప్పనిసరిగా వేసుకుంటే మిగతా రెండు అవసరాన్ని బట్టి తర్వాత వేసుకోవాలి. అంటే కరిచిన కుక్క పదిరోజులకల్లా చనిపోయినా, పిచ్చి లక్షణాలతో ప్రవర్తిస్తున్నా టీకాలు కొనసాగించాలి. ఈ టీకాల విలక్షణత ఏంటంటే అన్ని టీకాలు బాక్టీరియా, వైరస్‌లు శరీరంలో ప్రవేశించకముందే వేసుకుంటే రేబిస్ టీకాలు మాత్రం వైరస్ శరీరంలో ప్రవేశించిన తర్వాత (కుక్క కరిచిన తర్వాత) వేసుకోవడం.

కరవక ముందే ఇచ్చే (ప్రి ఎక్స్‌పోజర్ సూదులు) అందరికీ అవసరం లేదు. పశు సంవర్ధక శాఖలలో పని చేసేవారికి, జంతువులను మచ్చిక చేసుకునే వృత్తులవారికి మాత్రమే అవసరం వుంటుంది.

విచారించదగ్గ విషయం

వందశాతం నివారించదగ్గ జబ్బైనా ప్రతి సంవత్సరం కొన్ని వేలమంది ఈ జబ్బుతో చనిపోవడం ప్రజారోగ్య నిర్లక్ష్యానికి నిలువెత్తు నిదర్శనం. కుక్కకాటు మందు ప్రతి ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో కొరత లేకుండా నిత్యం లభించాలి. గవర్నమెంటే ఈ సెల్ కల్చర్డ్ టీకాలను తయారు చేస్తే మరింత ప్రయోజనం చేకూరుతుంది.

అట్టమీది కథ

బ్రతుకు దారం హృదయ ద్వారం

డైరీ...
ఎంత చిన్న మాట!
పలకడానికి రెండక్షరాల పదమే అయినా
అందులో ఎన్ని బాసలో!
ఎన్నెన్ని భావాలో!!
అక్షరాల అలల్లో అందంగా ఒయ్యారంగా ఎగిసి
పడుతుంటాయి.
డైరీ ...
ఒక చిత్రమనుకుంటే మనమే చిత్రకారులం.
శిల్పమనుకుంటే మనమే శిల్పులం. అయితే ఇందులో
అసత్యానికి అస్సలు చోటుండదని మరువకూడదు. ఇది
నిజాయితీకి నిలువుటద్దమని గుర్తుంచుకోవాలి. ఎన్నటికీ
వీడని ఆత్మీయ [illegible]మని మదిలో ముద్రించుకోవాలి. మనల్ని
మ[illegible] అర్థం చేసుకోవాలనుకున్నా...
ఆవిష్కరి[illegible]కోవాలన్నా... డైరీ రాయడానికి శ్రీకారం
చుట్ట[illegible]దే. కొత్త సంవత్సరం సందర్భంగా ఈ కొత్త
నిర్ణయం తీసుకుందాం. దినచర్య రాయనారంభిద్దాం.

-అంజన.కె



ప్రతి ఒక్కరికి బంధాలు బంధువులు, స్నేహాలు స్నేహితులు వుంటారు. ఈ చట్రంలో ఎన్నో పాత్రలు పోషిస్తుంటాం. బాధ్యతలు నిర్వర్తిస్తుంటాం. అయితేనేం అత్యంత సన్నిహితులకు సైతం చెప్పుకోలేని విషయాలు ఎన్నో వుంటాయి. ఆనందం, ఆక్రోశం, ఆశ, బాధ, ఏడుపు, కోపం, ఉక్రోషం, తపన...అన్నిటినీ ఏటువంటి సంకోచాలు లేకుండా స్వచ్ఛంగా సహజంగా రాసుకునేది డైరీలోనే. మనం చేసిన తప్పులను, మంచి పనులను సాధించిన విజయాలను, చేజార్చుకున్న సంతోషాలను, పూరించాల్సిన భర్తీలను, నిర్వర్తించాల్సిన బాధ్యతలను ఎప్పటికప్పుడు డైరీలో రాసుకుంటూ వుంటే ... ఎక్కడెక్కడ తప్పటడుగులు వేశామో... వేటికోసం మరింత కష్టపడాలో తెలుస్తుంటుంది. ఆ దిశగా ముందుకు నడవడానికి ఉపకరించేదే డైరీ. అందుకే ఈ కొత్త సంవత్సరం నుంచైనా దినచర్య రాయడం ప్రారంభిద్దాం. అలా అనుకుంటేనే సరిపోదుగా! డైరీ ఒకటి సంపాదించాలి. ఎటూ మరో మూడు రోజుల్లో కొత్త సంవత్సరంలోకి అడుగెట్టబోతున్నాం. కాబట్టి అప్పటి నుంచి మొదలెడదాం.

ఏం రాయలి? ఎలా మొదలెట్టాలి?

కొత్తగా డైరీ రాయబోయే వారికి ఇలా అనిపించడం సహజమే. పైగా మనసులోని మాటలను రాయడం కూసింత కష్టమైనపనే. మరీ ముఖ్యంగా రాయడం అలవాటు లేనివారికి. పైగా రాసేదేదో బాగా రాస్తే బావుంటుందని ఒక ఫీలింగ్ వెంటాడుతుంటుంది. దాంతో కొత్త డైరీ మీద చెయ్యి పెట్టి అలా ఆలోచిస్తుండాల్సివస్తుంది. దీన్నుంచి బైట పడాలంటే మాత్రం ఒక ఐడియా వుంది. మీకు నచ్చిన, స్ఫూర్తినిచ్చిన వాక్యాలు, మాటలు, కొటేషన్లు ఏమైనా వుంటే ఎంచక్కా మొదటిపేజీలో పైభాగాన రాసేయండి. ఈ పద్ధతి నచ్చలేదనుకోండి. మనకోసం పరితపించే, మన మంచి కోరుకునే వారి ఆశీస్సులతో, అభినందనలతో మొదలెట్టండి. అంతే ఇంక మీ చేతిలో పెన్ను ఆగకుండా పరిగెడుతూనే వుంటుంది. రోజు మొత్తంలో మనల్ని కదిలించిన అంశాలు, స్ఫూర్తినిచ్చిన విషయాలు, వ్యక్తులు, తారసపడిన కొత్త వ్యక్తులు, మనస్తత్వాలు, మనల్ని కట్టిపడేసే బంధాలు, అనుబంధాలు, చూసిన సినిమాలు, చదివిన పుస్తకాలు ఇలా దేన్ని గురించైనా రాయొచ్చు. మన మనసులో ఏదనిపిస్తే అది రాయొచ్చు. ఇలా రాశారేంటి? అలా రాయాలి కదా? అని బెత్తం పుచ్చుకుని అడిగేవారెవరూ వుండరు. మనకు పూర్తి స్వేచ్ఛ వుంటుంది. పైగా సన్నిహితులు, స్నేహితులతో కలిసి మనం ఎక్కడికైనా వెళుతుంటాం. ఆ విశేషాలను, మన హృదయ స్పందనలను చక్కగా రాయొచ్చు. అక్కడ తీయించుకున్న ఫొటో ఒకటి డైరీలో అతికించేస్తే... చాలా బావుంటుంది. తర్వాత ఎప్పుడైనా డైరీ పేజీలను వెనక్కి తిప్పినప్పుడు మన మనసు కూడా ఆటోమేటిగ్గా అక్కడికి వెళ్లిపోతుంది. ఆ సంఘటనలన్నీ ఒక్కటొక్కటిగా గుర్తొస్తాయి. ఆ అనుభూతే వేరు.



అన్నే ఫ్రాంక్

రోజూ రాయాలి

డైరీ రాయడం మొదలెట్టాక మాత్రం రోజూ రాయాల్సిందే. అస్సలు బద్ధకించకూడదు. రోజంతా గడిచాక నిద్రపోబోయేముందు ఓ అర్ధగంటసేపు దానికి కేటాయిస్తే చాలు. ముఖ్యమైన సంఘటనలేం లేవని బద్ధకించనవసరం లేదు. కలుసుకోలేకపోయిన ప్రేయసీప్రియుల విరహవేదనలైనా రాయొచ్చు. జీవిత భాగస్వామితో వచ్చిన గిల్లికజ్జాలు, అలకలు, ముద్దు ముచ్చట్లు.. ఏవైనా రాసేయొచ్చు. అయితే మొదట వీరావేశంగా కవితాత్మకంగా డైరీలను రాయడం మొదలెట్టినా తర్వాత్తర్వాత కేవలం జమాఖర్చులకే పరిమితం చేసే వారూ మనలో వుంటారు. అందుకే ఏ మాత్రం బద్ధకించక అలాగని సోది రాయక ముఖ్యమైన విషయాలను మాత్రమే అక్షరబద్ధంచేయాలి.

ఇంతకీ డైరీ రాయడం ఎందుకు?

చదువుకునే వారు, చదువు అయ్యాక ఉద్యోగం కోసం ఎదురుచూసేవారు, పెళ్లిఅయినవారు, కాబోయేవారు, జీవిత చరమాంకంలో వున్న వారు...ఎవరైనా రాయొచ్చు. ప్రతి రోజూ డైరీ రాయడం వల్ల మన రచనా శైలి ఏంటో తెలుస్తుంది. భావ వ్యక్తీకరణ మెరుగుపడుతుంది. భాష బాగవుతుంది. మనలోని రచయిత, విమర్శకుడు, విశ్లేషకుడు, తాత్వికుడు అందరూ కనిపిస్తారు. మనల్ని మనకే పరిచయం చేస్తారు. తప్పొప్పులను వెతికి చూపిస్తారు. అందుకే దినచర్యను క్రమం తప్పకుండా రోజూ రాయాల్సిందే.

ఎందరో ప్రముఖులు...

ఒక్క రోజు కూడా విడవకుండా సంవత్సరాల తరబడి డైరీలు రాసిన ప్రముఖులు ఎందరో. వీరిలో రచయితలు, రాజకీయవేత్తలు, దేశాధ్యక్షులు వున్నారంటే ఆశ్చర్యం కలుగుతుంది. బిజీ షెడ్యూల్‌లో కూడా డైరీ కోసం కొంత సమయం కేటాయించారంటేనే వారి మనసుల్లో దానికి వున్న ప్రాధాన్యత అర్థమవుతుంది. లియో టాల్‌స్టాయ్, ఫ్యోడర్ దోస్తోవ్‌స్కీ, వర్జీనియా వూల్ఫ్, వాల్టర్ స్కాట్, లూయిజా మే అల్కాట్, లూయిస్ కరోల్, గాంధీజీ, గురజాడ, కందుకూరి వీరేశలింగం, రావిశాస్త్రి, రావూరి భరద్వాజ, కుష్వంత్ సింగ్ ... ఇలా చెప్పుకుంటూ పోతే చాలా పెద్ద జాబితానే తయారౌతుంది. కొందరి డైరీలే చరిత్రకు సాక్ష్యాలుగా మిగిలాయంటే నమ్ముతారా! రెండవ ప్రపంచ యుద్ధ

తల్లి కాబోయేవారు తప్పక రాయాలి

జీవితంలో ఎన్నో దశలుంటాయి. బాల్యం, కౌమారం, యవ్వనం, వృద్ధాప్యం. ఇవన్నీ ఒక ఎత్తయితే గర్భం దాల్చినప్పుడు శారీరకంగా మానసికంగా కలిగే మార్పులు... ఆలోచనలు, ఉద్రేకాలు, భయాలు, సుందర స్వప్నాలు, ఊహల ఊసులు, ఆశల పల్లకీలు...అన్నిటినీ డైరీలో రాసుకోవడం అద్భుతానుభూతినిస్తుంది. ఎందుకంటే మన శరీరంలో మరొక జీవి ప్రాణం పోసుకొని దినదినాభివృద్ధి చెందుతోంటే లోపల, బయట కలిగే భావోద్రేకాలను ఇతరులతో పంచుకోలేం. మనకే మనం డైరీలో రాసుకోవాల్సిందే. మరెప్పుడైనా ఆ డైరీ తీసి చదువుతుంటే మనకే కొత్తగా వింతగా అనిపిస్తుంది. ఆ అనుభూతుల దొంతరలు మెరక్కడా అందవు. అలా కాదనుకుంటే ప్రతిరోజూ బొజ్జలోని పాపాయికి ఒక ఉత్తరం రాయొచ్చు (డైరీలోనే). పాపాయి కదులుతుంటే మీకేమనిపిస్తోంది? తనకు ఏ పేరు పెట్టాలనుకుంటున్నారు? ఏం చదివించాలనుకుంటున్నారు? పాపమీద మీరు పెట్టుకున్న ఆశలు... ఆశయాలు...అన్నీ రాయొచ్చు. ఇంకా... ఆ సమయంలో మీ శరీరంలో ఎలాంటి మార్పులొస్తున్నాయో కూడా ఎప్పటికప్పుడు అక్షరబద్ధం చేయొచ్చు. ఎందుకంటే మన శరీరాన్ని మనకంటే ఎక్కువగా ఎవరూ అధ్యయనం చేయలేరు. ఆ మార్పులను మనమే సునిశితంగా పరిశీలించగలం. ఇవన్నీ జీవితంలో ఒకటో రెండో సార్లు మాత్రమే అనుభవంలోకి వస్తాయి కాబట్టి తప్పనిసరిగా ఆ సమయంలో డైరీ రాసుకుంటే చాలా బావుంటుంది.

సమయంలో అన్నేఫ్రాంక్ అనే నెదర్లాండ్స్ యూదు బాలికకు పదమూడేళ్లు. సరిగ్గా ఆ సమయంలో తమ దేశాన్ని జర్మనీ దురాక్రమించినప్పుడు కుటుంబంతో సహా రెండేళ్లపాటు రహస్య జీవితాన్ని గడిపిన ఆమె రాసిన 'ది డైరీ ఆఫ్ ఎ యంగ్ గర్ల్' నాజీలు పెట్టిన కష్టాలను కళ్లకు కడుతుంది. ఆధునిక డైరీకి ఆద్యుడుగా ప్రసిద్ధిచెందిన శామ్యూల్ పీప్స్ (1633-1703) లండన్‌లో వ్యాపించిన ప్లేగువ్యాధి గురించి, డచ్ యుద్ధం గురించి అద్భుతంగా రాశాడు. గురజాడవారి డైరీని, లేఖలను పుస్తకంగా అచ్చువేశారు కూడా.

బాల్యం నుంచే ....

చిన్న పిల్లలుగా వున్నప్పటి నుంచే డైరీ రాయడం అలవాటైతే ఇంక వదలకుండా రాస్తూనే వుంటారు. ఈ అలవాటును పెద్దలే ప్రోత్సహించాలి. పిల్లలకు డైరీ కొనివ్వడం...రోజంతా అయిపోయాక ... రాత్రి పండుకోబోయే ముందు పది నిముషాల పాటు డైరీ రాసేలా ప్రోత్సహించడం పెద్దలుగా మన పని. లేచాను, స్నానం చేశాను, స్కూలుకెళ్లాను, ట్యూషన్‌కెళ్లాను, అన్నం తిని నిద్రపోయాను... వంటి విషయాలను డైరీలో నింపడం కాకుండా ఏ విషయాలను రాయాలో మనమే మొదట చెప్పాలి. ఆసక్తికరంగా అనిపించినవి, తమాషా విషయాలు, బాధపెట్టిన-పడిన విషయాలు, అలా కాకుండా ఇలా వుంటే బావుండేది అనుకున్న సందర్భాలు, బాగా సంతోషపడిన క్షణాలు, బాధపడిన నిముషాలు, ఇతరులు తనకు సాయం చేసిన సందర్భాలు, తాను ఇతరులకు సాయపడిన ఘటనలను నిజాయితీగా...డైరీలో రాసుకోవచ్చని చెప్పాలి. అదే సమయంలో వారి డైరీలను మనం తీసి చదవకూడదు. తమకు ప్రైవసీ వుందన్న విషయం వారికి తెలియచేయాలి. ఇదే రీతిలో వారు కూడా ఇతరుల ప్రైవసీని గౌరవించడం నేర్చుకుంటారు. ఇలా మెల్లగా డైరీ రాయడం అలవాటు చేస్తే చిన్నారులకు చాలా ప్రయోజనాలున్నాయి. రాయడం అలవాటవుతుంది. ఒక శైలి ఏర్పడుతుంది. దానికోసం పదజాలాన్ని వెతికి కూర్చడం చేతనవుతుంది. జ్ఞాపకశక్తి పెరుగుతుంది. రోజు మొత్తంలో జరిగిన సంఘటనలను వరుస క్రమంలో గుర్తు తెచ్చుకొని రాయడానికి మెదడును మథించాల్సి వుంటుంది. పైగా ప్రతిరోజూ తప్పనిసరిగా కూర్చుని రాయడం వలన క్రమశిక్షణ కూడా అలవడుతుంది. ఇవన్నీ వారికి ముందు ముందు ఉపయోగపడేవే.

ఆరోగ్యం- డైరీ

డైరీ రాయడం వల్ల మరో ముఖ్యమైన ప్రయోజనం వుంది. మనకు తెలీకుండానే అనారోగ్యానికి గురైన విషయాలను కూడా రాసేస్తుంటాం. ప్రతి సంవత్సరం డైరీ రాసేవారికైతే ఇది మరింత స్పష్టంగా తెలుస్తుంది. మనకు తరచూ ఎలాంటి అనారోగ్యం వస్తోంది? ఎన్ని రోజుల వ్యవధితో అలా జరుగుతోంది? ఏన్ని రోజులు చికిత్స చేయించుకున్నాం? అప్పుడు మనం ఏ విధంగా బాధపడ్డాం? వంటి విషయాలన్నీ రాతపూర్వకంగా తారీకుల వారీగా

స్పష్టంగా వుంటాయి. ఇవి ఒక్కోసారి మనకు ఉపయోగపడే అవకాశం వుంది.

చిన్నమాట...

'కాగితంతో పనేముంది? కంప్యూటర్లు, ఇంటర్నెట్లు అందుబాటులో వుండగా! మేం అందులోనే డైరీ రాసేస్తాం' అనే వారూ కనిపిస్తారు. టెక్నాలజీ ఎంత ఎదిగినా స్వదస్తూరితో రాసిన అక్షరాన్ని చూసుకుంటే కలిగే అనుభూతే వేరు. ఏదేమైనా ఇప్పుడు రకరకాల డైరీలు మార్కెట్లో అందుబాటులో వున్నాయి. భిన్నవృత్తుల వారికి ఉపయోగపడేటువంటి డైరీలు వస్తున్నాయి. ఎన్నో రంగుల్లో...ఎన్నెన్నో డిజైన్లలో ఆకట్టుకునే డైరీని మునివేళ్లతో వెనక్కి తిప్పితే చాలు! కాలచక్రం గిర్రున తిరుగుతుంది. గతం కళ్లముందు సజీవంగా కదలాడుతుంది. దాంతో పాటే మంచీ చెడ్డా...అన్నీ మనోఫలకాన్ని అలా తాకివెళతాయి. చెడ్డ నుంచి గుణపాఠం తీసుకుని మంచిని కలుపుకొని ముందుకు పోవడమే మనం చేయవలసింది.

తెల్సా!



మనం రాసుకునే డైరీలకు పేర్లు కూడా పెట్టుకోవచ్చు. 'డియర్ డైరీ, డియర్ రోజ్, జానీ, జానూ... ఇలా. అన్నేఫ్రాంక్ తన డైరీకి 'కిట్టీ' అని పెట్టుకుంది.

డైరీలను జాగ్రత్తగా వుంచుకోవాలి. పొరపాటున పారేసుకుంటే...అది పడకూడని వారి చేతుల్లో పడిందంటే ఇంక అంతే సంగతులు.

సందర్భాన్ని బట్టి ఫొటోలు, పేపర్ క్లిప్పింగులు కూడా అతికించొచ్చు.

ఖరీదైనవాటికంటే...కాస్త ఖాళీ ఎక్కువగా వున్న డైరీలనే ఎంపిక చేసుకోవాలి.

రోజంతా పూర్తయ్యాక ప్రశాంతంగా రాత్రిపూట కూర్చుని రాసుకోవడం మంచి అలవాటు.

అలాగే రాసిన డైరీని నీట్‌గా వుంచుకోవడం కూడా అలవరచుకోవాలి.

ప్రారంభించగానే పైభాగంలో తేదీ, నెల, సంవత్సరం వేయాలి. రాయడం అయిపోయాక చివరలో సంతకం చేయడం మరవకండి.

సన్నిహితులకు ఏదైనా బహుమతి ఇవ్వాలనుకున్నప్పుడు డైరీని మించినది మరొకటి లేదు. ప్రతిరోజూ దాన్ని తెరవగానే మీరే గుర్తొస్తారు.

మరీ ముఖ్యమైన విషయాలను ఇతరులకు తెలియకూడదు అనుకున్న సంగతులను మీకు మాత్రమే అర్థమయ్యేలా రాసుకోవడం మంచిది.

తర్వాత ఎప్పుడైనా డైరీ తీసి చదివితే మనమీద మనకే అసహ్యం కలిగేలా మాత్రం రాయకూడదు.

ఇతరుల డైరీలను తీసి చదవకూడదు.



చదవాలంటేనే బోర్

నేను ఇంటర్ రెండవ సంవత్సరం చదువుతున్నాను. మా ఇంట్లో బాగా నేర్చుకో, చదువుకో అంటున్నారు. నాకు చిరాకు, కోపం వస్తోంది. అసలు చదవాలంటేనే బోర్‌గా ఉంటుంది. నేర్చుకుని తీరాలా? ఇంతకీ ఈ పెద్దవాళ్ళు అలా ఎందుకు విసిగిస్తారు? చెప్పగలరు.

మధు, ఆదిలాబాద్.

ఆధునిక సమాజంలో, సమాచార వ్యవస్థ అపరిమితంగా విస్తరిస్తున్నది. ఈ దశలో మీరు ఎంత ఎక్కువ అభ్యసిస్తే అంత ఎక్కువ సంపాదించగలరు. అది విజ్ఞానం, ప్రతిభ, డబ్బు, కీర్తి ప్రతిష్టలు, ఇంకేమైనా కావచ్చు. బాగా చదవడానికి మీ పంచేంద్రియాలను విస్తృతంగా ఉపయోగించుకోండి. మీ మైండ్‌ని పలు విషయాలతో నింపండి, మీ మైండ్ పవర్‌ని విరివిగా ఉపయోగించండి. ఇప్పుడు ప్రపంచానికి కావాల్సింది సామాన్యమైన తెలివితేటలు కలిగిన వాళ్ళు కాదు. అసాధారణ ప్రతిభ, సామర్థ్యాలు కలిగిన వాళ్ళే రేపటి ప్రపంచానికి సామ్రాట్టులవుతారు. మీరు ఎంత ఎక్కువగా ప్రిపేర్ అయితే అంత మంచి ఫలితాలను పొందగలరు. పెద్దవాళ్ళు మీ మంచికే చెబుతున్నారని అర్థం చేసుకుని చదువుకోండి. ఆల్ ది బెస్ట్.

నా నిర్ణయం సరైనదేనా?

నేను 8వ తరగతి చదువుతున్నాను. నా తల్లిదండ్రులు చిన్నతనంలో చనిపోయారు. నాకు ఇంజనీర్ కావాలని ఉంది. నాకు ఒక అన్నయ్య ఉన్నాడు. అతనికి ఉద్యోగం లేదు. కనుక కనీసం నాకైనా మంచి ఉద్యోగం రావాలని ప్రతిరోజు చదువు విషయాలే చెబుతుంటాడు. నేను ఎమ్‌సెట్ ఎగ్జామ్ రాయాల్లని ఉంది. నా నిర్ణయం సరైనదేనా? నేను పరిక్ష రాయదానికి ఇంకా నాలుగు సంవత్సరాలున్నాయి. ఆ పరీక్షకి ఈ నాలుగు సంవత్సరాలు ఎలా ప్రిపేర్ కావాలి. అన్ని విషయాలకి సమధానం చెప్పగలరు?

దినేష్, ఖమ్మం.

నీవు ఇంజనీర్ కావాలంటే ఎగ్జామ్ తప్పనిసరిగా రాయాలి. నీవు ఇప్పటి నుంచే ప్రతి సబ్జెక్ట్ అర్థం చేసుకుంటూ చదువు. ఎన్ని డౌట్స్ ఉన్నా మీ ఉపాధ్యాయులను అడిగి మరీ చదువుకో, నీవు చదివే పాఠ్యాంశాల్లో ప్రతిరోజు లెక్కలు, సైన్స్ సబ్జెక్ట్‌లో 'బిట్స్' సొంతంగా రాసుకుని ఒక నోట్స్ తయారు చేసుకో. ఉపాధ్యాయులును అడిగి కొన్ని బిట్స్ రాసుకో. అలా రాసినవి వారానికి ఒకసారి చదువుకో. అప్పుడప్పుడు ఎమ్‌సెట్ ఎగ్జామ్ బాగా రాసినట్లు మంచి ర్యాంకు వచ్చినట్లు ఊహించుకో. ఈ నాలుగు సంవత్సరాలు పరీక్షలు అన్నీ బాగా రాసి చక్కని పర్సంటేజ్ తెచ్చుకో. అప్పుడు ఎమ్‌సెట్ ఎగ్జామ్ నీకు చాలా ఈజీగా అనిపిస్తుంది. నీవు అనుకున్న విధంగా ఇంజనీర్ కాగలవు.

తట్టుకోలేని బాధ

నా వయసు 29 సంవత్సరాలు. నేను ఫైనాన్స్ సంస్థలో పని చేస్తాను. చాలా ఒత్తిడి ఉంటుంది. ఎవరన్నా చిన్న మాట అన్నా చాలా బాధపడతాను. కాళ్ళు, చేతులు తిమ్మిర్లు వస్తాయి. చాలా కోపం వచ్చేస్తుంది. మంచి సూచనలు ఇవ్వగలరని మనవి.

తిరుపాల్, అమలాపురం.

మీకున్న సమస్యను "యాంగ్జైటీ న్యూరోసిస్" అంటారు. కొంత కాలంపాటు రిలాక్సేషన్ టెక్నిక్స్ పాటిస్తూ, మీ ఆలోచనా విధానాన్ని "సైకోథెరపీ" ద్వారా నియంత్రణలోకి తెచ్చుకొంటే పరిస్థితి మెరుగుపడుతుంది. మీకున్న లక్షణాలను మీ మనస్సు యొక్క ప్రభావం శరీరంపై తీవ్రరూపం దాల్చకముందే మంచి సైకాలజిస్ట్‌ను కలవండి.

ఒత్తిడి అధిగమించేదెలా!

నా వయస్సు 28. సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాను. ఒత్తిడి ఎక్కువగా ఉంటుంది. అందరూ "పెళ్ళి చేసుకో ఒత్తిడి తగ్గుతుంది" అంటున్నారు. నిజమేనా?

దత్తు, కదిరి.

వివాహం సంతోషాన్ని హరిస్తుందంటారు కాని పెళ్ళివల్ల జీవితంలో సంతోషంగా మరింత బాగా పని చేయడానికి సహకరిస్తుంది. కొంత వరకు ఒత్తిడి ఉపశమనం లభిస్తుంది. పెళ్లి మానసిక ఉత్తేజాన్ని అందిస్తుంది. వివాహం వ్యక్తిలో ఉద్వేగ స్థిరత్వాన్ని (ఎమోషనల్ కోషియంట్) పెంచుతుంది. ఒకరి అనుబంధాన్ని పెంచడమే కాక, భద్రతను బాధ్యతను తెలియజేస్తుంది. ఆనందంగా గడిపేవారు చాలా ప్రశాంతంగా ఉండగలరు. మీరు మంచి ఉద్యోగం చేస్తున్నారు. కాబట్టి మంచి అమ్మాయి దొరికితే చక్కగా వివాహం చేసుకోండి. జీవితాన్ని ఆనందంగా ఎంజాయ్ చెయ్యండి. ఒత్తిడి దానంతట అదే తగ్గుతుంది ఆల్ ద బెస్ట్.



హిప్నో కమలాకర్
ఫోన్ నెం:9390044031

పదిమంది ముందు మాట్లాడలేనే!

నేను బీటెక్ 3వ సంవత్సరం చదువుతున్నాను. సెమినార్‌లో పాల్గొని చక్కగా మాట్లాడాలని అనుకుంటాను. కానీ మాట్లాడలేకపోతున్నాను. బాగా చదువుతాను. ఓరల్‌గా ఏమీ చెప్పలేకపోతున్నా.. దానితో పరీక్షల్లో మంచి మార్కులు పొందలేకపోతున్నాను. సలహా చెప్పగలరు?

నవీన్,అవనికొండ.

మీకున్న పరిజ్ఞానాన్ని ఇతరులకు అర్థమయ్యే విధంగా చెప్పడమే మాట్లాడడం. న్యూన్యతా భావాలు ఎక్కువగా ఉండడం, నిరాధార అభిప్రాయాలను పెంచుకోవడంవల్లే చాలా మందిలో భయం ఏర్పడుతుంది. మీలో ఉన్న అవరోధాలు ఏమిటో అవగాహన చేసుకుంటే వాటిని అధిగమించడానికి తగిన చర్యలు తీసుకోవడం వల్ల మాట్లాడడం సులభతరం అవుతుంది. మీరు చెప్పే విషయాలను సరళంగా, అలవోకగా, యదృచ్ఛికంగా మాట్లాడుతున్నట్లుగా ముందుగానే ప్రాక్టీసు చేయడం ద్వారా మంచి ఫలితాలను తెచ్చుకోవచ్చు. ఎదుటి వారితో మాట్లాడే పదాలను ఎక్కువగా ఉపయోగించడం వల్ల కమ్యూనికేషన చక్కగా వుంటుంది. సరిగ్గా మాట్లాడలేకపోతున్నాను అని తెలిసి కూడా ఉత్సాహాన్ని కోల్పోకుండా మాట్లాడుతుంటే మీలో ఉన్న భయం పోతుంది. బెస్ట్ ఆఫ్ లక్.



చూద్దామా

అమెరికాలో అలా.. అలా...

ఈవారం గేట్ వే ఆఫ్ ఆర్చ్ గురించీ, లూయీ నగరం, లింకన్ టూంబ్, లింకన్ మ్యూజియం గురించి చెప్తాను. ఈ ఆర్చ్ మిస్సోరి రాష్ట్రంలోని సెయింట్ లూయి నగరంలో వుంది. దీన్నే ది గేట్ వే టు ద వెస్ట్ అని కూడా పిలుస్తారు. దీన్ని ఫిన్నిష్ అమెరికన్ ఆర్కిటెక్ట్ డిజైన్ చేశారు. ఇది 630 అడుగుల పొడవు, 630 అడుగుల వెడల్పుతో రెండు స్థంబాలతో ఆర్చ్ ఆకారంలో ఉంటుంది. అమెరికా సంయుక్త రాష్ట్రంలోనే ఎత్తైన స్మారక చిహ్నం ఇది. 1963లో ప్రారంభమైన దీని నిర్మాణం 1965 అక్టోబర్ 28కి పూర్తయింది. 1967, జులై 24 నుండి ప్రజల సందర్శనానికి అనుమతినిచ్చారు. అమెరికా 16వ ప్రెసిడెంట్ లిండన్ బి. జాన్సన్ కాలంలో దీని నిర్మాణం జరిగింది.

ముక్తవరం వసంత కుమారి

దీన్ని పూర్తిగా స్టెయిన్ లెస్ స్టీల్‌తో దృఢంగా నిర్మించారు. ఆర్చ్ లోపల భాగంలో ఖాళీగా ఉండి విలక్షణమైన రవాణా సాధనాలు ఏర్పాటు చేశారు. ఆర్చ్ ఆకారంలో పైభాగాన మనం చూడటానికి కిటికీలు ఉంటాయి. ఈ ఆర్చ్ నిర్మాణశైలి మేథోపరంగా ఉంటుంది. రేఖాగణిత సూత్రాల ఆధారంగా గొప్ప నిర్మాణ శిల్పులు నిర్మించారు.

బేస్‌గా ఉన్న రెండు స్థంబాలు సమాన కోణాలుగా పైభాగం దాకా కలవవు (మూడొంతుల వరకు). శిఖరాగ్రాన ఈ రెండింటిని కలుపుతూ ఆర్చ్‌లాగా నిర్మించారు. ఎన్నో కష్టనష్టాలకోర్చి చివరకు కేబుల్ లిఫ్ట్ జతపరిచి ఒక ఎలివేటర్ (సన్నటి రెండు ద్వారాలుంటాయి) లాగా విలక్షణమైన ట్రామ్ సిస్టమ్‌ను ఏర్పాటు చేశారు. గింబల్డ్ (ఒకే అక్షంపై వలయాకారంలో తిరగటం) సిస్టమ్‌తో (జెయింట్ వీల్ సూత్రంలో) ఒక ట్రామ్ కారును ఏర్పాటు చేశారు. కొంత వరకు ముప్పావు భాగం ఎలివేటర్‌లో వెళ్లిన తర్వాత వంపు తిరిగే దగ్గర నుండి ట్రామ్ కారు ఉంటుంది. సందర్శకులు ఒకవైపు ఉత్తరం చివర నుండి అబ్జర్వేషన్ ప్రదేశంలో చూసి మళ్లీ దక్షిణం వైపు చివర దగ్గర ట్రామ్ కారులో దిగటం జరుగుతుంది. ఎక్కడానికి 4 నిమిషాలు తీసుకుంటుంది. దిగటానికి 3 నిమిషాలు పడుతుంది. నార్త్ క్యూ, సౌత్ క్యూ మధ్యలో (ఆర్చ్) అబ్జర్వేషన్ ప్రదేశంలో కిటికీల గుండా (630 అడుగుల ఎత్తులో (192 మీటర్లు) మిసిసిపి నదీ ప్రవాహం ముందు భాగాన్ని, సెయింట్ లూయీ నగరాన్ని, సుందరదృశ్యాలు, చూడగల్గుతాము. 630 అడుగుల ఎత్తులో ఆర్చ్ ఆకారంలో ఊగుతున్న ఊయల్లో నిలబడి దృశ్యాలను చూడ్డం ఒక వింత అనుభూతి. అబ్జర్వేషన్ ప్రదేశంలో ప్రదేశంలో ఆ పైభాగాన పట్టుకోడానికి ఇటు అటు రెయిలింగ్ ఉంటుంది. వాలుగా వుంటుంది కనుక నిల్చున్న ప్రదేశంలో జాగ్రత్తగా నడవాల్సి ఉంటుంది.



చిన్న తలుపులున్న ట్రామ్‌కారు కోడిగుడ్డు ఆకారంలో 5 సీట్లతో ఉంటుంది. వంగి కూర్చోవాల్సి ఉంటుంది. సొరంగంలో నుండి వెళ్లడానికి అనువుగా కారును డిజైన్ చేశారు. కంపార్టుమెంట్స్ లింకుతో ఒక ట్రైన్‌లాగా ఉంటుంది. అటువంటివి రెండు ట్రైన్లు ఉంటాయి. ఒక్కొక్క ట్రైన్‌లో 40 మంది చొప్పున మొత్తం 80 మందిని ఒకేసారి తీసుకెళ్లగలవు. 5డిగ్రీల వరకు ఈ ట్రైన్ అటూ ఇటూ ఊగుతూ ఉంటుంది. ఎక్కేటప్పుడు 4 నిమిషాలు, దిగేటప్పుడు 3 నిమిషాలు తీసుకుంటుంది. ఆ తలుపులకు చిన్న కిటికీలుంటాయి. వాటిగుండా మెట్లను (సహజమైన) ఆర్చ్ నిర్మాణ శైలి నైపుణ్యాన్ని చూడొచ్చు. ఆర్చ్ పైభాగానికి వచ్చాక దిగి నడవవచ్చు. అక్కడ చిన్న చిన్న కిటికీల ద్వారా మనం కింద అనేక సుందర దృశ్యాలను చూడొచ్చు. దక్షిణ ఇలినాయ్ రాష్ట్రం, మిసిసిపి నది, సెయింట్ లూయీ నగరం, మిసిసిపియన్ల సంస్కృలను చూడొచ్చు.

ఈ అర్చ్ రెండు ప్రవేశ ద్వారాల వద్ద సెక్యూరిటీ చెక్ పాయింట్స్ ఉంటాయి. ప్రతి అర్చ్ ప్రవేశ ద్వారాల వద్ద మాగ్నిటో మీటర్లు, ఎక్స్‌రే పరికరాలు ఉపయోగించి సందర్శకులను జాగ్రత్తగా చెక్ చేసి ప్రదేశానికి అనుమతి ఇస్తారు. సిసి టీవీలు కూడా అమర్చారు. భద్రతా దళాలు తగు జాగ్రత్తలు తీసుకుంటారు.

లూయీ నగరం



శికాగో నుండి సెయింట్ లూయికి మా బంధువులను చూడడానికి పిల్లలతో వెళ్లాం. దారిలో అమిష్ ప్రజల గ్రామమైన రాక్ లాండ్, స్ప్రింగ్ ఫీల్డ్ (తొలి అమెరికన్ ప్రెసిడెంట్ అబ్రహం లింకన్ నివశించిన ప్రదేశం) సుందర ప్రదేశాలను చూసి ఆనందపడ్డాం.

9వ లూయి రాజు పేరు మీద సెయింట్ లూయి నగరంగా ప్రసిద్ధి చెందింది. మిస్సోరి రాష్ట్రంలో ఉన్న సెయింట్ లూయి నగరంలో రెండు పెద్ద నదులు ప్రవహిస్తాయి. ఒకటి మిసిసిపి (ఇది అమెరికా సంయుక్త రాష్ట్రాలలోనే రెండవ పెద్ద నది). రెండవది మిస్సోరి నది(మిసిసిపి నది మార్క్ ట్వెయిన్ కథల్లో హకిల్ బేఫిల్, టామ్ సాయర్ లలో ఈ నది గురించి ప్రస్తావన ఉంటుంది).

మిస్సోరి నదీ పరీవాహక ప్రాంతంలో అనేక సంస్కృతుల కలయికతో నిండి ఉంటుంది నగరం. గేట్ వే సిటీ అనీ, సెయింట్ లూయి అనీ, గేట్ వే టు వెస్ట్ అనీ (వెస్ట్ నుండి మిస్సోరి నది ద్వారా వలస వచ్చినవారు) పిలుస్తారు. 1904లో ఒలింపిక్ గేమ్స్ కూడా జరిగాయట ఈనగరంలో. అనేక నేషనల్ పార్కులు, స్టేడియాలు కూడా ఉన్నాయి.

లింకన్ టూంబ్

ఇక స్ప్రింగ్ ఫీల్డ్ నగరంలో ఇలినాయి రాష్ట్రం యొక్క ముఖ్య పట్టణం. దీని ప్రత్యేకత ఏమిటంటే, అమెరికా తొలి ప్రెసిడెంట్ అబ్రహం లింకన్ 1831 నుండి 1861 వరకు స్ప్రింగ్ ఫీల్డ్లో ఉన్నారు. 177 అడుగుల పొడవున్న లింకన్ స్థూపాన్ని చూశాం. అబ్రహం లింకన్ కంచువిగ్రహాలు కూడా అనేకం ఉన్నాయి అక్కడ. లింకన్ను సమాధి(1865 ఏప్రిల్15) చేసిన ప్రదేశాన్ని కూడా చూశాం.

లింకన్ మ్యూజియం

అబ్రహం నివశించిన ఇంటి (నేషనల్ హిస్టారిక్ సైట్)ని మ్యూజియంగా మార్చారు. దీన్ని ప్రజలందరూ దర్శిస్తారు. ఆయన అభిరుచుల మేరకు అనేక వస్తువులను అక్కడ భద్రపరచారు. ఇది రెండంతస్తుల భవనం. ఆయన 17 సంవత్సరాల పాటు ఆ ఇంట్లో ఉన్నారు. అయితే ఆ ఇంటి ముందు ఉన్న ఒకటి, రెండు గదుల్లోనే గడిపేవారు. అనవసరమైన వాటికి, విలాసాలకు డబ్బు ఖర్చు చేసేవారు కాదు. తనకు 24 ఏళ్ల వయసప్పుడే స్ప్రింగ్ ఫీల్డ్కు వచ్చారు. న్యాయవాదిగా ఎదగటం, ఇల్లినాయి రాష్ట్రం నుండి ఎన్నికై తొలి ప్రెసిడెంటుగా ఎన్నిక కావడం స్ప్రింగ్ ఫీల్డ్లో ఉన్నప్పుడే జరిగింది. 1842లో మేరీటాడ్ను పెళ్లిచేసుకుని 18వ కార్నర్, జాక్సన్ వీధిలో కాపురం ఉన్నారు. ఇప్పటికీ ఆ ప్రదేశంలో సైనికులు కవాతు చేయటం రివాజుగా వస్తోంది. స్ప్రింగ్ ఫీల్డ్లో 6 నేషనల్ పార్కులు ఉన్నాయి. లింకన్ పేరు మీద అనేక బ్రిడ్జిలు, స్కూళ్లు, నగరాలు వున్నాయిక్కడ.

స్ప్రింగ్ ఫీల్డ్ నుండి శికాగో వెళ్లే దారిలో అమిష్ ప్రజలు నివశించే గ్రామముంది. ఏంటో చూద్దామనే కుతూహలంతో వెళ్లాం. అమిష్ ప్రజల జీవన విధానం చాలా సాధారణంగా ఉంటుంది. ఆధునికతను వారు వ్యతిరేకిస్తారు. గ్యాస్, విద్యుత్, యాంత్రిక సౌకర్యాలు వాళ్లు వుపయోగించరు. వాళ్ల చర్చి సభ్యత్వం తీసుకోవాలంటే బాప్టిజమ్తో ప్రారంభమౌతుంది. 18, 21 సంవత్సరాల వారు పెళ్లి చేసుకోవాలంటే తప్పనిసరిగా చర్చిలో చేరాలి. అలా నమ్మకం వున్నవాళ్లనే పెళ్లి చేసుకుంటారు. వీరిని సనాతన క్రిస్టియన్లని చెప్పొచ్చు. వీరికి బయటి వాళ్లతో సంబంధాలు తెగిపోతాయి. వారంతా ఒక తెగ లేదా ఒక గ్రూపుగా ఉండి పంటలు పండించుకుంటూ, గుర్రాలు, గాడిదలు, సైకిళ్లు మొదలైన వాటితో ప్రయాణాలు చేస్తుంటారు. చేతి వృత్తులు, కర్రలతో స్వయంగా గృహాలు నిర్మించుకుంటారు. స్వంతంగానే అన్నీ పనులు చేసుకుంటారు. అలంకరణ వస్తువులు తయారు చేయటం, యాత్రికులుగా వచ్చిన వారికి వాటిని అమ్మటం చేస్తుంటారు. కొన్ని నగరాలలో పిల్లలు ఇప్పుడు ఆధునికతను కలుపుకొని జీవిస్తున్నారట. మగవాళ్లు వేసుకునే ప్యాంట్లు, వేస్ట్ కోట్లు కూడా ముదురు రంగులవే. గడ్డితో చేసిన టోపీలు, బ్లాక్ బెల్ట్ పెట్టుకుంటారు. చెప్పుల్లేకుండా నడుస్తారు. ఈవిధంగా వారి జీవన శైలి ఉంటుంది. ఆడవాళ్లు డిజైన్లేని కాఫ్ (ఛాతీని కప్పుకునే గుడ్డ), పొడుగు చేతులున్న పొడుగాటి గౌన్లు వేసుకుంటారు. ఇవి నీలం రంగులో గానీ, ముదురు రంగుల్లో కానీ ఉంటాయి. ఇంట్లో ఉన్నప్పుడు ఏప్రాన్ వేసుకుంటారు. శికాగో నుండి సెయింట్ లూయి వరకు ప్రయాణించి అనేక విలక్షణమైన ప్రదేశాలను చూసి చాలా ఆనంద పడ్డాం.

వీరి వీరి గుమ్మడి పండు

జవాబు

వీరి వీరి
గుమ్మడి పండు
వీరి పేరు
ఒబామా



నవ్వులే - పువ్వులే

టీ తర్వాత...

టీచర్ : రాము టీ తర్వాత ఏమొస్తుందిరా?
రాము: బిస్కెట్స్ వస్తాయి టీచర్.

ఆర్. అరుణ్ చంద్, నర్సాపూర్.

ఓ మంచి పుస్తకం

మహాకవి మలిముద్ర ఖడ్గ సృష్టి

- తెర

> 1947లో దేశ స్వాతంత్ర తరుణంలో రాసిన 'మహా సంకల్పం' కవిత వీటిలో అతి ముఖ్యమైంది. ఆయన దూరదృష్టికి సమయస్ఫూర్తికి కూడా సంకేతం.' ఇది నా స్వాతంత్ర దిన మహా సంకల్పం, విధిగా వికసించే చరిత్రకొక కృతజ్ఞత,ప్రభవించిన నూతన భా రత పతాకకభివాదం' అంటూ ఆయన నాటి సంతోష వాతావరణాన్ని స్మరించారు. స్వాతంత్రం చాలా సున్నితమైనపువ్వు,చాలా వాడైన కత్తి, విలువైన వజ్రం అంటూ దాని స్వభావాన్ని మొదట్లోనే ఆవిష్కరించారు.స్వాతంత్రం తెచ్చే బాధ్యతలను సామర్థ్యంతో నిర్వహిస్తామని సంకల్పం చెప్పకుందామంటూ మనుష్యుడే నా సంగీతం, మానవుడే నా సందేశం అన్న శక్తివంతమైన వాక్యాలతో ముగించాడు.



మహాప్రస్థానం కావ్యం వెలువడటానికి ముందే శ్రీశ్రీ తెలుగునాట మహాకవిగా లబ్ధప్రతిష్ఠుడైనాడు. వాస్తవానికి ఆయన కవితలు అప్పటికే సాహిత్యలోకంలో ప్రసిద్ధమైనప్పటికీ ఆర్థిక వనరుల కొరత, ఆ పైన దాని ప్రచురణకు సంబంధించి ఆయన ఆకాంక్షలు మహాప్రస్థానం రాకను ఆలస్యం చేశాయి. కాని ఒకసారి అచ్చులో వెలువడిన తర్వాత అంతా చరిత్రే! తెలుగు భాషనే గాక భావ ప్రవాహాన్ని కూడా అమితంగా ప్రభావితం చేసిన తర్వాత కూడా శ్రీశ్రీ పుస్తకాలు పెద్దగా రాలేదు. ఆయన కవిగా ఒక్క కావ్యంతోనే ఆరిపోయాడన్న మాటలు అనేక చోట్ల వినిపించాయి. సినిమా పాటలకే పరిమితమైనాడన్న విమర్శలు ఒకవైపు, ఆయన వ్యక్తిగత చాపల్యాలు మరో వైపు మహాకవి ప్రతిష్టను ఒకింత మసకబార్చడానికి కారణమైనాయి.ఇలాటి తరుణంలోనే 1966లో 'ఖడ్గసృష్టి' వెలువడింది.వేములవాడ భీమకవి మైలమ భీముడనే తమ రాజును గురించి రాసిన పద్యంలోని ఖడ్గసృష్టి అనే మాటను శ్రీశ్రీ తన గేయానికి శీర్షికగా తీసుకున్నాడు. ఉత్తరోత్తరా అదే కావ్యానికీ నామకరణమైంది. విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్ 1966లో తీసుకొచ్చిన ఈ కావ్యాన్ని శ్రీశ్రీ మరణానంతరం 1999లో విరసం మరింత విస్తరించి చలసాని ప్రసాద్ సంపాదకత్వంలో వివరణలతో సహా ప్రచురించింది. మళ్లీ ఇన్నేళ్ల తర్వాత విశాలాంధ్ర వారే దాన్ని పునర్ముద్రించారు.(ఖడ్గసృష్టి ప్రచురించింది విశాలాంధ్ర సంస్థ అయినా ఆ గేయం అచ్చయింది మాత్రం అప్పట్లో సిపిఎం అధికార పత్రికగా వున్న జనశక్తిలో) మహాప్రస్థానానంతరం శ్రీశ్రీ చాలా గేయాలు గీతాలు రాసినా అంతకు ముందే ఆయన వేసిన బలమైన ముద్ర వాటిలో కనిపించకపోవచ్చు. ఒకానొక ప్రతిభావంతుడైన సృజనశీలి ఒక చారిత్రిక నేపథ్యంలో చేసిన సృజనను అచ్చంగా పునరావృతం చేయడం చరిత్రలో చాలా అరుదు.

అయితే 1966లో ఖడ్గసృష్టి రచనతో శ్రీశ్రీ తన కవిత్వంలో కొత్త దశను ఆవిష్కరించాడనేది నిజం. అంతకుముందు ప్రాచీన కావ్యాల ప్రభావం, సంప్రదాయ ముద్రలు బలంగా వున్న శ్రీశ్రీ ఇప్పుడు పూర్తిగా ఆధునిక మార్గంలోనే నడిచాడు. అలతి అలతి మాటలతో అమోఘమైన సందేశాత్మక సంవిధానాన్ని అనుసరించాడు. అసలు ఖడ్గసృష్టి అన్న మాటలోనే ఆ నూతన సందర్భం ద్యోతకమైంది.

"రెండు రెళ్లు నాలుగన్నందుకు/ గూండాలు గండ్రాళ్లు విసిరే సీమలో/క్షేమం అవిభాజ్యం అంటే/ జైళ్లునోరుతెరిచే భూమిలో" అంటూ ఖడ్గసృష్టి ప్రారంభమవుతుంది. అహింసతోనే స్వాతంత్రం తెచ్చామని చెప్పే పాలకులు " అవినీతి భారీ పరిశ్రమలో/ అన్యాయాల ధరలు పెంచేసి/ స్వాతంత్రాన్ని బ్యాంకుల్లో వేసుకుని/ చక్రవడ్డీకి తిప్పే కామందులకు" లోకాన్ని అర్థం చేసుకున్నవాళ్లంతా పేదల పక్షం వహించడమే పెద్ద అపరాధమైపోయిందని" విమర్శిస్తాడు. "అహింస ఆశయమే కాని ఆయుధం కాదని, సాధించడానికి ఆయుధం అవసరమేనని ప్రకటించి అందుకోసం కలంతో ఖడ్గం సృష్టిస్తున్నానని, జనంతో స్వర్గం నిర్మిస్తున్నానని" ప్రకటించాడు. ఇందులోనే అణవశక్తి కన్న మానవ శక్తి మిన్న అని గొప్ప కవితా వాక్యం పొందుపర్చాడు.

ఈ సంపుటిలో రెండవ గొప్ప కవిత "శరశ్చంద్రిక". చందమామ కేంద్రంగా సాగే ఈ కవిత మహాకవి కాల గతినీ, కవితా రీతినీ కూడా చూపిస్తుంది. 'నవీన విశ్వవిద్యాలయాల్లో/ పురాణ కవిత్వంలాగా/ శ్రవణ

యంత్రశాలల్లో/శాస్త్రీయ సంగీతంలాగా" వచ్చిన వెన్నెలపై కట్టిన వచన కవిత ఇది. "రొమాంటిక్ ప్రమాదంలో పడి / అమాయకంగా నీ బ్యూటీ / అభివర్ణించాను వృత్తాల్లో" అంటూ చందమామపై రాసిన కవితలలో తన యవ్వన జ్ఞాపకాలను నెమరేసుకున్న మహాకవి ఆ సంభాషణా శైలిలో సామాజిక సత్యాలెన్నో చెబుతారు. 'అంతా అగమ్య గోచరం/ అంతా అరణ్యరోదనం' అంటూ మారిన స్థితిగతులను చిత్రిస్తాడు. కష్టపడి ఆర్జించిన స్వాతంత్రం గద్దలు తన్నుకుపోయాయని విమర్శిస్తాడు. సరాసరి నీ దగ్గరికి ఖరారుగా వస్తాంలే అంటూ చంద్రయానాన్ని చాలా ముందుగానే సూచిస్తాడు. చందమామను రోగగ్రస్తుల పాలిపోయిన కపాలాలను స్పృశించమనీ, నేరస్తులైనప్పటికీ నిర్లక్ష్యం చేయకుండా కారాగారాల్లోకి వెన్నెల కిరణాలతో పలకరించమనీ ఏవేవో సూచిస్తాడు. ఆఖరుగా /నువ్వు సముద్రం మీద సంతకం చేసేప్పుడు/ గాలి దాన్ని చెరిపేయకుండా/ కాలమే కాపాడుతుందిలే అని భరోసా ఇస్తాడు. మహాప్రస్థాన శైలికి పూర్తి భిన్నంగా ఆయన భాషలోనే నాలుపోగు లాటి తేలికైన ఈ గీతం శ్రీశ్రీ 1954లోనే రాశాడు. విషాదాంధ్ర అన్న కవితలో అప్పటికి విశాలాంధ్ర అవతరణపై పాలకవర్గాల పిల్లిమొగ్గలనూ మాటమార్పులనూ అక్షరీకరించాడు. 'కొంగల్లారా జపం చెయ్యండి, పిల్లీ పఠించు మంత్రాలు,..." అంటూ ముగిస్తాడు. 1955లో 'విశాలాంధ్రలో ప్రజారాజ్యం' పేరిట రాసిన కవితలో 'శక్తికోసమే నడు,విముక్తి కోసమే నడు' అంటూ పిలుపిస్తాడు.

1947లో దేశ స్వాతంత్ర తరుణంలో రాసిన 'మహా సంకల్పం' కవిత వీటిలో అతి ముఖ్యమైంది. ఆయన దూరదృష్టికి సమయస్ఫూర్తికి కూడా సంకేతం.' ఇది నా స్వాతంత్ర దిన మహా సంకల్పం, విధిగా వికసించే చరిత్రకొక కృతజ్ఞత,ప్రభవించిన నూతన భా రత పతాకకభివాదం' అంటూ ఆయన నాటి సంతోష వాతావరణాన్ని స్మరించారు. స్వాతంత్రం చాలా సున్నితమైనపువ్వు,చాలా వాడైన కత్తి, విలువైన వజ్రం అంటూ దాని స్వభావాన్ని మొదట్లోనే ఆవిష్కరించారు.స్వాతంత్రం తెచ్చే బాధ్యతలను సామర్థ్యంతో నిర్వహిస్తామని సంకల్పం చెప్పుకుందామంటూ మనుష్యుడే నా సంగీతం, మానవుడే నా సందేశం అన్న శక్తివంతమైన వాక్యాలతో ముగించాడు.

ఇలాటి మరో ప్రసిద్ధ గీతం' ఏవి తల్లీ నిరుడు కురిసిన హిమసమూహములు' 1946-47 మధ్య రాసింది. పసిడి రెక్కలు విసిరి కాలం పారిపోయిన జాడలేవీ? ఏవి తల్లీ నిరుడు కురిసిన హిమసమూహములు? అంటూ ముగిసే ఈ గీతంలో ఆయన చరిత్రలో ప్రసిద్ధ వ్యక్తులను స్మరణకు తెచ్చి వారేరని ప్రశ్నిస్తాడు. ఒక విధంగా ఇది కాలగతికి కవితా చిత్రం.

ఖడ్గసృష్టిలో శ్రీశ్రీ అమెరికా సామ్రాజ్యవాదాన్ని నిరసించే చాలా కవితలు చేర్చాడు. ' వినవయ్యా కెన్నెడీ, శ్రీశ్రీశ్రీ మున్నుడి' అంటూ 'లుముంబాను తిన్నావు,కుటుంబాలు కొన్నావు' వంటి చరణాలలో వారి కిరాతకాలను దుయ్యబడతాడు.అరువులిచ్చి కరువు తెచ్చి,రుణం పెట్టి రణం తెచ్చి జనం ధనం ఇంధనమై చరణకరా బంధనమై అంటూ సామ్రాజ్యవాద వ్యూహాలకూ రుణగ్రస్తతకూ అంతస్సంబధాన్ని కవిత్వంలో చెప్పాడు. 'సదసత్సంశయం' అనే శీర్షికలో ఆత్మ పరమాత్మలకు సంబంధించి భౌతిక వాద దృక్పథాన్ని ఆవిష్కరించాడు. సదసత్సంశయం అంటే వుందో లేదో అనే సందేహం.

శ్రీశ్రీ అనువాద కవితలతో పాటు ఆయన అధివాస్తవికత అనబడే సర్రియలిస్టు దశలో చేసిన అనేక అగమ్య కవితలు కూడా ఇందులో వుంటాయి. గాంధీజీపై పదునైన కవితలుంటాయి. విదూషకుడి ఆత్మహత్య, నగరంలో వృషభం వంటి ప్రతీకాత్మక గీతాలున్నాయి. అలాగే ఆయా సందర్భాలలో వెలువరించిన గీతాలూ వుంటాయి. అన్నిటిలోనూ ప్రజా చైతన్యదృష్టి, సామ్రాజ్యవాద వ్యతిరేకత, దోపిడీ దౌర్జన్యాల నిరసన కనిపిస్తాయి. మాటలతో ఆటలు కూడా వుంటాయి. విరసం వారు అదనంగా చేర్చిన కొన్ని కవితలు కూడా ఈ సంపుటిలో వున్నాయి.కొన్నింటిలో కవిత్వం నిజంగానే చిక్కగా లేదనిపిస్తుంది. నిర్వచనాలుగా నిలిచిపోయిన వాక్యాలున్నాయి. అయినా వాటిలోని భావధార మాత్రం చురుక్కుమనిపిస్తుంది. శ్రీశ్రీని అర్థం చేసుకోవడానికి ఆస్వాదించడానికి తప్పక చదవాల్సిన సంపుటి ఖడ్గసృష్టి.

ఖడ్గసృష్టి
శ్రీశ్రీ
వెల : 125/-,
పేజీలు : 141,
ప్రతులు : విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్
బ్యాంక్ స్ట్రీట్,
హైదరాబాద్.









కథ

- సరిదే నాగేశ్వరరావు

విధ్వంసం

తెలతెలవారుతోంది... పోలవరం గెస్ట్‌హౌస్ నుండి బయటికొచ్చాను. వెచ్చని చలికోటు బయటి చలితో పోటీ పడలేకపోతోంది... జేబులో చేతులు పెట్టుకుని తల వంచుకుని నడుస్తున్న నేను ఎందుకో ఒకసారి తల పైకెత్తాను. ఎదురుగా ఆవిష్కృతమైన సుందర దృశ్యం నన్ను పరవశుడిని చేసింది..

'రెండు వైపులా నిండుగా పచ్చదనం నింపుకున్న ఎత్తైన కొండలు.. వాటినానుకొని పసుపు ఎర్రపూల మొక్కలు.. వాటి మధ్య నల్లని తాచులా వంపులు తిరుగుతున్న తారు రోడ్డు.. వాటిని ఆనుకుని గోదావరి పరవళ్ళు.. నాకళ్ళకు విందు చేశాయి. దూరంగా పేరు తెలియని పిట్ట మధురంగా కూస్తోంది.. వాటి కూతలను తలదన్నేలా కోయిల గీతాలు, గాలిలో మంచు బిందువులు ముత్యాల్లా మెరుస్తున్నాయి. పంచరంగులతో ఆకాశంలో చుక్కల్లా భ్రమింపజేస్తున్నాయి.

సన్నని చలిగాలికి పూల మీద మంచు చుక్కలు నేల రాలుతున్నాయి. ప్రకృతి మైమరిపిస్తోంది. అంతలో పెద్ద శబ్దం.. అప్పటి వరకూ కర్ణపేయమైన రాగాలు పలికిస్తున్న ప్రకృతి ఒక్కసారిగా వికృతమైంది. మృదుమధురంగా సన్నని కూతలు పెట్టిన పక్షులు ఒక్కసారిగా గోలగోలగా పైకి లేచాయి. గోదావరి ప్రవాహం ఒక్క క్షణం ఆగిన భ్రమ కలిగింది.

దూరంగా కొండ పేలింది. కాదు బాంబులతో పేల్చారు.. దూరంగా పొగ మంచును డామినేట్ చేస్తూ ఎర్రని ధూళి మేఘాలు ఆకాశాన్ని కమ్ముకుంటున్నాయి. కొన్ని రాతి ముక్కలు గాలిలో తేలుతూ నా ముందుకు వచ్చిపడ్డాయి. మా వాళ్లు అప్పుడే పని మొదలెట్టినట్టున్నారు. వాళ్లు ఎంత వేగంగా పని చేస్తే అంత వేగంగా నేను అక్కడినుండి నా ఊరికి వెళ్లిపోవచ్చు. నేను పోలవరం వచ్చి ఇప్పటికి సరిగ్గా వారం రోజులు అవుతోంది. ఇందిరాసాగర్ ప్రాజెక్టులో భాగంగా స్పిల్‌వే నిర్మించే ప్రదేశాన్ని సర్వే చేయడానికి ప్రభుత్వం నన్ను ప్రత్యేకంగా పంపింది. నేను ఇచ్చే నివేదికపైనే అక్కడి గ్రామాల వునికి ఆధారపడిఉంది. ఎన్ని తండాలు, గూడేలు, గ్రామాలు ఖాళీ చేయించాల్సిందీ నేను సర్వే చేయాల్సి ఉంది.

దూరంగా పోతడు వస్తూ కనిపించాడు. వాడు వస్తూనే

'దండాలు దొరా... బయలెల్దామా..?' అడిగాడు.

> అక్కడ జనం గుమిగూడి ఉన్నారు.. అంతా గిరిజనులే.. అంటే కోయ, లంబాడీ, కొండరెడ్లు, కొండకుమ్మర, కోయదొర అన్ని జాతులవారూ వున్నారు. వారిలో కొందరు జీలుగుకల్లు తాగి ఒళ్లు మరిచి చిందులేస్తున్నారు. అక్కడో అమ్మాయికి ఓ అబ్బాయి నచ్చాడు. మరో అబ్బాయికి ఇంకో అమ్మాయి నచ్చింది... ఇలా యువతీయువకులు జంటలుగా కుల పెద్ద దగ్గరకి వెళ్లి నిలబడుతున్నారు. వారి చేతులు కలిపి కులపెద్ద పెద్దగా అందరికీ వినిపించేలా వారి సంబంధాన్ని ప్రకటిస్తున్నాడు. 'ఈ తంతుతో వారి మధ్య సావాసం మొదలవుతుంది. దొరా.. ఆళ్లకి కులాలు.. గోత్రాలూ అడ్డురావు.. ఒక్క పైసా ఇటు నుండి అటుగానీ అటునుండి ఇటుగానీ మారదు. పెళ్లి కూడా ఇద్దరి దగ్గరా డబ్బులు ఉన్నప్పుడే పెట్టుకుంటారు.

"సరే'.. ఈ వేళ రాకాసి కొండవైపు వెళ్దాం...!" చెప్పాను నేను.

గోదావరిలో బోటుమీద పాపికొండలు చూడ్డానికి వెళ్లే యాత్రికులకు ఒక కొండ రాక్షసుడి ఆకారంలో కనిపిస్తుంది. అందుకే దానిని 'రాకాసి కొండ' అంటారు.

'సరే.. కాని అక్కడ పాములెక్కువ.. మా చెడ్డ ఇషం ఉంటాది ఆటికి.. జర భద్రం దొర..' హెచ్చరించాడు పోతడు. ఈ సర్వే పనిలో నాకు గైడు, అసిస్టెంటు, ఫ్రెండు అన్నీ పోతడే. ఇద్దరం బయల్దేరాం. మేము ప్రయాణిస్తున్న జీపు కొండల మధ్య వేగంగా పోతోంది. జీపులో వెనుక కూర్చున్న పోతడు ఎగిరెగిరి పడుతున్నాడు. డ్రైవర్ ఆ ప్రాంతంవాడే కావడంతో అలవాటుగా జీపు నడుపుతున్నాడు. కొంత దూరం వెళ్లాక జీపు ఆగిపోయింది.

'ఇక్కడ నుంచి కొంత దూరం కొండ ఎక్కాలి దొరా..! అ పైనే ఉంటాది.. జీలుగు గూడెం. ఆడికి జీబు పోదు' చెప్పాడు పోతడు.

జీపు డ్రైవర్‌ని అక్కడే ఉండమని నేనూ పోతడు కొండ ఎక్కడం ప్రారంభించాం. నా సరంజామా అంతా పోతడు మోస్తున్నాడు. ఏమో అనుకుంటాం కానీ నడక కష్టమే... ఒంట్లో కొవ్వు తగ్గడానికి ప్రతి రోజు నేను చేసే మార్నింగ్ వాక్ అనుభవం కొండ ఎక్కడానికి ఏమాత్రం ఉపయోగపడడం లేదు. పోతడు మాత్రం చాలా ఈజీగా కొండ ఎక్కేస్తున్నాడు. దారిలో ఒకరిద్దరు కొండోళ్లు ఎదురై పోతడిని పలకరించారు. నాకు చాలా ఆశ్చర్యం వేసింది. ప్రతి రోజు ఇంత పెద్ద కొండ దిగి పోలవరం వెళ్లి నిత్యావసరాలు తెచ్చుకోవాలంటే చాలా కష్టమే. అదే విషయం పోతడితో అన్నాను.

వాడు చిన్నగా నవ్వి "ఇదేం కష్టం దొరా.. మా బతుకులు చూస్తే చాలా కష్టాలు కనిపిత్తాయ్.. ఇప్పుడంటే పర్లేదు.. వర్షం పత్తే చూడాలి మా కష్టాలు. ఈ కొండ తోవ జారిపోతుంటాది. అప్పుడే ఆస్పటేలుకి పోవాలంటే మనిసిని డోలీ కట్టి మోసుకుపోవాలి" అని వివరించాడు పోతడు.

అతను గిరిజనుల జీవన విధానం గురించి చెబుతూనేవున్నాడు. అవన్నీ వింటుంటే విచిత్రంగా అనిపించింది. అన్ని కష్టాలు పడుతూ వాళ్లు ఇంకా కొండల్లో, అడవుల్లో ఎందుకుండాలి? నాగరిక ప్రపంచంలో వాళ్లకి రిజర్వేషన్లు, పునరావాసాలు ప్రభుత్వం ఏర్పాటు చేస్తూనే ఉన్నా.. ఇంకా ఈ దర్టీ కొండల్నే పట్టుకు

వేళ్లాడతారు.. ఎందుకు..? నాకు కోపం, అసహనం ఒకేసారి కలిగాయి. అదే విషయం పోతడితో అంటే చిన్నగా నవ్వి ఊరుకున్నాడు. వాడి నవ్వులోని పరమార్థం నాకు అర్థం కాలేదు. పైగా కోపం కూడా వచ్చింది. నేనూ మాట్లాడకుండా నడవడం ప్రారంభించాను. మేము ఎక్కుతున్న కొండతో పాటు మరో పన్నెండు కొండలు వరకూ అక్కడ ఉన్నాయి. వెళ్తూ వెళ్తూ ఆగిన పోతడు ఒక బండ దగ్గర మోకాళ్లమీద ఒంగి దణ్ణం పెట్టాడు. అతను మొక్కే బండలు లాంటివి చాలానే ఉన్నాయి అక్కడ. తిరిగి నడవడం మొదలు పెట్టాడు.

ఏం చేయగలను ఎలా ఆపగలను..? ఈ సర్వే ఆపేసినా మరో అధికారి ఆ పని పూర్తి చేస్తాడు. అయినా ఒక నిశ్చయానికి వచ్చాను. నా వరకూ నేను ఈ పని ఆపేస్తాను. పూర్తిగా కాకపోయినా కొన్ని నెలలైనా ఈ ఘోరానికి వాయిదా వేస్తాను.

"ఆ బండ ఏమైనా అమ్మవారా..?" అడిగాను.

'కాదు దొరా.. మా అయ్య సమాధి' చెప్పాడు పోతడు.

అంటే అది శ్మశానమన్న మాట. కానీ మన శ్మశానాలు ఉన్నట్లు భయం గొలిపేలా లేదు ఆ ప్రదేశం. ఆడవిలో ఒక భాగంగానే ఉంది. ముందుకు సాగాం. దూరంగా కొన్ని తాటాకు ఇళ్లు కనిపించాయి.

'అదిగో దొరా. గూడెం వచ్చేశాం..' చెప్పాడు పోతడు.

ఇంతలో నా కాలి మడమపైన ఏదో కుట్టినట్లు చురుక్కుమంది. అదిరిపడి చూశాను. చాలా సన్నగా.. నల్లగా ఉన్న పాము పిల్ల ఒకటి పాకుతూ వెళ్లిపోతోంది. నాకు ముచ్చెమటలు పోశాయి. 'పోతన్నా.. పాము.. పాము..' బిగ్గరగా అరిచాను. పోతడు చెంగున వెనక్కి దూకాడు. నేను చేతితో చూపిన వైపు చూశాడు. అప్పటికి పాము పిల్ల తుప్పల్లోకి వెళ్తూ కనిపించింది. నా కాలు మంట పుట్టసాగింది. ఎర్రని నిప్పు కణిక కాలిపై పెట్టినట్లు బొబ్బలు మొదలయ్యాయి. భరించలేని మంట. కాలు తీసి వేయలేనంత నిస్సత్తువా. నా ఒళ్లంతా భయం ఆవరించింది.

ఎక్కడి హైదరాబాద్.. ఎక్కడి పోలవరం.. చివరికి ఎవరూ లేనట్టు ఈ కొండ మీద దిక్కులేని చావు చావాల్సి వస్తోంది. నేను చచ్చిపోతే నా శవాన్నీ ఈ కొండమీద శ్మశానంలోనే ఖననం చేస్తారా..? ఒక వేళ చేస్తే రేపు పోలవరం ప్రాజెక్టు కట్టినప్పుడు నా సమాధీ మునిగిపోతుంది. నా వాళ్లు చూడడానికి కూడా నా సమాధి ఉండదు. నాలో కంగారు పెరిగింది. కంటి ముందు నల్లని తెరలు.. అక్కడే కూలబడ్డాను. నేను కళ్లు తెరిచేసరికి గూడెంలో ఉన్నాను. అది గూడెం పెద్ద ఇల్లట. నన్ను నేలపైనే పడుకోబెట్టారు. నా కాలికి ఏవో ఆకులు కట్టారు..

నాకు మెలకువ రావడంతో పోతడి కళ్లల్లో ఆనందం కనిపించింది.

'ఇంక భయం లేదు దొర.. ఆకు పసరేశాను... ఒక పూటలో లేచి తిరుగుతావు. మిమ్మల్ని కుట్టింది మామూలు పురుగు కాదు దొరా... రక్తపింజరి.. అది కుట్టిన కాసేపటికే రక్తం కక్కుకు చస్తారు. దొరా.. నువ్వు చానా అదృష్టవంతుడివి. మా గూడెం దగ్గరే అది కుట్టింది' వివరిస్తున్నాడు పోతడు పెద్దయ్య.

నాకు చాలా ఆశ్చర్యం వేసింది. ఈ కొండమీద భయంకరమైన విషానికి విరుగుడు ఉందా.. ఇదే నగరాల్లో అయితే ఎంత హడావుడి చేస్తారు. ఎన్ని వేలు గుంజుతారు...? అలాంటిది చిన్న ఆకుపసరుతో కాలకూటానికి సైతం వీళ్లు విరుగుడు చేస్తున్నారే..? నెమ్మదిగా లేచి కూర్చున్నాను.

బయట ఏదో గోల గోలగా ఉంది. ఆ విషయమే అడిగాను.

'గూడెం జాతర దొరా.. అదీ సందడి. చుట్టుపక్కల తండాల జనం వత్తారు. ఈ జాతరకి' వివరించాడు పోతడు. అతని సాయంతో నెమ్మదిగా బయటికి నడిచాడు. అక్కడ జనం గూమిగూడి ఉన్నారు.. అంతా గిరిజనులే.. అంటే కోయ, లంబాడీ, కొండరెడ్లు, కొండకుమ్మర, కోయదొర అన్ని జాతులవారూ వున్నారు. వారిలో కొందరు జీలుగుకల్లు తాగి ఒళ్లు మరిచి చిందులేస్తున్నారు. అక్కడో అమ్మాయికి ఓ అబ్బాయి నచ్చాడు. మరో అబ్బాయికి ఇంకో అమ్మాయి నచ్చింది... ఇలా యువతీయువకులు జంటలుగా కుల పెద్ద దగ్గరకి వెళ్లి నిలబడుతున్నారు. వారి చేతులు కలిపి కులపెద్ద పెద్దగా అందరికీ వినిపించేలా వారి సంబంధాన్ని ప్రకటిస్తున్నాడు.

'ఈ తంతుతో వారి మధ్య సావాసం మొదలవుతుంది. దొరా.. ఆళ్లకి కులాలు.. గోత్రాలూ అడ్డురావు.. ఒక్క పైసా ఇటు నుండి అటుగానీ అటునుండి ఇటుగానీ మారదు. పెళ్లి కూడా ఇద్దరి దగ్గరా డబ్బులు ఉన్నప్పుడే పెట్టుకుంటారు. అప్పటివరకు కాపురం చేసుకోడానికి అనే తంతు వీలు చిక్కినప్పుడే జరిపిస్తారు..' వివరించాడు పోతడు.

నాకు చాలా ఆశ్చర్యం వేసింది. ఈ తంతునే ఆధునిక సమాజంలో 'డేటింగ్' అంటున్నారని తెలీదు. అయినా శతాబ్దాలుగా దీనిని ఆచరిస్తున్నారు. వీళ్లకి కట్నం, కానుకల గొడవ లేదు. కులం గోల లేదు. ఫ్యాక్షన్ ఊసు తెలీదు. స్వచ్ఛమైన ప్రకృతి ఒడిలో హాయిగా బతికేస్తున్నారు. ఇంకా విచిత్రం ఏమంటే దాదాపు అన్ని గిరిజన తెగల్లోనూ బహుభార్యత్వం అమలులో ఉంది. ఒక యువకుడు ఇద్దరు లేదా ముగ్గురిని వివాహం చేసుకోవచ్చట. అన్న భార్యను తమ్ముడి భార్యను పునర్వివాహం చేసుకునే పద్ధతి అమలులో ఉంది. వారు వేరు వేరుగా కాపురాలు చేస్తున్నా పండుగలు జాతరలు కలిసే చేసుకుంటారట. కానీ వీళ్ల సంస్కృతి, వాటి చిహ్నాలు ఎంత కాలం ఉంటాయి. నేను రిపోర్టు ఇచ్చిన నెల రోజుల్లో మటుమాయం అవుతాయి. పునరావాసం పేరిట ఈ తండాలను బలవంతంగానైనా ఖాళీ చేయిస్తారు. ఈ పచ్చని ఎత్తైన పాపి కొండలు నిండా గోదావరిలో మునుగుతాయి. పసిబాలల్లా బోసి నవ్వులు నవ్వుతున్న ఈ పూలు ఇక కనిపించవు. ఒంటి నిండా రంగు రంగుల పూల దండలు..తలపై కొమ్ము కిరీటాలు.. ఎముకల దండ కడియాలు విచిత్ర వేషధారణతో అమాయకంగా కనిపించే కోయ, లంబాడీ, కొండరెడ్లు, కొండకుమ్మర, కోయదొర జాతుల సంస్కృతులు గోదాట్లో కలిసిపోతాయి. ఎంత ఘోరం.. ఎంత అన్యాయం.. నాగరికత ముసుగులో.. అభివృద్ధివంకతో జరుగుతున్న వినాశనాన్ని చూస్తూ... చూస్తూ.. అపలేకపోతున్నాను. అంతే కాదు ఈ విధ్వంసంలో నేను సైతం పాలు పంచుకుంటున్నాను. పోలవరం ప్రాజెక్టు నిర్మాణం పనులను పర్యవేక్షించే పనిలో పాలు పంచుకుంటున్న నేను ఆ పాపం..!?! లోనూ పాలు పంచుకుంటున్నాను. నా మనసు బాధగా మూలిగింది. ఏం చేయగలను ఎలా ఆపగలను..? ఈ సర్వే ఆపేసినా మరో అధికారి ఆ పని పూర్తి చేస్తాడు. అయినా ఒక నిశ్చయానికి వచ్చాను. నా వరకూ నేను ఈ పని ఆపేస్తాను. పూర్తిగా కాకపోయినా కొన్ని నెలలైనా ఈ ఘోరానికి వాయిదా వేస్తాను. ఆపై కాలమే ఈ ప్రకృతి బిడ్డల భవిష్యత్తును నిర్ణయిస్తుంది. పోతడు, మరో మనిషి మోస్తున్న డోలీలో కొండ దిగువకి బయలుదేరాను.

దూరంగా గిరిజనులు వాయిస్తున్న డప్పులు కొమ్ము బూరల శబ్దం వినిపిస్తోంది.

నెమ్మదిగా ఆ శబ్దం దూరం అయ్యింది.

✠

కొత్త పుస్తకాలు

మన గవర్నర్



రచన : ఆచార్య యార్లగడ్డ లక్ష్మీప్రసాద్
పేజీలు : 157, వెల : రూ.100/-
ప్రచురణ : లోక్ నాయక్ ఫౌండేషన్
ఇంజనీరింగ్ విశ్వ విద్యాలయం, విశాఖపట్నం.

హిందీలోనూ, తెలుగులోనూ సమానాధికారం గల యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ "మన గవర్నర్ నారాయణదత్ తివారి" పేరుతో తివారి జీవిత చరిత్రను వెలువరించారు.

"ఆదాన్-ప్రదాన్" కార్యక్రమంలో భాగంగా హిందీ-తెలుగు-భాషలలో పలు గ్రంథాలు వెలువరించారు యార్లగడ్డ వారు. అనువాదాలు, జీవిత చరిత్రలు, సృజనాత్మక రచనలు అందించారు. అరవైఏళ్ళ స్వరాజ్య భారతదేశ చరిత్రలో ఏడుగురు ప్రధాన మంత్రులను ఉత్తర ప్రదేశ్ అందిస్తే, ఆ రాష్ట్రానికి మన ఆంధ్రప్రదేశ్ ఏడుగురు గవర్నర్లను అందించింది. నెహ్రూ, లాల్‌బహదూర్, ఇందిర, రాజీవ్, చరణ్‌సింగ్, చంద్రశేఖర్, విపిసింగ్, యుపికి చెందినవారైతే ఆ రాష్ట్రానికి మన తెలుగువాళ్లు సరోజినీనాయుడు, వివిగిరి, చెన్నారెడ్డి, బూర్గుల రామకృష్ణారావు, బెజవాడ గోపాలరెడ్డి, బి.సత్యనారాయణరెడ్డి, మీర్ అక్బర్ అలీఖాన్‌లు గవర్నర్లుగా పనిచేశారు. 26 సంవత్సరాలు ఎమ్మెల్యే అయిన తివారీ, యుపికి ముఖ్యమంత్రిగా ఆ తరువాత 27వ రాష్ట్రంగా ఏర్పడ్డ ఉత్తరాంచల్‌కు ప్రప్రథమ ముఖ్యమంత్రిగా పనిచేశారు. తొలి రోజుల్లో సోషలిస్ట్‌గా ఉన్న తివారీ నైనిటాల్ శాసనసభ్యుడిగా సోషలిస్టు పార్టీ ద్వారానే ఎన్నికయ్యారు. ఆ తరువాతనే కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. స్థానిక కమిషన్ ఉపాధ్యక్షునిగా ఆరవ పంచవర్ష ప్రణాళికా రూప శిల్పిగా తివారి రాష్ట్ర ముఖ్య మంత్రులను మెప్పించారు. తివారి కేంద్ర ఆర్థిక శాఖ, విదేశాంగ శాఖా మంత్రిగా రాజీవ్ కొలువులో పనిచేశారు. డాక్టర్ వైయస్ రాజశేఖరరెడ్డి, డాక్టర్ వియస్ రమాదేవి, డి.పురంధరేశ్వరి రాసిన అభిప్రాయాలు ముందు మాటలు... రంగుల్లో తివారి వర్ణచిత్రాలు (ఫొటోలు), పుస్తకానికి నిండుదనాన్నిచ్చాయి. ఈ గ్రంథాన్ని వంద పేజీల్లో 11 అధ్యాయాలుగా రాశారు. తివారి జననం, విద్యాభ్యాసం, రాజకీయ జీవిత ప్రారంభం, ఎమ్మెల్యేగా, యుపి రాష్ట్ర ముఖ్యమంత్రిగా సేవలు, ఉత్తరాంచల్ తొలి ముఖ్యమంత్రిగా, లక్నో నుండి ఢిల్లీకి కేంద్ర కార్మిక శాఖా మంత్రిగా, కేంద్ర పరిశ్రమల మంత్రిగా, ఢిల్లీ, లక్నో, ఢిల్లీ, విదేశాంగ మంత్రిగా, కేంద్ర వాణిజ్య మరియు ఆర్థిక శాఖా మంత్రిగా, చివరన తివారి ప్రసంగాలు... ఈ గ్రంథంలో చోటు చేసుకున్నాయి. ఈ దేశ ఆర్థిక పరిస్థితులు, పరిశ్రమలు, విదేశాంగ నీతి, భారత రాజకీయ పరిస్థితులు, అన్నీ సజావుగా సక్రమంగా ఉన్నాయన్న భావన ఈ గ్రంథంలో చాలా అంశాలు కలిగిస్తాయి. కానీ వేరే వైపు లోతులు తెలిసిన వారికి, నెహ్రూ కాలం నుండి నేటి మన్‌మోహన్ అణు ఒప్పందాల కాలం దాకా వామపక్ష ఇతర ప్రగతి శీల శక్తులు సాగించిన పోరాట పంథాను పరిశీలించిన వారికి ఈ అవిరళ ప్రశంసలు త్వరగా మింగుడు పడవు... బోఫోర్స్ కుంభకోణాలు, హర్షద్ మెహతా బ్యాంక్ దివాళాలు, షేర్లు మార్కెట్ బడిదుడుకులు, 1991 నూతన ఆర్థిక విధానాలకు తివాచి పరచిన తివారీల నిర్వాకం, త్వరగా ప్రజలు మరువలేరు. ఈ గ్రంథంలో కొన్ని అంశాలు పరిశీలిస్తే.... 1946లో అఖిల భారత పోస్టల్ ఉద్యోగుల ఉద్యమంలో విద్యార్థి నాయకులు బహిరంగంగా పాల్గొన్నారు. తివారి ఖైదు చేయబడ్డారు.

జయప్రకాష్ నారాయణ్, మినూమసానీ, అచ్యుత పటవర్థన్, అశోక్ మెహతా, ఆచార్య నరేంద్రదేవ్ వంటి కాంగ్రెస్ సోషలిస్ట్ గ్రూప్ ప్రభావంతో నరేంద్రదేవ్ ఆహ్వానం మేరకు తివారి సోషలిస్టు పార్టీలో చేరారు. కుమావూ రోడ్‌వేజ్ ఉద్యోగుల యూనియన్, మున్సిపల్ ఉద్యోగుల యూనియన్, కార్‌గోదోకు రైల్వే కూలీ యూనియన్లకు, చక్కెరమిల్లు కార్మికుల యూనియన్, నాల్గో తరగతి ఉద్యోగుల యూనియన్ లకు నాయకత్వం వహించారు తివారీ (పేజీ11). 1952, 1957లలో నైనిటాల్‌నుండి ఎం.ఎల్.ఏగా గెలిచారు. సోషలిస్ట్ అభ్యర్థిగా, కాంగ్రెస్ అభ్యర్థిగా శ్యామ్ లాల్ వర్మ తరుపున దేశ ప్రధాని నెహ్రూ వచ్చి ఓట్లు అభ్యర్థించినా 1957లో కాంగ్రెస్ అభ్యర్థిపై తివారి గెలిచారు(పేజీ13). 1975 ఎమర్జెన్సీ కాలంలో తివారీని ఇందిరాగాంధీ యు.పి. ముఖ్యమంత్రిగా నియమించింది. 1980లో ఇందిరమ్మ తన మంత్రివర్గంలో ప్రణాళికా శాఖ అప్పజెప్పింది. కార్మిక శాఖ, మరియు పరిశ్రమల శాఖ కూడా అప్పజెప్పింది (పేజీ117). 1987లో విదేశాంగ మంత్రిగా రాజీవ్ కొలువులో పనిచేశారు తివారీ.

తివారి కృషిని(పేజీ23) విమర్శనాత్మకంగా పరిశీలించాలి. ఆర్థిక మంత్రిగా 9 సార్లు యు.పిలో బడ్జెట్ సమర్పణ(పేజీ27) ప్రత్యేక చిన్నరాష్ట్రాల విభజన వల్ల అభివృద్ధి కుంటుబడుతుంది అని మేధావులు సెలవిస్తుంటే, ఈ గ్రంథంలో(పేజీ39-40) యు.పి నుండి విడివడిన ఉత్తరాంచల్‌లో ఎంతో అభివృద్ధి సాధించినట్లు రాశారు. అధ్యయన వాదులే ఈ గణాంక వివరాలపై నిగ్గుతేల్చి వాస్తవాలు రాయాల్సి ఉంటుంది. అంతర్జాతీయ ద్రవ్యనిధి, స్విస్ బ్యాంక్‌లోని మొత్తం డబ్బు 34,23,750 లక్షలని, దాంట్లో భారతీయుల ద్వారా జమ చేయబడ్డది 187కోట్లు అని పేర్కొంది. ఇది 1984లో విషయం. మొత్తం సొమ్ములో 0.6 శాతం. ఈ సొమ్ము ప్రభుత్వం ద్వారా కాకుండా తప్పుదార్లో జమ అవడం(పేజీ86) వంటి ఎన్నో ఆసక్తికర, రాజకీయ, సామాజిక, కార్మికోద్యమ, ప్రభుత్వ ప్రణాళికా రచనలు, విదేశాంగ విధానం, రైతాంగం పై సర్కార్ విధి, విధానాలు(పేజీ90-91), సీనియర్ రాజకీయ వేత్తగా తివారి గురించి తెలుసుకోవడానికి ఈ పుస్తకం ఉపకరిస్తుంది.

తంగిరాల చక్రవర్తి



రేకులు విచ్చిన మొగ్గ
తాతోలు దుర్గాచారి
వెల : 50/-, పేజీలు :48,
ప్రతులకు : తాతోలు దుర్గాచారి
ఆర్.టి.సి కండక్టర్,కవి
శ్రీదుర్గా కళానిలయం,
ఇం.నెం.19-4-61/4,
క్రాంతి ఐ.టి.ఐ దగ్గర,
గాంధీనగర్, గొల్లగట్టరోడ్, భద్రాచలం,
ఖమ్మం.



తాతోలు హైకూలు
తాతోలు దుర్గాచారి
వెల : 50/-, పేజీలు : 28,
ప్రతులకు : తాతోలు దుర్గాచారి
ఆర్.టి.సి కండక్టర్,కవి
శ్రీదుర్గా కళానిలయం,
ఇం.నెం.19-4-61/4,
క్రాంతి ఐ.టి.ఐ దగ్గర,
గాంధీనగర్, గొల్లగట్టరోడ్,
భద్రాచలం,
ఖమ్మం.





మ... మంచు హోటల్

మాంచి చలికాలం. గదిలో ఫ్యాన్ ఫుల్లు స్పీడులో తిరుగుతోందనుకోండి. ఎలా వుంటుంది?! వెంటనే వెచ్చగా రగ్గు కప్పేసుకోవాలనిపిస్తుంది. అలాంటిది ఏకంగా మంచుతో చేసిన హోటల్లోకి వె...ళి...తే ఎలా వుంటుందో ఒక్కసారి ఆలోచించండి. 'వ్వ..వ్వ..వణుకు రాదూ!' అంటారా. చూశారా తల్చుకుంటేనే వణుకొచ్చేస్తోంది. ఇంక నిజంగా అక్కడికెళితేనా! 'అయినా మీ పిచ్చిగానీ అలాంటి హోటల్ని బుర్ర వున్నవాడెవడూ కట్టడు' అనుకుంటున్నారు కొంతమంది లోలోపల. కానీ నిజంగానే వుంది. రుజువు కావాలంటే మాత్రం ఫిన్లాండ్ వెళ్లాల్సిందే. వెయ్యి ట్రక్కుల మంచును ఉపయోగించి మూడు వారాలపాటు పదిహేనుమంది శిల్పులు కష్టపడి కట్టారు. ఇంతకీ అక్కడ ఉష్ణోగ్రత ఎంత వుంటుందనుకుంటున్నారు?! ఆ ఎంత 0 నుంచి 5 డిగ్రీల సెంటీగ్రేడ్ మాత్రమే. చూశారుగా అక్కడ గదులు ఎంత అందంగా వున్నాయో. అన్నట్టు అందులో వాడే బల్లలు, మంచాలు, టేబుళ్లు...అన్నీ మంచువే. కాకపోతే ఆ చలిని తట్టుకోడానికి అనువైన బట్టలను మాత్రం హోటల్ యాజమాన్యమే ఇస్తుందిలెండి. సో...ధైర్యే సాహసే మంచు హోటల్ దర్శనం. ఓకేనా!

రాజుగారి మీసం

భవతి రాజ్యాన్ని పాలించే తనో వర్మకు, తన శిలా విగ్రహాన్ని రాజధాని నడిబొడ్డున ప్రతిష్ఠించుకోవాలని కోరిక కలిగింది. వెంటనే శిల్పుల గురించి ఆరా తీశాడు. పక్క రాజ్యంలో చిదానంద చారనే గొప్ప శిల్పి వున్నాడని, దేవతల విగ్రహాలు చెక్కడంలో దిట్టని తెలుసుకుని, తన భటుల ద్వారా పిలిపించాడు. తన మనోగతాన్ని తెలిపి, "శిల్పం అచ్చుగుద్దినట్టుగా ఉండాలి. చూడగానే రాజే ఇక్కడ నిలబడ్డాడా? అనే భ్రమ కలగాలి. జీవం తొణికిసలాడుతూ, అందంగానూ అద్భుతంగానూ ఉండాలి. మీకు ముందుగానే లక్ష వరహాలిస్తున్నాను. ఇంకా కావాలంటే, కబురు చేయండి. పంపిస్తాను. శిల్పం చెడిపోయిందో, మీ తల ఎగిరిపోద్ది" అన్నాడు కటువుగా.

రాజాజ్ఞ మేరకు, శిల్పి కోరిక ప్రకారం నల్లని గండ శిలలు తోలారు సేవకులు. ఒక పెద్ద మందిరంలో తన శిష్యులతో పాటు ఉంటూ నిలువెత్తు రాజు శిల్పం చెక్క సాగాడు. తను శిల్పం చెక్కేప్పుడు ఏకాగ్రత దెబ్బ తింటుందని, ఎవరినీ లోపలకు రానిచ్చేవాడు కాదు. శిల్పం పూర్తయ్యేదాకా ఎవరికీ చూపించేవాడు కాదు వంకలు పెడతారని. ఒక రోజు చెక్కడం పూర్తికాగానే తెల్లని వస్త్రం కప్పేసి, ఎవరికీ కనబడకుండా చేసేవాడు. ఆరు నెల్లపాటు శ్రమించి, చెక్కడం పూర్తికాగానే, తన ప్రధాన శిష్యుణ్ణి పిలిచాడు. ఎలా ఉంది శిల్పం? అని అడిగాడు గర్వంగా.

శిల్పాన్ని నఖ, శిఖ పర్యంతం పరిశీలించి, "అమోఘం గురువు గారూ. మీచేతిలో కఠినమైన రాయి సైతం మైనం ముద్దలా మారి, అద్భుత శిల్పంలా రూపుదిద్దుకుంటుంది. కానీ... పెద్ద పొరపాటు జరిగిపోయింది అన్నాడు" ఆందోళనగా.

"ఏంటది?" అన్నాడు భయంగా.

"రాజుగారి మీసాలు చెక్కడం మర్చిపోయారు. దీన్నిప్పుడు చూస్తే, మీసాలు పెట్టకుండా నన్ను అవమానిస్తారా? అని మన శిరసులు ఖండించొచ్చు. మనం చెప్పాపెట్టకుండా రాత్రికి రాత్రి నగరం వదిలిపెట్టి పారిపోవడం క్షేమం" అన్నాడు వణుకుతూ.

గురువుగారి గుండెల్లో గుండ్రాయి పడింది. చెమటలు పట్టి వణుకు మొదలైంది. "ఈ విషయం గురించి నువ్వెక్కడా, ఎవరితోనూ మాట్లాడకు. నేనే ఏదో విధంగా నమ్మించి, అంటకడతా" అన్నాడు.

శిలా విగ్రహం చెక్కడం పూర్తయిందని తెలుసుకున్న రాజు, చూడడానికి వస్తున్నాడని కబురు చేశాడు ఉత్సుకతతో.

చిదానంద చారి, రాజుగారిని సాదరంగా గదిలోనికి తీసుకుపోయి, విగ్రహంమీది తెర తొలిగించాడు.

చూసిన రాజు తన కళ్లను తనే నమ్మలేక పోయాడు. తన ప్రతి రూపమే విగ్రహంగా మారిందా? అన్నట్లుగా తోచిందా శిల్పం. కానీ... ఇదేంటి... మీసాలు లేవు. తనవి పెట్టుడు మీసాలనే సంగతి వీడికి తెలిసి పోయినట్టుంది. లేకుంటే వాడిట్లా చెక్కడు అని తర్జన భర్జన పడి, శిల్పిని పక్కకు పిలిచాడు.

"నీ సూక్ష్మ పరిశీలనకు మెచ్చుకోకుండా ఉండలేకపోతున్నాను. నాకు మీసాలు లేవనే సంగతి చక్కగా కనిపెట్టావు. బావుంది. కానీ నేను రోజూ పెట్టుకుంటున్నట్లుగానే, విగ్రహానికి కూడా మీసాలు చెక్కి ఉంటే బాగుండేది కదా?" అన్నాడు.

హమ్మయ్య ఒక రహస్యం తెలిసిపోయిందని, గుండె బరువు దింపుకుని, దీర్ఘంగా శ్వాస వదిలాడు.

"మీరన్నదాంట్లోనూ వాస్తవం ఉంది. కానీ, మీరు అచ్చం మీ మాదిరిగానే చెక్కాలన్నారు. మీసం చెక్కితే కృత్రిమంగా ఉంటుంది" అన్నాడు తెలివిగా.

"బాగుంది బాగుంది. నీ సూక్ష్మ పరిశీలనకు నా అభినందనలు. మరో లక్ష వరహాలు పంపిస్తా. తీసుకో. రేపటి ఆశ్వీయుజ చతుర్దశి నాడు విగ్రహ ప్రతిష్ఠ జరగాలి. ఏర్పాట్లు చేయించు" అని తన వెంట వచ్చిన మంత్రిని ఆదేశించాడు.

నగరం నడి బొడ్డున అట్టహాసంగా, మేళ తాళాలతో మంత్రోచ్ఛారణ మధ్య, విగ్రహ ప్రతిష్ఠ జరిగింది రాజుగారి చేతుల మీదుగా. తను వచ్చిన పని పూర్తిగావడంతో, శిష్యులతో చల్లగా జారుకున్నాడు చిదానంద చారి.

"రెండు లక్షల వరహాలు పోసి రాజుగారి విగ్రహం కోరి చేయించుకున్నాడు. బాగోలేదని విమర్శిస్తే తల తీయిస్తాడు" అనుకుంటూ ప్రజలంతా ఓహో... బ్రహ్మాండంగా ఉంది. ఈ శిల్పి యముణ్ణే మించి పోయాడు అని ప్రశంసించ సాగారు.

ఏటి ఒడ్డున ఉన్న గుడిలో శ్రీ కృష్ణార్చన చేసి, తిరిగి వస్తున్న పట్టపు రాణి ప్రభావతికి విగ్రహం కనిపించింది.

"అరె? ఇదేంటి...? రాజు గారికి మీసాలు లేవు. ఆయనకు మీసాలు లేవనే సంగతి నా ఒక్క దానికి తప్ప ఎవరికీ తెలియదే? శిల్పికి ఈ రహస్యం చెప్పి కావాలనే చెక్కించాడా?" అర్థం కాక ఆలోచిస్తూ, కొద్ది సేపు చాటుగా ఉండి, తన రథసారథికి, ఇలా చేయమని చెప్పింది.

తను బాటసారిలా విగ్రహం ముందు నిలబడి, వెళ్తున్న రైతును పిలిచి, నేను ఈ ఊరికి కొత్త. ఈ విగ్రహం ఎవరిది ? అనడిగాడు సారథి.

"అరవకయ్యా మొగడా? ఈ విగ్రహం రాజు గారిదే. కానీ రాజుకు మీసాలు లేకుండా చెక్కాడు. మీసం లేనోడంటే. పౌరుషం లేనోడన్నమాట. జనమంతా ఇదే మాట చెప్పకుంటున్నారు. ఎక్కడా అనకు. రాజుకు తెలిస్తే తల తీసేయిస్తాడు. నీ కెందుకూ? నువ్వు కూడా బాగుందని తల వంచుకుని వెళ్లు" అన్నాడా రైతు వెళ్లిపోతూ.

బొంగరాలాట ఆడుతున్న ఇద్దరు పిల్లల్ని పిలిచి, బాబూ...మాది దూర దేశం. ఈ రాజ్యానికి కొత్తగా వచ్చాను. ఇంతకూ, ఇక్కడ పెట్టిన ఈ విగ్రహం ఎవరిదీ? అగడిగాడు.

"రాజుగారిది" అని ఒక పిల్లవాడు చెప్పగానే "కాదురా, రాజుదైతే మీసాలుండాలి కదా? రాజు గారి తండ్రి గారిదట. మా అవ్వ చెప్పింది. ఆయనకు మీసాలు లేనే లేవట" అన్నాడు మరో పిల్లవాడు.

ఇంక అడిగినంత వరకు చాలనుకుని , మహారాణి వద్దకు వెళ్లి, వాళ్లన్న మాటలన్నీ చెప్పాడు. రాణి కోపంతో అంతఃపురం చేరుకుంది.

సాయంత్రం తన వద్దకొచ్చిన రాజుతో తను విన్నదంతా పూస గుచ్చినట్లు చెప్పి, "కోరి నమస్కారం పెట్టించుకోవడం, ప్రజలు స్మరించాలని విగ్రహాలు పెట్టించుకోవడం, బుద్ధిహీనులు చేసే పని. త్యాగ శీలిగా శిబి చక్రవర్తిని చెప్పకుంటాం. వారిదో విగ్రహం చూపించండి. పరాక్రమానికి విక్రమాదిత్యుని పేరు తలుస్తాం. వారిది ఒక్క చిత్రం చూపించండి. వారికి లేని విగ్రహాలు మీకెందుకండి. విగ్రహాల వల్ల పొరుగు రాజులు దండెత్తకుండా ఆగేదిలేదు. ప్రజలకు భక్తి పుట్టేదీ లేదు. మీరు ప్రజా క్షేమాన్నే పరమార్థంగా తలిచే రాజయితే, ప్రజల నోళ్లల్లోనే నిలిచి పోతారు. వెంటనే ఆ విగ్రహం తీసేయించండి" అంది కోపంగా మహారాణి.

"అంతేనంటావా?.... ఒకవేళ మీసాలతో చెక్కి ఉంటే, ఒప్పకునేదానివా?" అన్నాడు సందేహంగా.

"మీసాలున్నా లేకపోయినా మనం మన విగ్రహాలు ఏర్పాటు చేసుకోకూడదండి. ప్రజలు స్పందించి, స్వచ్ఛంగా ఏర్పాటు చేసుకుంటే అభ్యంతరం ఉండదు" అంది రాణి ప్రభావతి.

"ఈ శిల్పి మహాగడుసువాడిలా ఉన్నాడే..? మీసాలు లేకుండా చెక్కి మంచి గుణపాఠమే నేర్పిపోయాడు" అనుకుంటూ తన విగ్రహాన్ని మరుసటిరోజే తీసివేయించాడు.

- పుప్పాల కృష్ణమూర్తి